ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం : fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-4-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 69 పేజీలు: 16 వెల: 6.50



**ఓట్లు దంచేశారు..**
3 రాష్ట్రాల్లో అంచనాలు మించి ఓటింగ్
75% దాటిన పోలింగ్
5

## లెబనాన్‌లో విధ్వంసం

**254 మంది మృతి..**

10 ఆయుధ నిల్వ కేంద్రాలు ధ్వంసం

హెజ్‌బొల్లా అగ్రనేత యూసఫ్ హతం

ఇజ్రాయెల్ భద్రతలో రాజీపడబోం: ఐడిఎఫ్



పశ్చిమాసియాలో ఉత్కంఠకు తెరపడలేదు. ఉద్రిక్తతలూ తొలగి పోలేదు. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం కుదరడంతో యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయినట్లు కనిపించినా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.
5

## సౌదీ పైప్‌లైన్‌పై ఇరాన్ దాడి



పంపింగ్ స్టేషన్‌లో ఎగిసిపడ్డ అగ్నికీలలు

హోర్ముజ్ జలసంధిని మూసేసిన ఇరాన్



## ట్రంప్ వార్నింగ్

వెనక్కి తగ్గేది లేదు

హోర్ముజ్ తెరవకపోతే కఠినంగా వ్యవహరిస్తాం..

# భూ రికార్డులు మార్చలేరు



- ఆటో మ్యుటేషన్ తర్వాత ఇంటికే పాస్ పుస్తకం
- కరెన్సీకి వాడే టెక్నాలజీతో పాస్ పుస్తకాలు
- 2027 మార్చినాటికి రైతులందరికీ పాస్‌బుక్స్
- ఐదేళ్లలో 23 లక్షల మంది ఉద్యోగావకాశాలు
- రాజధాని నిర్మాణంపై విపక్షానిది తప్పుడు ప్రచారం
- అధికారంలో ఉంటే విధ్వంసం.. లేకపోతే బెదరింపులు
- మినీ గోవాగా సూర్యలంక బీచ్ అభివృద్ధి

సూరేపల్లి 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు



గురువారం సూరేపల్లిలో రైతులకు పాస్ పుస్తకం అందచేస్తున్న సిఎం చంద్రబాబు సభకు హాజరైన నప్రజలు

**రేపల్లె(బాపట్ల జిల్లా), ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో భూ సమస్యలను లేకుండా చేసేందుకు ప్రభుత్వం పని చేస్తోందని, 2027 మార్చి నాటికి 1.12 కోట్ల పట్టదారు పాసుపుస్తకాలను పంపిణీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక్క రూపాయి కూడా అవినీతికి తావు లేకుండా పాసుపుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. ఆటో మ్యుటేషన్ తర్వాత నేరుగా ఇంటికి పాస్ పుస్తకాలను పంపాలని అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం సూరేపల్లి గ్రామంలో 'మీ భూమి -మీ హక్కు'కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. వేదికపై రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. వారి సమక్షంలోనే పొలం వివరాలను అధికారులతో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజల భూమిపై కన్నేసి కబ్జాలు చేశారు. ప్రశ్నించిన వారిని కట్టడి చేసేందుకు బ్లాక్ మెయిల్ చేశారు. రికార్డులు తారుమారు చేశారు. ప్రతీ గ్రామంలో, ప్రతి ఇంటిలో భూ వివాదాలకు తెరలేపి భయానక వాతావరణం సృష్టించారు. పట్టాదారు పాస్ పుస్తకాలపైనా జగన్ తన ఫొటో వేసుకున్నాడు. సరిహద్దు రాళ్లపైనా బొమ్మలు చెక్కించుకున్నాడు. ఇందుకోసం వందల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారు. వారు అధికారం నుంచి దిగిపోయినా పాపాలు, అక్రమాలు ఇంకా వెంటాడుతున్నాయి. అంతలా రెవెన్యూ వ్యవస్థను నాశనంచేశారు. ప్రజల >>2



గురువారం జరిగిన సోషల్ మీడియా ప్లాట్ ఫాంల ప్రతినిధులు, అధికారుల సమావేశంలో మంత్రులు నాదెండ్ల,లోకేష్, అనిత, సత్యకుమార్ యాదవ్

## 13 యేళ్ల పిల్లలకు సోషల్ మీడియాకు నో ఎంట్రీ

**మంత్రుల బృందం సమావేశంలో మంత్రి లోకేష్ స్పష్టీకరణ**

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:**సోషల్ మీడియాకు 13 సంవత్సరాల లోపు బాలలను దూరంగా ఉంచడంపై విధివిధానాలు తయారుచేసి, ముసాయిదా చట్టాన్ని సిద్ధం చేయాల్సిందిగా రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. చిన్నపిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేందుకు విధివిధానాల తయారీ, చట్టరూపకల్పనపై ఉండవల్లి నివాసంలో మంత్రుల బృందం సోషల్ మీడియా ప్లాట్ ఫాంల ప్రతినిధులు, అధికారులతో సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ సోషల్ మీడియా దుష్ప్రభావానికి లోనుకాకుండా 13 నుంచి 16సంవత్సరాల పిల్లలకు వయసు ఆధారిత కంటెంట్ ను అందుబాటులో ఉంచే విధంగా విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో మహిళలపట్ల అవమానకరమైన, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పిల్లల డిజిటల్ భద్రత, శ్రేయస్సు, లీగల్ మెకానిజం ఫ్రేమ్ వర్క్ పై ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను అధికారులు అధ్యయనం చేయాలన్నారు. పిల్లలను సెన్సిటివ్ కంటెంట్‌కు దూరంగా >>2

# ప్రతి నేతన్నకు ఉచిత విద్యుత్

**రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**

మగ్గం నేతన్నలకు రూ.720, మరమగ్గం నేతన్నలకు రూ.1,860లు ఆదా

15 వరకు ఉచిత విద్యుత్ పథకానికి దరఖాస్తుల స్వీకరణ





గురువారం సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

**విజయవాడ, ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** అర్హులైన ప్రతి నేతన్నకూ ఉచిత విద్యుత్ ఫలాలు అందించాల్సిందేనని రాష్ట్ర చేనేత . జౌళిశాఖ మంత్రి ఎస్ .సవిత స్పష్టం చేశారు. ఇందుకు విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. చేనేతల్లో ఉచిత విద్యుత్ పథకంపై అవగాహన కల్పించడానికి గ్రామ స్థాయిల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా లబ్దిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు గడువుగా పేర్కొన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారుల సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ >>2



# అమరావతిలో మినీ ఢిల్లీ!

**ఒకే గొడుగు కిందకు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు**

**మోడీ సర్కార్ భారీ ప్రణాళిక.. సమగ్ర నివేదిక తయారు**

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధంచేసింది. దీని కోసం రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేది తుది దశకు చేరుకుంది. ఢిల్లీలోని సెంట్రల్ వెస్టా తరహాలో, సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక సచివాలయ సముదాయాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న సుమారు 50కి పైగా కేంద్ర ప్రభుత్వ విభాగాలు, అనుబంధ సంస్థలు ఈ నూతన భవనంలోకి >>2



## అభివృద్ధి, ఆధ్యాత్మికతతో అంతర్వేది వర్ధిల్లాలి

**పవిత్ర క్షేత్రంలో తాగునీటి సమస్య ఉండకూడదు**

**రాజోలు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు**

**వర్చువల్ విధానంలో డి.సిఎం పవన్ కల్యాణ్ శ్రీకారం**

**రాజోలు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** "ఏదైనా ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అక్కడ చేపట్టాల్సింది కేవలం నిర్మాణాలు మాత్రమే కాదు, అక్కడ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలి. మౌలిక వసతులు మెరుగుపరచి వారి జీవితాలకు భరోసా ఇవ్వాలి. భవిష్యత్తుపై నమ్మకం కలిగించాలి" ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అంతర్వేదిలాంటి పవిత్ర ప్రాంతంలో అభివృద్ధి, ఆధ్యాత్మికతతో కలిసి నడవాలని ఆకాంక్షి ంచారు. ఈ పుణ్యభూమి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బలమైన సంకల్పంతో పని చేస్తుందని హామీ ఇచ్చారు. గురువారం రాజోలు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముందుగా రూ.17.33 కోట్లతో అంతర్వేదిలో నిర్మించిన మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఒ.ఎన్.జి.సి. నిధులు రూ.5 కోట్లతో 6 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక శాసనసభ్యులు దేవ వరప్రసాద్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఈఎన్సీ గాయత్రి పాల్గొన్నారు. ఈ సం దర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "అంతర్వేది శ్రీ లక్ష్మీ ృ నరసింహస్వామి వారి ఆశీస్సులతో ఈ రోజున మీ అందరి కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం ఆనందంగా ఉంది. జల్ జీవన్ >>2



10-4pg2exHMNWJQE.qxd:10-4pg2exHMNWJQE.qxd 1/1/02 6:56 AM Page 1





గురువారం సూరేపల్లిలో సర్వే వివరాలను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

# అభివృద్ధి, ఆధ్యాత్మికతతో అంతర్వేది వర్ధిల్లాలి

>> మిషన్ నిధులతో అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికర, పల్లెపాలెం, గొంది గ్రామ పంచాయతీల పరిధిలో 13 గ్రామాలకు చెందిన 30 వేల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ.17.33 కోట్లతో నిర్మించిన సమగ్ర రక్షిత తాగునీటి సరఫరా పథకాన్ని మీ అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చాం. ఈ ప్రాజెక్టు 30 వేల మంది తీర ప్రాంత ప్రజల దాహార్తిని తీరుస్తుంది. దీని కోసం 10 ఎకరాల విస్తీర్ణంలో చెరువును అభివృద్ధి చేసి, దానికి అనుబంధంగా 3 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి సామర్థ్యం కలిగిన రాపిడ్ సాండ్ ఫిల్టర్ ప్లాంటు, వాటర్ ట్యాంక్ నిర్మించాం. ఈ ప్రాజెక్టుని అత్యంత ప్రాధాన్యతాంశంగా తీసుకుని ఈ వేసవిలోపు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేశాం. ఈ పథకం కోసం గన్నవరం కాలువ నుంచి పంపింగ్ ద్వారా నీటిని తీసుకువచ్చి చెరువులో స్టోరేజీ చేయనున్నాం" అని వివరించారు.

**30యేళ్ల తాగునీటి కష్టాలకు చెక్:** గతంలో 12 కిలోమీటర్ల దూరంలో అంతర్వేదిపాలెం రక్షిత తాగునీటి పథకం నుంచి ఈ ప్రాంతానికి తాగునీరు సరఫరా చేసేందుకు ఇబ్బందులు తలెత్తేవి. సుమారు 50 గ్రామాలు దాటి నీరు రావాల్సి ఉండడంతో ప్రజల అవసరాలకు సరిపడ తాగు నీరు అందేది కాదు. 30 ఏళ్లుగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి వచ్చిన సందర్భంలో ప్రజలు తమ తాగునీటి వెతలు చెప్పుకొంటూ వినతిపత్రం ఇచ్చారు. ఈ రోజు ప్రారంభించిన అంతర్వేది సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. వేసవి నీటి కష్టాలు పూర్తిగా తొలగిపోతాయి. తీర ప్రాంతం



గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

కావడం వల్ల ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు గృహ అవసరాలకు వినియోగించుకునేందుకు కూడా పనికి వచ్చే పరిస్థితి లేదు. అంతర్వేది సమగ్ర రక్షిత తాగునీటి పథకం ద్వారా పూర్తి స్థాయిలో మీ అవసరాలకు తగిన విధంగా స్వచ్ఛ జలాలు సరఫరా చేసే ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సిఎం పవన్ తెలిపారు.

**ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు :** 'రూ.5 కోట్ల ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో గుడిమెల్లంక వద్ద ఏర్పాటు చేయనున్న 6 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ల ఏర్పాటు పనులు ప్రారంభించాం. ఈ పనులు పూర్తయితే గుడిమెల్లంక రక్షిత తాగునీటి పథకం సామర్థం మెరుగుపడుతుంది. 29 గ్రామాల పరిధిలో సుమారు లక్షా 20 వేల మందికి పూర్తి స్థాయిలో తాగునీరు అందుతుంది. అలాగే పల్లెపండగ 2.0 కూడా ఇదే రాజోలు నియోజకవర్గం నుంచి ప్రారంభించాం. అదే రోజు శంకరగుప్తం డ్రెయిన్ సమస్యపై అధ్యయనం చేసి 35 రోజుల్లో రూ. 20.77 కోట్లతో డ్రెయిన్ ఆధునీకరణ పనులకు ముక్కోటి ఏకాదశి రోజున శ్రీకారం చుట్టాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జల్ జీవన్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ 55 లీటర్ల సురక్షిత తాగునీరు అందించే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రణాళికలు అమలు చేస్తోంది. ప్రతి గ్రామానికీ, ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్తాం" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎవిఎస్ రాజన్, డివిజనల్ ఇంజనీర్లు మారుతీ రావు, బిజెపి నాయకులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

# భూ రికార్డులు మార్చలేరు!

>> ఆస్తులకు భద్రత, ప్రజల జీవితాలకు భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతి నెల నేను స్వయంగా పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నాను. భూమి అనేది ఆస్తి మాత్రమే కాదు. భద్రత, జీవనాధారం. అర్జీల్లో రెవెన్యూ సమస్యలవే ఎక్కువగా ఉంటున్నాయి. అందుకే భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించాలని సంకల్పించాం. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రీ సర్వే 2.0 చేపట్టాం. రాష్ట్రంలో మొత్తం 16,816 గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటికే 6,976 గ్రామాల్లో పూర్తి చేశాం. 2027 మార్చి నాటికి రీ సర్వే పూర్తి చేసి ప్రతి ఒక్కరికి రాజముద్రతో కొత్త పాసుపుస్తకాలు ఇస్తాం. ఈ జనవరి నుంచి మార్చి వరకు 21.23 లక్షల కొత్త పాసుపుస్తకాలు ఇచ్చాం. కరెన్సీకి వాడే టెక్నాలజీనే పాస్ పుస్తకాలకూ వాడుతున్నాం. భవిష్యత్‌లో ఎవరూ రికార్డులు తారుమారు చేయలేరు. రాజీలేకుండా మూడుసార్లు పట్టాదారుకు చెప్పి ఈ కేవైసీ చేస్తున్నాం. రికార్డులు ట్యాంపరింగ్ చేయకుండా వాటిని భద్రపరిచేందుకు బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాం. క్యూఆర్ కోడ్ పెట్టాం. రికార్డుల లాకర్ సిస్టమ్ తెచ్చాం. దీని ద్వారా భూ యజమానులు ఆధార్, ఈ కేవైసీ ఇచ్చి తమ భూముల రికార్డులు లాక్ చేసుకోవచ్చు. ప్రజల ఆస్తులకు, భూములకు రక్షణ కల్పించేందుకు ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేశాం' అని ముఖ్యమంత్రి చెప్పారు. 'భూ వినియోగ మార్పులు, మిస్సింగ్ సర్వే నంబర్ల సేవలను త్వరలో ప్రారంభిస్తున్నాం. జూన్ 2024 నుంచి ఇప్పటివరకు 9 లక్షల భూ లావాదేవీలు ఆటోమ్యుటేషన్ చేశాం. సేల్, బహుమానం, పార్టీషన్ డీడ్స్‌లో 100 శాతం ఆటోమ్యుటేషన్ తీసుకొచ్చాం. పట్టణ ప్రాంతంలోని ఆస్తులను కూడా ఆటోమ్యుటేషన్‌లోకి తీసుకువచ్చాం. ఇకపై పాస్‌బుక్ కోసం అధికారులు చుట్టూ, కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన అవసరం ఉండకూడదు. ఆస్తి అమ్మితే నేరుగా మీ ఇంటికే పాస్ బుక్ వస్తుంది. ఆటోమ్యుటేషన్ తో పాటు, పాస్ బుక్ కూడా ప్రింట్ చేసి నేరుగా యజమానికి ఇంటికి అధికారులు పంపాలి. వారసత్వంగా వస్తున్న భూముల విషయంలోనూ సంస్కరణలు తెచ్చాం. భూ వివాదాలు ఉండే గ్రామాలను కలెక్టర్లు గుర్తించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి అని సిఎం చంద్రబాబు సూచించారు.

**అమరావతికి రూ.2 లక్షల కోట్లంటూ తప్పుడు ప్రచారం**

"జగన్ లాంటి వెయ్యి మంది సైకోలు వచ్చినా అమరావతి నిర్మాణం ఆగదు. మొన్నటి వరకూ మూడు రాజధానులు అన్నారు. ఇప్పుడు మావిగన్ అంటున్నారు. అమరావతిపై కక్ష గట్టి రైతుల త్యాగాలకు విలువ లేకుండా చేశారు. అమరావతి నిర్మాణానికి రూ.2 లక్షలు ఖర్చు అని అసత్య ప్రచారం చేస్తున్నాడు. అమరావతి పేరు చెప్పడానికి కూడా ఇష్టపడని వ్యక్తికి రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదు. మహిళా రైతులను ఇబ్బందులు పెట్టారు. మహిళలు స్నానాలు చేస్తుంటే డ్రోన్‌లతో చిత్రీకరించారు. వారిని జట్టు పట్టుకుని బయటకు లాగారు. లాఠీలతో కొట్టారు. న్యాయస్థానం టూ దేవస్థానం కార్యక్రమం చేపడితే రోడ్డుపై భోజనం చేయనివ్వకుండా హింసించారు. అమరావతి నుంచి అరసవిల్లి వెళ్లాలంటే వారిపై దౌర్జన్యం చేశారు. మహిళల గురించి, నా భార్య గురించి వ్యక్తిగత దూషణలు చేశారు. గత ఐదేళ్లలో మహిళలను వాళ్లకు మహిళల గౌరవం గురించి మాట్లాడే హక్కు ఎక్కడిది? ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అమరావతి మహిళలు వీరోచితంగా పోరాడారు. చివరకు న్యాయం గెలిచింది. అమరావతి అజరామరం. అమరావతే ఎపి రాజధాని అని రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. పార్లమెంటులో అమరావతి చట్టబద్ధత బిల్లుకు 49 రాజకీయ పార్టీలు సపోర్ట్ చేస్తే ఒకే ఒక్క సైకో పార్టీ సపోర్ట్ చేయలేదు."అని సిఎం చంద్రబాబు గుర్తుచేశారు.

"నాడు ఐదేళ్లు అధికారంలో ఉండి విధ్వంసం సృష్టించారు... అధికారం పోయాక బెదిరిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక విచారణలు చేసి అందర్నీ పట్టుకొస్తానని బెదిరిస్తున్నాడు. రాజకీయ పార్టీ లేకపోతే జగన్ ఇంట్లో నుంచి బయటకు రాగలరా? రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలని కుట్ర చేస్తున్నారు.నాది న్యాయబద్ధ పాలన. ప్రజాస్వామ్యాన్ని కాపాడతాను. ప్రజలకు ఇబ్బందులు వస్తే నా ప్రాణాలను లెక్కచేయకుండాపోరాడాను. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైఉంది. ఇలాంటి నేతలను ప్రోత్సహిస్తే ఎవరికీ రక్షణ ఉండదు. భవిష్యత్ ఉండదు. మనందరి జీవితాలు బాగుండాలంటే ఇలాంటి వ్యక్తులను మర్చిపోవాలి. ఏమారితే రాష్ట్రానికి నష్టం జరుగుతుంది" అని సిఎం చంద్రబాబు అన్నారు.

రాష్ట్రంలో రాబోయే ఐదు సంవత్సరాల వ్యవధిలో 23 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చే బాధ్యతతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందంటే పరిశ్రమల స్థాపనకు రూ.20 లక్షల కోట్లు పెట్టుబడులు రావడమే అందుకు ప్రధాన కారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికులు ముందుకు రాలేదని గుర్తు చేశారు. ఒక విధంగా చెప్పాలంటే పరిశ్రమల నిర్వాహకులు పారిపోయే పరిస్థితులు కొనసాగాయని చెప్పారు. తమ పరిపాలనలో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడిదారులు ముందుకు రావడం శుభపరిణామం అని తెలిపారు.

"ప్రతీ వ్యక్తికి సంక్షేమం, అభివృద్ధి ఎలా అందుతోంది, అధికారులు ప్రజలతో ఎలా వ్యవహరిస్తున్నారో సమాచారం తెప్పిస్తున్నాం. ప్రజలకు సేవకులుగా పని చేస్తున్నాం. రాష్ట్రంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజానికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌ను మరో గోవాగా తయారుచేస్తాం. ఈ ప్రాంతంలో టూరిజాన్ని ప్రోత్సహించడం వల్ల ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఇక్కడి ప్రజల ఆదాయం పెంచడంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సముద్రపు నాచు సీవీడ్ ద్వారా మత్స్యకారులు స్థానికులకు అదనపు ఆదాయం వస్తుంది. మత్స్యకారుల జీవనోపాధికి నష్టం రాకూడదు. మన సముద్ర జలాలపై మత్స్యకారులదే హక్కు. ఇతర ప్రాంతాల జాలర్లు వస్తే ఉపేక్షించేది లేదు. గత ప్రభుత్వంలో 217 జీవో ద్వారా స్థానిక నీటి వనరుల్లో చేపల పెంపకానికి మత్స్యకారులను దూరం చేశారు. మేం అధికారంలోకి వచ్చాక దానిని రద్దు చేసి మత్స్యకారుల జీవనానికి సహకరించాం. అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**వేమూరు నియోజకవర్గ అభివృద్ధికి హామీలు**

"వేమూరు నియోజకవర్గంలో తుంగభద్ర డ్రైయిన్‌పై బ్రిడ్జ నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నాం. కొల్లూరు ఫర్రీ రోడ్డుపై హెచ్ ఎల్ బీ నిర్మాణానికి రూ.15 కోట్లు కేటాయిస్తాం. భట్టిప్రోలు, పెసలకం రోడ్డుపై కల్వర్టు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తాం. రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ పెడతాం. లంక గ్రామాలు కోతకు గురికాండా చర్యలు తీసుకుంటాం. అలాగే వేమూరులో ఫైర్ స్టేషన్ మంజూరు చేస్తున్నాం. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు స్థాపించి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పి4 కింద రోడ్డు నిర్మాణానికి యాజలి గ్రామానికి చెందిన సత్యనారాయణ రాజు రూ.కోటి విరాళాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ కార్యక్ర మంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్ బాబు, నరేంద్ర వర్మ, సీఎస్ సాయి ప్రసాద్, ఎంపీ కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



గురువారం వేమూరు నియోజకవర్గంలో జరిగిన ప్రజావేదిక సమావేశానికి హాజరైన టిడిపి కార్యకర్తలు

# ప్రతి నేతన్నకు ఉచిత విద్యుత్

>> సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఎన్నికల ముందు నిర్వహించిన యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ చేనేతల కష్టాలను స్వయంగా చూశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడికి సైతం చేనేత కష్టాలపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. అందుకే, అధికారంలోకి కూటమి వస్తే ఉచిత విద్యుత్ ఇస్తామని ఆనాడు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎన్నికల హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకాన్ని రూ.150 కోట్ల వ్యయంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. మగ్గంపై నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గంపై నేతన్నలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు నెలకు రూ.720లు, మరమగ్గం నేతన్నలకు రూ.1,860లు ఆదా అవుతుందన్నారు. విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారులు సమన్వయంతో ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని మంత్రి సవిత సూచించారు. గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించి, లబ్ధిదారులను గుర్తించి, వారితో దరఖాస్తు చేయించాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులకు ఆఖరు గడువు అని స్పష్టంచేశారు. లబ్ధిదారుల ఎంపిక నిర్లక్ష్యం చూపొద్దని, పొరపాట్లు జరిగితే ఆయా జిల్లాల డీవోలే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి సవిత స్పష్టం చేశారు. ప్రభుత్వానికి, లబ్ధిదారులకు చేనేత, జౌళి శాఖాధికారులు వారధిగా ఉండాలన్నారు. చేనేతలకు మేలు చేయాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఇప్పటికే చేనేతలకు లబ్ధి కలిగించేలా వ్యక్తిగత పథకాలు ప్రారంభించామన్నారు. 50 ఏళ్లు నిండిన చేనేతలకు రూ.4 వేల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ, చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, విద్యుత్ శాఖాధికారులు, వివిధ జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖకు చెందని ఏడీలు, డీవోలు పాల్గొన్నారు.

# నేడు ఎపి మంత్రి మండలి సమావేశం

**విజయవాడ,ఏప్రిల్9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మంత్రి మండలి సమావేశం శుక్రవారం జరుగుతుంది. ఈ సమావేశంలో పలు కీలకంశాలపై నిర్ణయం తీసుకుంటారు.ఇటీవల జరిగిన పెట్టుబడుల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి మండలి సమావేశంలో ఆమోదిస్తారు. క్వాంటమ్ వ్యాలీలో ఈ నెల 14న జరిగే కార్యక్రమాలు, అమరావతికి చట్టబద్దత కల్పించినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తదితరం శాలు సమావేశంలో చర్చిస్తారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరుగుతుంది.

## వారం - వర్జ్యం

10-04-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
అష్టమి రా.11.13
పూర్వాషాఢ ఉ.11.25
వర్జ్యం : రా.8.09-రా.9.54
దు.ఉ.8.24-ఉ.9.14,
2)మ.12.33-మ.1.23
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఎటువంటి ప్రయోజనం ఉండదని తెలిసినా మీ ప్రమేయం లేకుండా మానసికంగా ఆలోచనలు చోటు చేసుకుంటాయి.

**వృషభం:** పలురంగాల పట్ల మీకున్న అనుభవం మీకు ఉపకరిస్తుంది. స్థిరాస్తి విషయంలలో ఒక నిర్ణయమునకు వస్తారు.

**మిథునం:** సంతాన పురోగతి మీరు ఆశించిన దానికంటే ఎక్కువగా ఉంటుంది. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** తమ నైపుణ్యమునకు, సామర్థ్యంనకు తగినటువంటి స్థానం సంపాదించు కోవటానికి విశేషంగా కృషిచేస్తారు.

**సింహం:** నూతన విద్యావకాశాలు లభిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. వాహనసౌఖ్యం.

**కన్య :** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. భూముల విషయంలో నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు.

**తుల :** మీ పరిధులను, మీ యొక్క శక్తిని దృష్టిలో ఉంచుకొని ఉద్దేశ్య పూర్వకంగానే ఒక అవకాశాన్ని వదిలివేస్తారు.

**వృశ్చికం:** భాగస్వామ్య వ్యాపారాలలో ఒడిదుడుకులు ఉంటాయి. షేర్ల క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**ధనుస్సు:** జీవిత భాగస్వామితో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించడం చెప్పదగినది. ఋణాలు తీరుస్తారు.

**మకరం:** అన్నీ సానుకూలంగా ఉన్నా వ్యవహార పురోభివృద్ధిలో ఏదో ఒక వెలిక ఏర్పడుతుంది.కొత్త మిత్రులు పరిచయ మవుతారు.

**కుంభం:** పెదవి దాటితే పృథివి దాటుతుందన్న నానుడి గుర్తుంచుకోవడం, తదనుగుణంగా నడుచుకొంటారు.

**మీనం:** చెప్పుకోదగిన ఒడుదుడుకులు లేకుండా కాలం గడుస్తుంది. విందు, వినోదాలలో పాల్గొంటారు.వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 13 యేళ్ల పిల్లలకు సోషల్ మీడియాకు నో ఎంట్రీ

>> ఉంచడంపై ఆస్ట్రేలియా, సింగపూర్, డెన్మార్క్ వంటి దేశాల్లో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. పిల్లలపై సోషల్ మీడియా ప్రభావంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. నో బ్యాగ్ డే రోజున ఉపాధ్యాయులు విద్యార్థులకు, ప్రతిఏటా రెండుసార్లు నిర్వహించే మెగా పిటిఎంలో కూడా తల్లిదండ్రులు, విద్యార్థులకు సోషల్ మీడియా దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తామన్నారు. మహిళలభద్రతపై స్వయంసహాయ సంఘాల మహిళలకు కూడా అవగాహన కల్పిస్తామని తెలిపారు.వయసు నిర్ధారణ కోసం డిజిలాకర్ తో కూడిన ఏజ్ టోకెన్ ల వినియోగంపై అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయం అనంతరం కేంద్రప్రభుత్వ చట్టపరిధిలోని అంశాలపై నివేదికను అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సున్నితమైన కంటెంట్ ను చిన్నపిల్లలకు దూరంగా ఉంచడంపై విధివిధానాలు, ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలను వివిధ సోషల్ మీడియా ప్లాట్ ఫాంల ప్రతినిధులు మంత్రుల బృందానికి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చొరవకు తమవంతు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. ఐటి చట్టంలోని సెక్షన్ - 46 కింద న్యాయ నిర్ణయాధికారిని వెంటనే నియమించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, జిఎడి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు, ఐ పీఆర్ డైరెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్, ఆకే రవికృష్ణ (ఐజీ, ఈగల్, ఇన్ చార్జ్, సైబర్ క్రైమ్), అదిరాజ్ సింగ్ రానా ఎస్పీ సైబర్ క్రైమ్, పి.కిరణ్ కుమార్ (జాయింట్ డైరెక్టర్, ఐ పీఆర్), పి.జయరావు, చీఫ్ జనరల్ మేనేజర్ (సోషల్ మీడియా డిజిటల్ మీడియా, డిజిటల్ కార్పోరేషన్), ఒ.మధుసూదన రావు (చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్, ఐ పీఆర్), ప్రాసిక్యూషన్ డైరెక్టర్ రామకోటేశ్వరరావు, మెటా డైరెక్టర్ నటాషా జోగ్, యూట్యూబ్ పబ్లిక్ పాలసీ మేనేజర్ మీరా స్వామినాథన్, ఎక్స్ పబ్లిక్ పాలసీ ప్రొఫెషనల్ జప్రీత్ గ్రెవల్, షేర్ చాట్ పాలసీ హెడ్ తమోగా గోస్వామి, జోష్ ప్రాసెస్ మేనేజ్మెంట్ రామానుజన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో మినీ ఢిల్లీ!

>> మారనున్నాయి. ఈ ప్రాజెక్టును కేవలం కార్యాలయ భవనంగానే కాకుండా, పర్యావరణ హితమైన గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మించనున్నారు. ఐకానిక్ డిజైన్‌తో కూడిన ఈ భవన సముదాయంలో సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనింగ్, అత్యాధునిక ఐటీ మౌలిక సదుపాయాలు, కాన్ఫరెన్స్ హాల్స్, విశాలమైన పార్కింగ్ సౌకర్యాలు ఉండనున్నాయి. సుమారు 10 నుంచి 12 అంతస్తుల ఎత్తుతో నిర్మించనున్న ఈ భవనం, అమరావతి నగరానికే ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీని ద్వారా పాలనలో వేగం పెరగడంతో పాటు, ప్రజలకు అన్ని కేంద్ర సేవలు ఒకే చోట లభించే వెసులుబాటు కలుగుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రజా పనులశాఖ పర్యవేక్షించనుంది. ప్రాథ మిక అంచనాల ప్రకారం, ఈ సముదాయం నిర్మాణానికి సుమారు రూ.మూడు వేల కోట్ల వరకు వ్యయం కావచ్చని భావిస్తున్నారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములను దీని కోసం వినియోగించుకోనున్నారు. కేంద్ర కేబినెట్ నుంచి తుది ఆమోదం లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించి, రాబోయే రెండేళ్లలోపు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర సచివాలయ నిర్మాణం వల్ల అమరావతి ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకోనున్నాయి. వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఒకే ప్రాంతానికి రావడం వల్ల స్థిరాస్తి రంగానికి ఊతం లభించడమే కాకుండా, స్థానికంగా సేవా రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అమరావతిని కేవలం ఒక పరిపాలనా కేంద్రంగానే కాకుండా, జాతీయ స్థాయిలో ఒక కీలకమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు మైలురాయిగా నిలవనుంది.

# ప్రస్తుత సిఆర్‌డిఎ చట్టాల్లో మార్పులు..

**విజయవాడ ఏప్రిల్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి రాజధాని నగర పాలక కోసం ప్రత్యే చట్టాలను రూపొందించనున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు వీలుగా కన్సల్టెన్సీ నియామకం కోసం సిఆర్డిఏ అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. దీని ప్రకారం అమరావతి రాజధాని పరిపాలన కోసం కొత్త చట్టాలను తయారు చేస్తారు. ప్రస్తుతం ఉన్న సీఆర్డిఏ చట్టాలను రాజధానికి వీలుగా అవసరమైన విధంగా మార్పులు, చేర్పులు చేయనున్నారు. ఇందులోనే ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడం, పిపిపికి రక్షణ కల్పించేలా చట్టపరమైన నిబంధనలనూ రూపొందించాలని నిర్ణయించారు. రాజధాని నగర ప్రభుత్వం సుస్థిర ఆర్థిక ప్రగతి కోసం ఏమిచేయాలనే అంశాలనూ రూపొందించే ఫ్రేమ్ వర్క్ రూపొందించడంపై సిఆర్డిఏ అధికారులు దృష్టి సారించారు. ముఖ్యంగా తొలిదశలో ఆస్తులు ఎన్ని ఉన్నాయి? అప్పులు ఎంత? అనే అంశాలపై స్పష్టమైన నివేదిక తయారు చేయడం ద్వారా అక్కడ వసూలు చేయాల్సిన యూజర్ చార్జీలు, పన్నులు ఎంత నిర్ణయించాలనే అంశంపై ఒక నివేదికను తయారు చేయనున్నారు. ఆస్తిపన్ను భూమి విలువ పెంపు, ఇతర లెవీలకు సంబంధించి అన్ని రూపాల్లోనూ ఆదాయ మార్గాలను గుర్తించేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. దీనికోసం నిర్మాణం ప్లానుకు వీలుగా కన్సల్టెన్సీని ఆహ్వానించారు. అలాగే ప్రస్తుతం సీఆర్డిఏ నుంచి రాజధానిగా మార్పునకు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లనూ చేయాలని నిర్ణయించారు. కొత్త నగరంలో ఎప్పటికప్పుడు జరిగే మార్పులపై ముఖ్యంగా ఆదాయ విద్య , ఉపాధి, మౌలిక సమపాయాల కల్పన, స్వయం సమృద్ధి వంటి వాటిని నిరంతరం పర్యవేక్షించేందుకు సర్వే చేయడం వంటి అంశాలకు వీలుగా నిబంధనలు రూపొందించనున్నాయి.

74వ రాజ్యాంగ సవరణ ప్రకారంమెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీ ఏర్పాటుపైనా నివేదిక తయారు చేయాలని నిర్ణయించారు. ఈ ఏర్పాటులో పట్టణాభివృద్ధిశాఖ, సిఆర్డిఏ మెట్రోపాలిటన్ అథారిటీ ఒకదానికొకటి సమన్వయం చేసుకునేలా నూతన ప్రతిపాదనలు ఉండాలని తెలిపారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అత్యంత కీలకమైన రాజధాని నగర పాలన హెచ్ ఆర్ పాలసీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నారు. ఇందులో ప్రస్తుతం ఉన్న సిబ్బందిని డిప్యూటేషన్ , లేదా ఇతర నియామకంతోపాటు, నైపుణ్యం ఉన్న ప్రైవేటు వ్యక్తులను నియమించుకోవడానికి వీలుగా నిబంధనలు ఉండాలని సూచించారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు రాజధాని సంస్థ మధ్య సమన్వయం కోసం ప్రత్యేక యంత్రాంగాన్నీ నియమించనున్నారు.

# సిఎం చంద్రబాబు సంస్కరణలు భావితరాలకు స్ఫూర్తి

## -చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** నవ్యాంధ్రప్రదేశ్ సాధన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన సంస్కరణలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేస్తాయన్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడతాయని ఉద్ఘాటించిన ఆయన చిత్తూరు పార్లమెంటు ప్రగతి పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని తెలియజేశారు. వైకాపా అధినేత జగన్ మోహన్ రెడ్డి మావిగన్ అనే అంశాన్ని తెరపైకి తెచ్చిన నేపథ్యంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు స్పందించారు. ఎన్డీఏ సర్కార్ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రాజధానిని నిర్మించి, తెలుగు జాతి ఔన్నత్యాన్ని చాటిచెప్పాలనే ధృడ సంకల్పంతో ముందుకు సాగుతుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు ఈ రకమైన విమర్శలు చేయడం తగదన్నారు. అమరావతి రాజధాని కావాలని, దీనికి సంబంధించి వేల ఎకరాలు అవసరమని చెప్పిన వారు ఇప్పుడు ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను మభ్యపెట్టడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. 2014లో జరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన, తీవ్ర ప్రతికూలతలకు దారితీసిన నేపథ్యంలో 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విభజన చట్టంలో పొందుపరిచినహామీలను, ఎన్డీఏ సర్కార్ సహకారంతో సాధిస్తోందని ఆయన చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రిలోకేష్ బాబు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావించి, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ..,ఓ ప్రణాళిక బద్ధంగా ప్రజలకు సుపరిపాలన అందించడం తమ అందరికీ గర్వకారణంగా ఉందన్నారు.ఇకనైనా ప్రతిపక్షాలు తమ వైఖరిని మార్చుకోవాలని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు హితవు పలికారు.

# వంట గదిలోకి అనుమతించకపోవడమూ క్రూరత్వమే: బాంబే హైకోర్టు

**ముంబై, ఏప్రిల్ 9:** అత్తారింట్లో మహిళను వంట గదిలోకి అనుమతించకపోవడమూ మానసిక క్షోభకు గురిచేయడం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు తేల్చింది. భర్త తనను వంట గదిలోకి రానివ్వడం లేదంటూ ఇటీవల ఓ మహిళ అతడిపై కేసు పెట్టింది. దీంతో అతడు బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. ధర్మాసనం దీనిపై స్పందిస్తూ.. ఇలాంటి చర్యలు మహిళల గౌరవాన్ని కించపరచడంతోపాటు మానసిక క్షోభకు గురిచేసినట్టే అవుతుందని తేల్చి చెప్పింది. వారిద్దరూ 2022లో వివాహం చేసుకున్నారు. కొద్దికాలానికే వారి మధ్య వివాదాలు మొదలయ్యాయి. దీంతో అత్తింటి వారంతా ఆమె ప్రాథమిక హక్కులకు భంగం కలిగేలా ప్రవర్తిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. 'నన్ను అసలు వంట గదిలోకే అనుమతించడం లేదు. ఆహారం కూడా బయట నుంచి తెచ్చుకోవాలని బలవంతపెట్టారు. పుట్టింటి వాళ్లను కూడా కలవనివ్వలేదు. విడాకులు ఇవ్వాలని ఇబ్బంది పెడుతున్నారు' అని సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఆరోపణలను ఆమె భర్త ఖండించారు. 'విడాకులు ఇవ్వాల్సి వస్తుందనే కారణంతోనే ఆమె ఇవన్నీ సృష్టించారు' అని ఆమె భర్త తరఫు న్యాయమూర్తి కోర్టులో వాదనలు వినిపించారు. దీనిపై విచారణ చేసిన ధర్మాసనం అతనిపై వేధింపుల కేసును కొట్టివేసేందుకు అంగీకరించలేదు. ఇంట్లో ఆమె సాధారణ అవసరాలను కూడా తీర్చుకోనివ్వకుండా కట్టడి చేయడం కూడా మానసిక క్రూరత్వం కిందకే వస్తుంది అని పేర్కొంది. కానీ ఈ కేసులో ఆమె అత్తపై చేసిన ఆరోపణలు అస్పష్టంగా ఉన్నాయంటూ ధర్మాసనం కొట్టివేసింది.

10-4pg4.qxd:10-4pg4.qxd 1/1/02 7:55 AM Page 1



వార్త

ఓర్పు లేకపోవడం ఒక రకమైన దౌర్జన్యం. అది ప్రజాస్వామ్య ప్రగతికి అవరోధం.

న- మహాత్మా గాంధీ

# ప్రకృతితో చెలగాటాలొద్దు !

మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణాలవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనేక మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి. ఇందుకు ముందుగా నిందించాల్సింది, తప్పుపట్టాల్సింది మానవుడినే. పర్యావరణాన్ని కాపాడకపోతే మానవుడి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతున్నా పట్టించుకునేవారే లేకుండాపోతున్నారు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. ప్రస్తుతం అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య జరుగుతున్న అణుయుద్ధంలో ఎంతటి విధ్వంసం జరుగుతున్నది వేరే చెప్పక్కర్లేదు. ముఖ్యంగా పర్యావరణానికి ఎంతటి చేటు తెస్తుందో శాస్త్రజ్ఞుల అంచనాలకు అందడం లేదు. ఇక అభివృద్ధి పేరుతో పాలకులు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి ఎంతో హాని చేస్తున్నాయి. ఇష్టానుసారంగా తవ్వకాలు మొదలు పెడితే కొండలను తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట పొలాలను జనవాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ విధ్వంసం జరుగుతున్నాయి. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత దేశ జనాభాయే మరో దశాబ్దం నాటికి నూటయాభై కోట్ల వరకు చేరుకుంటుందని అందుకు తగినట్టుగా దేశంలో సహజ వనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద హరించుకుపోతుందని స్పష్టం చేసింది. ఇప్పటికే భారత్‌లో ప్రతిరోజూ దాదాపు మూడువందల ఎకరాలకుపైగా అటవీ భూములు అదృశ్యమైపోతున్నాయని ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడించింది. బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీ లోయ ప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులను నరికి వేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ కాగితాలు మట్టిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఈ ప్లాస్టిక్ పర్యావరణానికి ఎంత నష్టం చేకూరుస్తున్నదో ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికార వర్గాలు విఫలమవుతున్నాయని చెప్పొచ్చు. పెట్రోలు, డీజిల్, ఇథనాల్ వాడకం గురించి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్య నియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. ఎన్ని చట్టాలు చేసినా, మరెందరిపై జరిమానాలు విధించినా పెరుగుతున్న వాహనాల సంఖ్య రెట్టింపుస్థాయిలో వాహన కాలుష్యాన్ని పెంచుతున్నది. ఇక పరిశ్రమలు వదులుతున్న పొగ, ధూళి కణాలు, తదితరవన్నీ కలిసి వాయుకాలుష్యాన్ని విస్తరిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ లాంటి ప్రదేశాల్లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా చలికాలంలో పరిస్థితి దారుణంగా తయారవుతున్నది. నీటి కాలుష్యం పరిస్థితి అదుపు తప్పుతున్నదేమో. పెరుగుతున్న మురికివాడలనుంచి వెలువడుతున్న కలుషిత నీరు అంచలంచెలుగా నదుల్లోకి చేరుకొని పెద్దపెద్ద నదులను మురికి కూపాలుగా మారుస్తున్నాయి. ఈ నది, ఆ నది అని కాదు. దేశంలోని నదుల్లో నీటి పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. ఇలాంటి ఎన్నో కారణాలతో భూ ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీర ప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే ఇందుకు ప్రతీగా ప్రకృతి రెట్టింపు స్థాయిలో స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురియడం లేదు. కురిస్తే ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం, వరదలు, తుఫాన్‌లు భూకంపాలు లాంటి ఉపద్రవాలు చోటు చేసుకొంటున్నాయి. యేటా దాదాపు మూడువందల ఎనభైకి పైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఈ ఉపద్రవాలతో ప్రాణాలు పోగొట్టుకుంటే కోట్ల సంఖ్యలో రోగపీడితులు అవుతున్నారు. పాకిస్థాన్, ఇరాన్, హైతీ, న్యూజిలాండ్, నేపాల్ లాంటి ఎన్నో దేశాలలో వస్తున్న భూ కంపాలు విలయాన్నే సృష్టిస్తున్నాయి. సిరియాలో భూకంపం కారణంగా దాదాపు తొమ్మిదివేల మందికిపైగా అసువులు బాసారు. మెరోకోలో వచ్చిన భూకంప ప్రకంపనాలతో దాదాపు నాలుగువేల మంది జీవితాలు సజీవమయ్యాయి. పశ్చిమ ఆఫ్ఘనిస్థాన్‌లో భూప్రకంపనాలు విలయాన్నే సృష్టించాయని చెప్పొచ్చు. భారత్‌కు సంబంధించి కూడా అనేక ప్రాంతాల్లో భూ ప్రకంపన వార్తలు వింటూనే ఉంటున్నాం. చెన్నై, ముంబయి, కోల్‌కతా, పూణె, ఢిల్లీ లాంటి దాదాపు డెబ్బై నగరాలకు భూప్రకంప నాలు పొంచి ఉన్నట్లు శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇక వరదలు, తుఫాన్‌లతోవ్యవసాయ రంగం కుదేలైపోతున్నది. తుఫాన్‌ల బారి నుంచి తీరప్రాంతాలు తప్పించుకోలేకపోతున్నాయి. గతంలో దివిసీమలో సంభవించిన తుఫాన్ సిరిధాన్యాలతో తులతూగే ఆ ప్రాంతాన్ని శవాల దిబ్బగా మార్చేసింది. ఇప్పటికీ ఆ బీభత్సం గురించి మరచిపోలేకపోతున్నారు. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రజల్లో అవగాహన పెంచాలి. ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా మరెన్నో విలయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లించక తప్పదు.

> సంతృప్తిపడే వ్యక్తి ఏనాటికీ పేదవాడు కాదు. అలాగే అసంతృప్తి చెందే వ్యక్తి ఎన్నటికీ సంపన్నుడు కాలేడు.
>
> థామస్ జెఫర్‌సన్



> నేరస్తులను శిక్షించుటే ప్రధానంకాదు. నేరం చేయడానికి ఏ పరిస్థితులు పురికొల్పుతున్నాయో వాటిని తొలగించడం ముఖ్యం.
>
> ఆల్బర్ట్‌కామూ



## ప్రజావాక్కు

### రోగులపై దయ,దాక్షిణ్యాలు చూపండి

**అందినకాడికి** రోగుల నుంచి దోచుకోవడమే ఈ ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల పని. రోగులకు వున్న సాధారణ జబ్బును కూడా మసి పూసి మారేడు కాయ చేసి వారి జేబులకు చిల్లులు పడేలా చేయడమే వారి పని. అదేమో గాని అక్కడి వాతావరణం చూస్తే గుండె ఆగినంత పని అవుతూ ఉంటుంది. అటురోగులకు, ఇటు రోగుల బంధువులకు కూడా. ఎందుకంటే ఒక్క రోజులో డిశ్చార్జ్ చేసే పేషెంట్‌ను కుడా మూడు రోజులు పెట్టుకొని వారికి కావలసిన కాడికి దండుకోవడమే వారి పని. కాబట్టి మనమంతా మన పెద్దలు సెలవిచ్చిన కొన్ని మంచి ఆరోగ్య చిట్కాలు పాటిస్తే కార్పొరేట్ ఆసుపత్రుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకుంటూ మన ఆరోగ్యాన్ని మరో పది కాలాల పాటు వర్ధిల్లేలా చేసుకోవచ్చు. అలా చేయకుండా మన ఇష్టానుసారం ఒక పద్ధతి పాడు లేకుండాఆహారాన్ని తీసుకుంటే మాత్రం ఎవ్వరూ కాపాడలేరు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### అక్రమ వ్యాపారాలను రద్దు చేయాలి

ఎస్సీ,ఎస్టీ పేదలు రాళ్లు రప్పలు సాగు చేసుకుంటున్న భూములను 1978లో గుర్తించి ప్రభుత్వం ఇనాం భూమిగా ఇచ్చింది. అట్టి భూమిని కేవలం వ్యవసాయ పంట పొలాలకు మాత్రమే వినియోగించాలి. ఇట్టి పంచారాయి భూములు రిజిస్ట్రేషన్ కావు. కానీ అక్రమంగా రెవెన్యూ రికార్డులలో పట్టా భూములుగా నమోదు చేసుకుని ప్రభుత్వబ్యాంకుల ద్వారారుణాలు తీసుకొని బర్లషెడ్డు నిర్మించి, పాడిగేదెలపై ఋణం తీసుకొని, అనుమతి లేని పాల డైరీలను నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మండల కేంద్రాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి అట్టి వ్యాపారాలను రద్దు చేయాలి. అదే ప్రాంతాలలో బెల్టు షాపుల దందా ఊరి చివరన జరుగుతున్న ఇలాంటి సంఘటనలను ప్రభుత్వం రద్దు చేయాలి.

- రాపాక రవీందర్, జనగాం

### అహంకారం వీడితే

**పంతాలను,** దోషాలను విడిచిపెట్టి పరస్పరం సహకరించుకుంటూ ఇండియా కూటమి పార్టీలు రంగంలోకి దిగాలి. ఐక్యమత్యంతో పనిచేసి గెలుపును అందిపుచ్చుకోవాలి. అలాకాక మాకు ఎవరితోనూఅవసరం లేదు, నేను గొప్ప, నా పార్టీ గొప్ప, ఏ పార్టీతోనూ పొత్తు లేదు అంటూ అహంకారపు మాటలు వల్లే వేస్తూ ఒంటరిగా బరిలోకి దిగితే నష్టపోయేది ఇండియా కూటమి పార్టీలే.

-రాశి, హైదరాబాద్

### వృద్ధులను నిర్లక్ష్యం చేయొద్దు

**నేటి** ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై వ్యష్టికుటుంబాలు పెరగడంవల్ల వృద్ధులు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఒకప్పుడు ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్నవారు నేడు ఒంటరితనంతో కొట్టుమిట్టాడుతున్నారు. పిల్లలు ఉద్యోగాల రీత్యా దూరమవ్వడం, కనీస పలకరింపు కరువవ్వడం వల్ల వారిలో మానసిక వేదన, నిరాశ పెరుగుతున్నాయి. ఆర్థికంగా ఇతరులపై ఆధారపడటం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోంది. వృద్ధాశ్రమాల సంఖ్య పెరగడం సామాజిక పతనానికి నిదర్శనం. ఆస్తుల కోసం తల్లిదండ్రులను వేధించడం, వారిని భారంలా భావించి వదిలేయడం మానవత్వానికే మచ్చ. వృద్ధులు అనుభవాల గనులు. వారి జ్ఞానం నేటి తరానికి ఎంతో అవసరం. వారిని కేవలం ఇంటి పనులకే పరిమితం చేయ కుండా,కుటుంబనిర్ణయాల్లో భాగస్వాములను చేయాలి. ప్రభు త్వాలు కూడా వృద్ధుల సంక్షేమం కోసం కఠినమైన చట్టాలు, ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### జలంతో చెలగాటం

**వేసవి** సెలవుల్లో ఎండ వేడిమికి ఉపశమనం కోసంకాలువ, చెరువు, బావి, సముద్రం, నదుల్లో ఈతకు వెళ్లి మృత్యువాత పడికన్నవారిని బంధుమిత్రులను దుఃఖసాగరంలోకి నెట్టుతున్నారు. పిల్లలు పెద్దలు ప్రమాదమని తెలిసి కూడా ఏమీ కాదులే అన్న నిర్లక్ష్యం వల్ల బంగారు జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. నిత్యం ఏదోఒక చోట ఇలాంటి దుర్ఘటనలు జరుగుతుండడం ఆందోళనకరం. అందుకే భయం కూడా మనిషికి వరమంటారు. లైఫ్‌లో సరదా ఒక భాగమని గుర్తించాలి. పర్యాటనలు, పండుగలు ఎంజాయ్ చేయాలికానీ జలంతో చెలగాటం వద్దు.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### సంబంధాల అనుభూతులు

**నేటి కాలంలో** రక్త సంబంధాల కంటే స్నేహ సంబంధాలు, పరిచయ సంబంధాలు చాలా గొప్పవి. రక్త సంబంధాలు ఎల్లప్పుడూ మనకు దగ్గరగా ఉంటాయి. స్నేహ సంబంధాల వారితో అన్ని విషయాలు పంచుకోవచ్చు. అందరూ ఒకే వేదికపై పని చేసి అర్థాంతరంగా మనకు అనుభూతుల్ని పంచి మననుండి దూరంగా వెళ్తారు. ఇలాంటి స్నేహ సంబంధాలను జీవితాంతం గుర్తుంచుకోవాలి. ఇలాంటి బంధాలు చాలా పదునుగా నమ్మకంగాను ఉంటాయి. అందుకే వీలైనంత వరకు నిరంతరం స్నేహ సంబంధాలను ముందుకు తీసుకెళ్లండి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# బకాయిల భారంతో 'విద్య'కు దారేది?

**విద్య అనేది కేవలం వ్యక్తిగత ప్రయోజనం కాదు, అది సామాజిక అభివృద్ధికి పునాది. బహుజన వర్గాల విద్యాభివృద్ధి లేకుండా సమానత్వం సాధ్యం కాదు. కాబట్టి ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా సామాజిక న్యాయదృష్టితో చూడాలి. మొత్తంగా చూస్తే, విద్యహక్కు కేవలం రాజ్యాంగంలో ఉన్న ఒక నిబంధనగా మిగలకుండా, ప్రతి పేద విద్యార్థి జీవితంలో నిజంగా అమలవ్వాలంటే ప్రభుత్వాలు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలి. లేకపోతే శతాబ్దాలుగా కొనసాగుతున్న అన్యాయం మరో రూపంలో కొనసాగుతుంది. బహుజన వర్గాల భవిష్యత్తు విద్యపై ఆధారపడి ఉంది. ఆ విద్యను కాపాడటం అనేది కేవలం ఒక విధానం కాదు, అది ఒక సామాజిక బాధ్యత, ఒక నైతిక కర్తవ్యం. విద్యనుహక్కుగా మాత్రమేకాకుండా, సమానత్వానికి మార్గంగా భావించే దిశగా అడుగులు వేయాల్సిన సమయంఇదే.**



మన్నారం నాగరాజు

భారతదేశ చరిత్రలో విద్య అనేది కేవలం జ్ఞానాన్ని అందించే సాధనం మాత్రమే కాదు, అది అధికారాన్ని, అవకాశాలను, సమానత్వాన్ని నిర్ణయించే అత్యంత ప్రభావవంతమైన ఆయుధంగా పనిచేసింది. కానీ ఈ ఆయుధం అందరికీ సమానంగా అందలేదు. శతాబ్దాలుగా వర్ణవ్యవస్థ కట్టుబాట్లలో బంధించబడిన బహుజన వర్గాలు, ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సమాజాలు, విద్య అనే హక్కు నుండి దూరం చేయబడ్డాయి. అస్పృశ్యత, అంటరానితనం వంటి అమానుష ఆచారాలు కేవలం వారి గౌరవాన్ని మాత్రమే కాదు, వారి భవిష్యత్తును కూడా కట్టడి చేశాయి. ఈ చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దడానికి భారత రాజ్యాంగం ఒక మహత్తర సాధనంగా అవతరించింది. రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ స్పష్టంగా గుర్తించిన విషయం ఏమిటంటే, సమాజంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న అసమానతలను కేవలం చట్టపరమైన సమానత్వంతోనే తొలగించలేమని, అందుకే రాజ్యాంగంలో ప్రత్యేక నిబంధనలు చేర్చి అణగారిన వర్గాల విద్యా, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్టికల్ 21ఎ ద్వారా విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించడం, ఆర్టికల్ 46 ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభివృద్ధికి రాష్ట్రం ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొనడం, ఈ నిబంధనలన్నీ చారిత్రక అన్యాయాలను సరిదిద్దడానికే ఉద్దేశించబడ్డాయి. అయితే, రాజ్యాంగంలో ఉన్న ఈ గొప్ప ఆలోచనలు వాస్తవ జీవితంలో ఎంతవరకు అమలవుతున్నాయన్న ప్రశ్న నేటికీ నిలిచే ఉంది. నేటి భారత సమాజంలో అక్షరాస్యత శాతం పెరిగినప్పటికీ, వర్గాల మధ్య అసమానతలు మాత్రం స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి. అగ్రవర్ణాలతో పోలిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యా స్థాయి ఇంకా వెనుకబడినట్టే ఉంది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, ఇది చారిత్రకంగా ఏర్పడిన సామాజిక అడ్డంకులప్రతిబింబం. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల కొరత, ఉపాధ్యాయుల లోపం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, చిన్న వయస్సులోనే పని చేయాల్సిన పరిస్థితులు, ఈ కారకాలన్నీ అణగారిన విద్యార్థులను విద్యా వ్యవస్థ నుండి దూరం చేస్తూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ పథకాలలో ఫీజు రీయింబర్స్మెంట్ ఒక కీలకమైన మైలురాయిగా నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన ఈ పథకం వల్ల వేలాది మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యలోకి అడుగుపెట్టే అవకాశం పొందారు. ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ వంటి కోర్సులు చదవడం కేవలం కలగానే ఉన్న కుటుంబాల్లో ఈ పథకం ఆశలను నింపింది. ఇది ఒక ఆర్థిక సహాయం మాత్రమే కాదు, ఇది ఒక సామాజిక మార్పుకు దారి తీసిన సంస్కరణ. కానీ రాష్ట్ర విభజన తర్వాత ఈపథకం అమలులో వచ్చిన మార్పులు గత ప్రభుత్వం చేసిన ఫీజు రీయింబర్స్మెంట్ ఇచ్చింది, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు ఆరు గ్యారెంటీలలో విద్యను ఆలస్యం, నిర్లక్ష్యం, ఇవన్నీ తీవ్ర ఆందోళనలను రేకెత్తించా యి. బకాయిల చెల్లింపుల్లో నెలలు కాదు, సంవత్సరాల ఆలస్యం జరుగుతుండటంతో కాలేజీలు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఫీజులు చెల్లించలేని



పరిస్థితుల్లో విద్యా ర్థులు హాల్ టికెట్లు పొందలేక పరీక్షలు రాయలేని స్థితికి చేరుతున్నారు. ఇది విద్యా హక్కును ప్రత్యక్షంగా ప్రభుత్వం దెబ్బతీసే పరిణామం. ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ సమస్యను మరింత సంక్లిష్టం చేసింది. కాలేజీలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవచ్చని చెప్పడం ద్వారా, బాధ్యతను ప్రభుత్వం నుంచి విద్యార్థులపై మళ్లించినట్లైంది. పేద విద్యార్థుల పరిస్థితిని పరిగణలోకి తీసుకోకుండా వచ్చి న ఈ తీర్పు సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధమని అనేక విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన సూచనలు, పేద విద్యార్థుల హక్కుల పరిరక్షణ, వీటన్నింటినీ పట్టించుకోనట్లు అనిపి స్తోంది. ఇక్కడ ప్రధానంగా నిలిచే ప్రశ్న ఏమిటంటే, ప్రభు త్వం తన బాధ్యతను ఎంతవరకు నిర్వర్తించింది? కోర్టులో సరైన వాదనలు వినిపించడంలో విఫలమవడం, పథకం అమలులో నిర్లక్ష్యం చూపడం ఇవన్నీ పరిపాలనా అసమ ర్థతను సూచిస్తున్నాయి. అడ్వకేట్ జనరల్ పాత్రపై వచ్చిన విమర్శలు కూడా ఈ నేపథ్యంలోనే చూడాలి. విద్యార్థుల భవిష్యత్తు వంటి కీలకమైన అంశంలో ప్రభుత్వ నిర్లక్ష్యం అనేది అంగీకరించలేని విషయం. ప్రస్తుత ప్రభుత్వం ఎన్ని కల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు బకాయిలను విడుదల చేయడంలో ఆలస్యం చేయడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఒకవైపు ఫీజులు చెల్లించమని కాలేజీలు ఒత్తిడి తెస్తుండగా, మరోవైపు ప్రభుత్వం స్పందించకపోవ డం విద్యార్థులను మానసికంగా కుంగదీస్తోంది. ఈ పరిస్థితి కొనసాగితే దానిప్రభావం కేవలం వ్యక్తిగత స్థాయిలోనేకాదు, సమాజస్థాయిలో కూడా తీవ్రంగా కనిపిస్తుంది. సుమారు14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్య ప్రమాదంలో పడితే, అది రాష్ట్ర అభివృద్ధిపై కూడాప్రభావం చూపుతుంది. విద్య లేకుండా ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయి. తద్వారా పేదరికం, అసమానతలు మరింత పెరుగుతాయి. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థలు చేపట్టిన నిరసనలు ఒక సహజ ప్రతిస్పందనగా కనిపిస్తున్నాయి. తమ హక్కుల కోసం పోరాడడం ప్రజాస్వామ్యంలో ఒక ప్రాథమిక హక్కు. రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనాలని వారు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు అవసరమైనది ఏమిటంటే, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవడం. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. హైకోర్టు తీర్పుపై అప్పీల్ చేయడం ద్వారా విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలి. పథకాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలి. కాలేజీలతో సమన్వయం పెంచి విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలి. అదే సమయంలో సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాలి. విద్య అనేది కేవలం వ్యక్తిగత ప్రయోజనం కాదు, అది సామాజిక అభివృద్ధికి పునాది. బహుజన వర్గాల విద్యాభివృద్ధి లేకుండా సమానత్వం సాధ్యం కాదు. కాబట్టి ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా సామాజిక న్యాయదృష్టితో చూడాలి. మొత్తంగా చూస్తే, విద్య హక్కు కేవలం రాజ్యాంగంలో ఉన్న ఒక నిబంధనగా మిగలకుండా, ప్రతి పేద విద్యార్థి జీవితంలో నిజంగా అమలవ్వాలంటే ప్రభుత్వాలు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలి. లేకపోతే శతాబ్దాలుగా కొనసాగుతున్న అన్యాయం మరో రూపంలో కొనసాగుతుంది. బహుజన వర్గాల భవిష్యత్తు విద్యపై ఆధారపడి ఉంది. ఆ విద్యను కాపాడటం అనేది కేవలం ఒక విధానం కాదు, అది ఒక సామాజిక బాధ్యత, ఒక నైతిక కర్తవ్యం.

# రక్షణ చట్టంతోనే సామాజిక న్యాయం సాధ్యం!

మేకల క్రిష్ణ

ఒకే దేశం – ఒకే చట్టం అనే నినాదం వినడానికి ఆకర్షణీయంగా అనిపించవచ్చు. కానీ భారతదేశం వంటి విభిన్న సామాజిక వర్గాలు ఉన్న దేశంలో అది ఎంతవరకు న్యాయం చేస్తుందన్న ప్రశ్న తప్పనిసరిగా ఎదురవుతుంది. ఎందుకంటే మన సమాజం ఒకే స్థాయిలో లేదు. కులం, వృత్తి, ఆర్థిక పరిస్థితి, విద్యా అవకాశాలు. ప్రతి అంశంలోనూ స్పష్టమైన అసమానతలు కనిపిస్తూనే ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో అందరికీ ఒకే చట్టం అమలు చేస్తే నిజమైన సమాన న్యాయం సాధ్యమవుతుందా అన్నది ఆలోచించాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినా, రాజ్యాంగం ఇచ్చిన సమానత్వ హామీ పూర్తిగా కార్యరూపం దాల్చలేదనే వాస్తవాన్ని ఒప్పుకోవాల్సిందే. ముఖ్యంగా జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు, ఇప్పటికీ అనేక రంగాల్లో వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటూనే ఉన్నారు. ఉద్యోగాల్లో, ఉన్నత విద్యలో, పాలనలోవారి ప్రాతినిధ్యం ఆశించిన స్థాయిలో లేదు. ఇది కేవలం సంఖ్యల సమస్య కాదు, అవకాశాల పంపిణీలో అసమానాతలకు సంకేతం. సామాజికంగా అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకు రావడం ప్రభుత్వ బాధ్యత. అందుకే ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దౌర్జన్యాలను నిరోధించేందుకు అట్రాసిటీ చట్టం అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా బాధితులకు రక్షణ లభించడమే కాకుండా, న్యాయం కోసం ముందుకు వచ్చే ధైర్యం కూడా పెరిగింది. అంటే, ప్రత్యేక రక్షణ ఉన్నప్పుడే అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందని అనుభవపూర్వకంగా తెలుసుకున్న సత్యం. ఇదే సమయంలో బీసీల పరిస్థితిని పరిశీలిస్తే, సమస్యలు ప్రత్యక్షంగా కనిపించకపోయినా చాలా ఉన్నాయి. వృత్తుల్లో పరిమితులు, ఆర్థికంగా స్థిరపడలేకపోవడం, నాణ్యమైన విద్యకు అడ్డంకులు, రాజకీయంగా సరైన ప్రాతినిధ్యం లేకపోవడం ఇవన్నీ బీసీ వర్గాల అభివృద్ధిని నిరోధిస్తున్న అంశాలు. గ్రామీణ ప్రాంతాల్లో భూమి లేని కుటుంబాల్లో, చిన్నచిన్న ఉపాధులపై ఆధారపడే వర్గాల్లో బీసీల శాతం గణనీయంగా ఉంది. అంటే, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరలేదన్నది స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు రక్షణ చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించడం ఒక శుభ పరిణామం. స్వతంత్ర భారతదేశంలో 50 శాతానికి పైగా జనాభా కలిగిన వర్గం ఇప్పటికీ సామాజికంగా వెనుకబడిన స్థితిలో ఉండటం ఆలోచించాల్సిన విషయం. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అనేక రూపాల్లో అణచివేతను ఎదుర్కొంటున్నారనే వాదనను పూర్తిగా విస్మరించలేం. ఇలాంటి పరిస్థితుల్లో బీసీలకు కూడా ప్రత్యేక రక్షణ చట్టం అవసరమా అన్న చర్చ సహజంగానే ముందుకు వస్తోంది. ఇది కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే కాదు. సామాజిక న్యాయసాధనలో ఒక ముఖ్యమైనఅడుగు. ఒక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి, వాటికి చట్టపరమైన రక్షణ కల్పించడం ద్వారానే సమానత్వాన్ని సాధించవచ్చు అన్నది వాస్తవం. సమానత్వం అంటే అందరికీ ఒకే విధంగా వ్యవహరించడం కాదు. అసమాన పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రత్యేక రక్షణ ఇవ్వడం ద్వారానే నిజమైన సమాన న్యాయం సాధ్యమవుతుంది. భారత రాజ్యాంగం కూడా ఇదే భావనను ప్రతిపాదిస్తుంది. అందుకే రిజర్వేషన్లు, ప్రత్యేక చర్యలు అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన బీసీల రక్షణ చట్టంపై చర్చ తెలంగాణలోనూ ముందుకు రావాల్సిన అవసరం ఉంది. బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న అన్యాయాలు, అణచివేతలు కనిపించకపోయినా అవి వాస్తవాలు. వాటిని గుర్తించి చట్టబద్ధమైన రక్షణ కల్పించడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. తెలంగాణలో కూడా బీసీలకు రక్షణ చట్టం తీసుకురావడం కేవలం ఒక విధాన నిర్ణయం కాదు, అది సామాజిక న్యాయానికి ఇచ్చే హామీ. అణగారినవర్గాల గౌరవం, భద్రత, హక్కులు రక్షించబడినప్పుడే సమాజం సమానత్వ దిశగా సాగుతుంది. అందుకే.. తెలంగాణలో నూ బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలి. అదే నిజమైన న్యాయం, అది ప్రభుత్వ బాధ్యత కూడా.

# యుద్ధోన్మాదం వీడండి.. శాంతివైపు అడుగులేయండి

వి.వి.కె.సురేష్

పర్యావరణ పరిరక్షణ, కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన సద్వినియోగం, ఉపాధి పరిరక్షణ వంటి మానవాళి మౌలిక సమస్యలపై సునిశితమైన దృష్టి పెట్టాల్సిన కీలక నేపథ్యంలో, గత నెల రోజులకు పైగా అమెరికా, ఇజ్రాయిల్ ఒక ప్రక్క, మరోవైపు ఇరాన్ కొనసాగిస్తున్న అమానుష యుద్ధం ఫలితంగా ప్రపంచ దేశాలపై తీవ్రమైన దుష్ప్రభావం పడింది. ఎటువంటి యుద్ధంలోనైనా ఇరు ప్రక్కల వినాశనం తప్ప,ఏ ఒక్కరికీ విజయం మాత్రం దక్కదని, పరాజితులు తప్ప, యుద్ధాల్లో చివరకు విజేతలు ఎవరూ ఉండరని చరిత్రలో ఎన్నో సందర్భాల్లో స్పష్టంగా రుజువైంది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అహంకారపూరిత వైఖరి మాత్రమే ఈ యుద్ధానికి ముఖ్యకారణం అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇప్పటికే పాలస్తీనాలోని ప్రాంతాలపై గత రెండేళ్లకు పైగా మారణహోమం సాగిస్తున్న ఇజ్రాయిల్, అమెరికాకు వంతపాడుతూ ఈ యుద్ధంలో మరో భాగస్వామిగా ఉంది. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ (ఐ.సి.సి) ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఒక యుద్ధ నేరస్తునిగా ఇప్పటికే ప్రకటించింది. ట్రంప్ వలలో చిక్కుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించిన నాటో దేశాలను తప్పనిసరిగా అభినందించాలి. ఇరాన్‌పై తప్పుడు ఆరోపణలతో, అవివేకమైన అంచనాలతో యుద్ధబరిలోకి ఏకపక్షంగా దిగిన ట్రంప్ ఇప్పుడు దిక్కుతోచని సంకట స్థితితో సతమతమవుతున్నాడు. అసలు ఏ లక్ష్య సాధనకు యుద్ధం మొదలు పెట్టాడో అర్థం కాని అయోమయ స్థితికి ట్రంప్ నెట్టబడ్డాడు. చివరకు తన సొంత దేశమైన అమెరికా ప్రజల తీవ్ర ఆగ్రహానికి ఆయన గురయ్యారు. మితిమీరిన ఆయన యుద్ధకాంక్షను అమెరికన్ కాంగ్రెస్ కూడా తప్పు పట్టింది. యుద్ధ ప్రభావాన్ని చర్చిం చిన బ్రిటిష్ పార్లమెంట్ కూడా మిత్ర దేశమైన అమెరికాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఐక్యరాజ్య సమితి చేసిన పలు తీర్మానాలను, అంతర్జాతీయ న్యాయ సూత్రా లను అమెరికా ఉల్లంఘిస్తోంది. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని ప్రారంభిస్తే, యుద్ధాన్ని మాత్రం తామే ముగి స్తామని ఇరాన్ ధీమాగా చెబుతోంది. ఇరాన్ పై ఆకస్మి కంగా, అన్యాయంగా యుద్ధాన్ని ప్రారంభించిన ట్రంప్, గడియ గడియకో మాట చెబుతూ, రోజుకొక విధానం అనుసరిస్తున్నాడు. ఇరాన్‌ను మళ్లీ రాతియుగంలోకి పంపిస్తామని బెదిరిస్తున్నాడు. ఇరాన్ పై దాడి చేసి వందల మంది పిల్లలను చంపేయడం వర్ణించలేని కిరాతక చర్య. మొత్తం యుద్ధంలో ఇరుపక్షాల వైపు చమురు క్షేత్రాలు, మిలటరీ కేంద్రాలు, ఆసుపత్రులు, విద్యుత్‌ప్లాంట్లు, పాఠశాలలు, వంతెనల వంటి కీలక కేంద్రాలు ధ్వంసమవుతున్నాయి. ఇరాన్ శక్తియుక్తుల్ని తక్కువగా అంచనా వేయడమే ట్రంప్ అహంకారానికి, అనాలోచిత వైఖరికి నిదర్శనం. చరిత్రను విశ్లేషిస్తే, అమెరికా ఎటువంటి గుణపాఠాలు నేటికీ నేర్చుకోలేదని అర్థమవుతోంది. గతంలో చిలీ, లిబియా,



ఇరాక్ వంటి దేశాలకు సంబంధించి అమెరికా అత్యంత దుర్మార్గంగా వ్యవహరించింది. వియత్నాం చేతుల్లో ఘోరంగా దెబ్బతింది. వెనిజువేలా అధ్యక్షుడు మదురోను అర్ధరాత్రి వేళ అక్రమ పద్ధతుల్లో కిడ్నాప్ చేసి ఆయన్ను బంధించి అమెరికాకు తరలించడం దేశాల సార్వభౌమాధికారంపై దాడి చేయడమే. అర్థంపర్థం లేనివిధంగా పలు దేశాలపై ట్రంప్ భారీ సుంకాలు విధించడం కూడా ఆర్థిక అగ్రవాదమే. ఒక రకంగా అదీ యుద్ధమే. మరోవైపు ఇరాన్ సమయస్ఫూర్తితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా ఎంచుకుని వాటిపై దాడి చేస్తోంది. సామ్రాజ్యవాద, దుర హంకార పెత్తనం చెలాయించే అమెరికాకు ఇరాన్ రూపంలో తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. అసలు గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలు దీర్ఘకాలంగా ఉండటమే అమెరికా ఆధిపత్య ధోరణికి నిదర్శనం. తన రక్షణ వ్యాపారం కోసం, చమురు సంపద కోసం, పశ్చిమాసియాపై తన రాజకీయ, ఆర్థిక పెత్తనం కోసం అమెరికా ఈ దుర్నీతికి అనేక సంవ త్సరాలుగా పాల్పడుతోంది. ఫలితంగా పశ్చిమాసియాలో తీవ్ర అనిశ్చితి నెలకొంది. హార్ముజ్ జలసంధిని ఇప్పుడు ఇరాన్ మూసేసింది. ఫలితంగా భారత్‌తో సహా అన్ని దేశాలు చమురు కష్టాలు పడుతున్నాయి. చమురు బ్యారెల్ ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. అమెరికాతో సహా పలు దేశాలు తమ రక్షణ బడ్జెట్‌ను భారీగా పెంచేసాయి. యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉండటంతో ప్రపంచ దేశాలకు పలు రకాల ఇబ్బందులు ఎదురయ్యాయి. పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమవుతున్నాయి. ద్రవ్యోల్బణం, ధరలు పెరిగాయి. ఎగుమతులు, దిగుమతుల వ్యవస్థలు దెబ్బతిని వాణిజ్య రంగం కునారిల్లుతోంది. హార్ముజ్ జల సంధి ద్వారా జరిగే చమురు రవాణాకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ఇరాన్‌తో భారత్ కున్న సాంప్రదాయక మిత్రుత్వం వల్ల కొంత మేరకు ఉపశమనం లభించింది. అయితే రూపాయి విలువ రికార్డ్ స్థాయి పతనం, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల, భారీ వాణిజ్యలోటు వంటి తీవ్ర సమస్యలను భారత్ ఎదుర్కొంటోంది. గల్ఫ్ దేశాల నుండి సుమారు 4 లక్షల మంది భారత్‌కు తిరిగి వచ్చేసారు. ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ యుద్ధాన్ని వెంటనే విరమించాలని అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ దేశాలకు గట్టిగానే చెప్పారు. కానీ ప్రపంచ శాంతి, దేశాల భద్రత కోసం ఆయన చేసిన సూచనలను పెడచెవిన పెట్టడం సహించరాని విషయం. వీటో అధికారం కల్గిన అమెరికా వంటి ఒక అగ్రదేశం ఐక్యరాజ్య సమితి నిర్ణయా లను ఖాతరు చేయకపోవడం అనైతికం. అదే సందర్భంలో 'ప్రతి దేశం తమ సొంత ప్రయోజనాల కన్నా, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు కట్టుబడి ఉండటం ఎంతో మిన్న' అంటూ స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్ ఇచ్చిన అపూర్వమైన సందేశం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. అంతే కాకుండా ఇజ్రాయిల్ నుండి తమ దేశ రాయబారిని వెనక్కు రప్పించి యుద్ధం పట్ల తీవ్ర వ్యతిరేకతను ఆయన గట్టిగా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణమే యుద్ధ విరమణ జరగాలి. అప్పుడే విపత్కర పరిస్థితుల నుండి భారత్‌తో సహా మొత్తం ప్రపంచ దేశాలు బయట పడతాయి. యుద్ధ విరమణ కోసం అన్ని దేశాలు తమ వంతు కృషి చేయాలి, అంతే కాదు బిగ్గరగా

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

**హెజ్‌బొల్లా సైనిక స్థావరాలే లక్ష్యంగా వైమానిక దాడులు: 250 మందికిపైగా మృతి, 1100 మందికి గాయాలు**



**బీరూట్, ఏప్రిల్ 9:** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్ లెబనాన్‌పై భీకర వైమానిక దాడులకు దిగింది. ఈ దాడుల్లో 250 మందికి పైగా మరణించగా, 1100 మందికి పైగా గాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కాల్పుల విరమణను ప్రకటించారు. హార్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు అనుమతించేందుకు ఇరాన్ అంగీకరించింది. ఈ ఒప్పందం వెలువడిన వెనువెంటనే ఇజ్రాయెల్ లెబనాన్‌లోని బీరుట్, బెకా లోయ సహా హిజ్బుల్లా స్థావరాలే లక్ష్యంగా విరుచుకుపడింది. అమెరికాతో కుదిరిన ఒప్పందం తమకు, హిజ్బుల్లాకు మధ్య జరుగుతున్న పోరాటానికి వర్తించదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ కూడా లెబనాన్‌లో జరుగుతున్నది ఒక ప్రత్యేక ఘర్షణని పేర్కొన్నారు. ఈ దాడులను ఐక్య రాజ్యసమితి తీవ్రంగా ఖండించింది. ఒప్పందం కుదిరిన గంటల వ్యవధిలోనే ఇంతటి మారణ హోమం జరగడం నమ్మశక్యంగా లేదని యూఎన్ మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఉత్తర ఇజ్రాయెల్‌పై రాకెట్లతో దాడి చేసినట్లు హిజ్బుల్లా ప్రకటించింది. ఇజ్రాయెల్‌అమెరికా దురాక్రమణ ఆగే వరకు తమ ప్రతిదాడులు కొనసాగుతాయని హిజ్బుల్లా హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లో జరగాల్సిన తదుపరి చర్చలు అత్యంత కీలకంగా మారాయి. కాల్పుల విరమణ వార్తతో 95 డాలర్ల దిగువకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర, లెబనాన్ దాడులతో మళ్లీ 97 డాలర్లకు పెరిగింది.

## హెజ్‌బొల్లా చీఫ్, మేనలుల్ల మృతి

**టెల్ అవీవ్, ఏప్రిల్ 9:** ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్బొల్లా చీఫ్ నయీం ఖాసీమ్ మృతి చెందారు.



తమ దాడుల్లో నయీం ఖాసీమ్ మృతిచెందినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. అలాగే హెజ్బొల్లా అధిపతి నయీమ్ ఖాసీమ్ కార్యదర్శి, మేనల్లుడు అయిన అలీ యూసుఫ్ హర్షిని కూడా హతమార్చినట్లు పేర్కొంటూ ఇజ్రాయెల్ రక్షణ దళాలు ప్రకటన విడుదల చేశాయి. ఐడిఎఫ్ దళాలు లెబనాన్ రాజధాని బీరూట్‌లో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో ఈ విజయం సాధించినట్లు పేర్కొన్నారు. లెబనాన్‌లోని హెజ్బొల్లా మౌలిక సదుపాయాలు, ఆయుధ డిపోలపై బుధవారం రాత్రి వరుస దాడులు నిర్వహించినట్లు ఐడిఎఫ్ పేర్కొంది. ఈ ఆపరేషన్ల ముఖ్య ఉద్దేశ్యం, ఆ ఉగ్రవాద సంస్థ యొక్క కమాండ్ నెట్‌వర్క్‌ను పూర్తిగా దెబ్బతీయడం, దాని ఆయుధ సరఫరా మార్గాలనుపూర్తిగా నిలిపివేయడమేనని పేర్కొంది.

**సౌదీ ముడిచమురు పైప్‌లైన్లపై ఇరాన్ క్షిపణి దాడులు..!**



**దుబాయి, ఏప్రిల్ 9:** అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇరాన్ మళ్లీ తన దూకుడు ప్రదర్శించింది. సౌదీ అరేబియాలోని అత్యంత కీలకమైన ముడి చమురు పైప్‌లైన్‌ను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, క్షిపణులతో దాడికి పాల్పడింది. పర్షియన్ గల్ఫ్ నుంచి ఎర్ర సముద్రంలోని యన్‌బు ఓడరేవుకు చమురును రవాణా చేసే ఈ ఈస్ట్‌వెస్ట్ పైప్‌లైన్ సౌదీకి అత్యంత వ్యూహాత్మకమైనది. సుమారు 1,200 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గం, వివాదాస్పద హార్మూజ్ జలసంధిని దాటకుండా చమురు ఎగుమతి చేసేందుకు సౌదీకి ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం. యన్‌బు ప్రాంతంలోని పంపింగ్ స్టేషన్లను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిపినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) ప్రకటించింది. ఈ ఘటనలో ఒక పంపింగ్ స్టేషన్ వద్ద మంటలు చెలరేగాయి. రోజుకు 70 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా సామర్థ్యం ఉన్న ఈ పైప్‌లైన్ దెబ్బతినడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు మరోసారి ఆకాశాన్నంటే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సౌదీ ప్రభుత్వ చమురు సంస్థ అరామ్‌కో నష్టాన్ని అంచనా వేస్తోంది. నష్టం పరిమితంగానే ఉందని, పైప్‌లైన్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోలేదని తెలుస్తోంది. ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని అమెరికా జనరల్ డాన్ కెయిన్ హెచ్చరించారు.

## పూర్తిస్థాయి ఒప్పందం అమలయ్యేదాకా మా బలగాలు అక్కడే ఉంటాయి: ట్రంప్



**వాషింగ్టన్, ఏప్రిల్ 9:** ఇరాన్‌తో యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తిస్థాయి ఒప్పందం అమలయ్యేదాకా తమ దేశానికి చెందిన యుద్ధనౌకలు, బలగాలు ఇరాన్‌ను చుట్టుముట్టే ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ స్పష్టంచేశారు. ప్రస్తుతం కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. యుద్ధం ముగించే విషయంలో ఇరాన్‌తో పూర్తిస్థాయి ఒప్పందం కుదిరి అది అమల్లోకి వచ్చేంతవరకు తమ యుద్ధ నౌకలు, విమానాలు, సైనిక సిబ్బంది, ఆయుధాల వంటివన్నీ ఇరాన్, దాని పరిసర ప్రాంతాల్లోనే మోహరించి ఉంటాయని పేర్కొన్నారు. ఏదైనా కారణంతో ఇరాన్ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే గనుక మునుపెన్నడూ చూడనంత స్థాయిలో తాము విరుచుకుపడతామని వార్నింగ్ ఇచ్చారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడుల నేపథ్యంలో హార్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందం నుంచి వైదొలుగుతామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ టెహ్రాన్‌కు మళ్లీ హెచ్చరికలు చేశారు. దాంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి. అమెరికా ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో లెబనాన్ భాగం కాదని పేర్కొంటూ ఇజ్రాయెల్ ఆ దేశంపై భీకర దాడులు చేసింది. ఇందులో వందల సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై దాడులకు దిగింది.

## ఇరాన్ ప్రతిపాదనలన్నీ చాట్‌జిపిటి రాసినవే: జెడివాన్స్



**వాషింగ్టన్, ఏప్రిల్ 9:** ఇరాన్‌అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ మూడు వెర్షన్లలో తన 10 పాయింట్ల ప్రతిపాదనలు పంపిందని, అందులో ఒకటి చాట్‌జీపీటీ రాసినట్లుగా ఉందని అన్నారు. ఇరాన్ నుంచి వచ్చిన మూడు వేర్వేరు ప్రతిపాదనలు గందరగోళాన్ని సృష్టించాయని పేర్కొన్నారు. తొలుత 10 పాయింట్లతో ఒక ప్రతిపా దనను పంపించారని, అయితే అది చాట్‌జీపీటీ రాసినట్లుగా ఉందని వాన్స్ అన్నారు. పశ్చిమాసియాలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లకు ఆ ప్రతిపాదనలు అందాయని చెప్పారు. వెంటనే వారు ఆ ప్రతిపాదనలను తిరస్కరించారని తెలిపారు. ఇరాన్ ప్రతిపాదనలకు సంబంధించిన రెండో వర్షన్‌కు తాము అంగీకరించామని, కాల్పుల విరమణ ప్రకటనలో అధ్యక్షుడు ట్రంప్ దాన్నే ప్రస్తావించారని చెప్పారు. ప్రతిపాదనలకు సంబంధించిన మూడో వెర్షన్ మొదటి దానికంటే అత్యంత దారుణంగా ఉందని, అందులోని డిమాండ్లు అంగీకరించలేని విధంగా ఉన్నాయని అన్నారు.

## ఇంధన కొరతపై ఎమిరేట్స్, ఖతార్‌లలో కేంద్ర మంత్రుల పర్యటనలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:** అమెరికా ఇరాన్‌దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ దేశీయంగా ఇంధన కొరతపై ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హార్దీప్‌సింగ్ పురి ఖతార్ పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆయన రెండురోజులు ఖతార్‌లో పర్యటించనున్నట్లు పెట్రోలియంశాఖ ప్రకటించింది. అయితే పూరీ పర్యటనకు సంబంధించిన స్పష్టమైన కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో పురి ఖతార్‌కు వెళ్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 11,12 తేదీల్లో జైశంకర్ పర్యటించనున్నట్లు విదేశాంగ శాఖ పేర్కొన్నది.

## భారత్ నౌకల్లోని సిబ్బందికి హై అలర్ట్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:** హార్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన భారత నావికులకు కేంద్రం అత్యవసర అడ్వయిజరీ జారీచేసింది. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా నౌకల నుంచి బయటకు రావద్దని సూచించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఒక అలర్ట్ జారీచేసింది. భద్రతా కారణాల దృష్ట్యా ఇరాన్ దాని పరిసర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులు సున్నితమైన ప్రదేశాలకు దూరంగా ఉండాలని, అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని సూచించింది.

## అమెరికా చెప్పినట్లే వ్యవహరించిన పాకిస్థాన్!



**వాషింగ్టన్, ఏప్రిల్ 9:** ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం వెనుక అమెరికా చెప్పినట్లే పాక్ మెలిగిందన్న ఆరోపణలు తెరపైకి వచ్చాయి. మిత్రదేశంగా ఇరాన్‌ను ఒప్పించినట్లు కనిపిస్తున్న పాకిస్థాన్, నిజానికి అమెరికా చెప్పినట్లే ఆడిందని అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో పాక్ కేవలం అగ్రరాజ్యం ఆదేశాలను అమలు చేసే ఒక 'మధ్యవర్తి'గా మాత్రమే వ్యవహరించిందని, ఇది ఇరాన్‌కు చేసిన ద్రోహమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈనెల 7న ఇరాన్‌పై దాడి చేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ, వైట్ హౌస్ అధికారులు మాత్రం యుద్ధం కంటే చర్చలే మేలని భావించారు. ఇందుకోసం ఇరాన్‌కు పొరుగు దేశమైన పాకిస్థాన్‌ను ఒక ఆయుధంగా వాడుకున్నారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ కూడా స్వతంత్రంగా చేసింది కాదని సమాచారం. ఆ పోస్ట్ యొక్క డ్రాఫ్ట్‌ను కూడా వైట్ హౌస్ ఆమోదించిన తర్వాతే ఆయనపోస్టుచేసారని ఆంగ్లపత్రిక పేర్కొంది. అమెరికా ప్రతిపాదనను ఇరాన్ మొదట తిరస్కరించడంతో, ఇస్లామాబాద్ వెంటనే చైనా సహాయం కోరింది. బీజింగ్ జోక్యంతోనే ఇరాన్ చివరకు ఈ కాల్పుల విరమణకు తలొగ్గిందని అంటున్నారు. శనివారం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరగనున్న ఈ శాంతి సమావేశానికి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ హాజరుకానున్నారు. అయితే ఈ వేదిక వెనుక అమెరికాకు రెండు స్పష్టమైన లక్ష్యాలు ఉన్నాయి. పాకిస్థాన్ ద్వారా ఇరాన్‌పై మరింత ఒత్తిడి పెంచడం ఒకటి అయితే, పశ్చిమ ఆసియా రాజకీయాల్లో పాకిస్థాన్‌కు ప్రాధాన్యత కల్పించి, దానిని తన వైపు తిప్పుకోవడం రెండో లక్ష్యాలుగా చెబుతున్నారు.

## మధ్యవర్తి దేశాన్ని నమ్మలేం



### భారత్‌లో ఇజ్రాయెల్‌రాయబారి వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:** అమెరికాఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణకు సంబంధించిన చర్చల్లో పాకిస్థాన్ పాత్రపై ఇజ్రాయెల్ సందేహం వ్యక్తం చేసింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంపై తమకు నమ్మకం లేదని పేర్కొంది. భారత్ లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం పాక్ మధ్యవర్తిత్వాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నదని తాము భావిస్తున్నట్లు అజార్ తెలిపారు. ఈ సందర్భంగా ఖతార్, తుర్కియే వంటి సమస్యాత్మక దేశాల ద్వారా హమాస్‌తో అమెరికా కుదుర్చుకున్న ఒప్పందం గురించి అజార్ ప్రస్తావించారు. ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలు సాధించేందుకు యూఎస్ సమన్వయంతో ముందుకుసాగడం తమకు చాలా ముఖ్యమని అన్నారు. ఇక అమెరికాఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణకు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అయితే లెబనాన్‌పై మాత్రం తమ సైనిక చర్యలు కొనసాగుతాయని పునరుద్ఘాటించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధం లేదని అజార్ అన్నారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యమని చెప్పారు. అది ఇజ్రాయెల్ బాధ్యతగా అభివర్ణించారు.

## బారామతిలో సునేత ఏకగ్రీవం



**ముంబై, ఏప్రిల్ 9:** మహారాష్ట్రలోని బారామతి నియోజకవర్గానికి జరగాల్సిన బైపోల్ ఎన్నికల నుంచి కాంగ్రెస్ పార్టీ తప్పుకున్నది. దీంతో ఎన్సీపీ నేత, డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు మార్గం సులువయింది. ఇటీవల ఎన్సీపీ నేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిదే. ఈ నేపథ్యంలో బారామతిలో ఏప్రిల్ 23వ తేదీన ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తప్పుకోవడంతో సునేత్ర పవార్ ఎన్నిక ఏకగ్రీవం కానున్నది. పోటీ నుంచి తప్పుకోవాలని ఎన్సీపీ నేతలు శరద్ పవార్, సుప్రియా సూలే కాంగ్రెస్ పార్టీని అభ్యర్థించారు. బైపోల్స్ నామినేషన్‌కు గురువారమే చివరి రోజు. అయితే బారామతి నుంచి తమ పార్టీ అభ్యర్థి అమర్ మోరే పోటీ చేయడం లేదని మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ హర్షవర్ధన్ సప్కాల్ తెలిపారు.

## బెంగాల్‌లో మార్పు తథ్యం: ప్రధాని మోడీ



**కోల్‌కతా, ఏప్రిల్ 9:** పశ్చిమబెంగాల్‌లోని హాల్దియాలో ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. అయిదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో సిఎం మమతా బెనర్జి ఓటమిని గుర్తుచేస్తూ ఈసారి పశ్చిమబెంగాల్ రాష్ట్రం అంతటా అదే ఫలితం పునరావృతమవుతుందని చెప్పారు. పశ్చిమ బెంగాల్ మార్పును కోరుకుంటోందని, ఈ క్రమంలో బిజెపి భారీ విజయాన్ని చూస్తామని వ్యాఖ్యానించారు. నందిగ్రామ్‌లో అయిదేళ్ల క్రితం ఏం జరిగిందో ఇప్పుడు భవానీపూర్‌తో పాటు మొత్తం బెంగాల్‌లోనూ అదే ఫలితం వస్తుందని ప్రధాని జోస్యం చెప్పారు. ఇవి సాధారణ ఎన్నికలు కావని, ఈ ఎన్నికలు అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టిఎంసి ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోందని విమర్శించారు. తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని ప్రధాని అన్నారు. శరణార్థులకు రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక హక్కులను కల్పిస్తామని, చొరబాటుదారులను మాత్రం దేశం నుంచి తరిమికొడతామని చెప్పారు. ఒక్కసారి బిజెపి అధికారంలోకి రాగానే 7వ వేతన కమిషన్‌ను అమల్లోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

## అసోంలో భారీ విజయం బిజెపిదే: సోనోవాల్



**గౌహతి, ఏప్రిల్ 9:** అసోం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జోరుగా సాగుతోంది. కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ తన స్వగ్రామమైన డిబ్రూగఢ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భారీ విజయాన్ని నమోదు చేయబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సుమారు 100స్థానాలను కైవసం చేసుకుంటుందని సోనోవాల్ చెప్పారు. ఎన్నికల ప్రచారం ప్రారంభమైన మొదటిరోజు నుంచి చెబుతున్నాను. మా కూటమి వందసీట్లకు పైగా గెలవడం ఖాయం అంటూ ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే తమను గెలిపిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు సామాజిక న్యాయాన్ని, మెరుగైన జీవన ప్రమాణాలను కోరుకుంటున్నారని, మోడీ ప్రభుత్వం ఆ దిశగా ఎంతో కృషి చేసిందని సోనోవాల్ అన్నారు. అస్సాంను అభివృద్ధి పథంలో నడిపించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను తమ ప్రభుత్వం కల్పించిందని, అందుకే మోడీ నాయకత్వంపై అచంచలమైన విశ్వాసం కలిగి ఉన్నారని ఆయన వివరించారు. కాగా, అస్సాంలోని మొత్తం 126 నియోజక వర్గాలకు ఈ రోజు పోలింగ్ జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.5 కోట్ల మంది ఓటర్లు తమ తీర్పును ఇవిఎంలలో నిక్షిప్తం చేస్తున్నారు. అస్సాంతో పాటు కేరళ, పుదుచ్చేరిలలోకూడా నేడు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. అస్సాంలో బిజెపి వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలని పట్టుదలగా ఉండగా, కాంగ్రెస్ తన పూర్వవైభం కోసం గట్టిగా పోరాడుతోంది.

## పుదుచ్చేరి పోలింగ్‌కేంద్రాల్లో 'నీల' రోబో హడావిడి

**పుదుచ్చేరి, ఏప్రిల్ 9:** పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో ఓ వినూత్న దృశ్యం అందరి దృష్టిని ఆకర్షించింది. ఓ పోలింగ్ కేంద్రంలో నీల అనే హ్యూమనాయిడ్ రోబో, సంప్రదాయ చీరకట్టులో ఓటర్లకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజాస్వామ్య పండుగకు సాంకేతికతను జోడించి ఎన్నికల సంఘం చేసిన ఈ ప్రయోగంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఈ మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద సందడి వాతావరణం నెలకొంది. కేంద్రానికి వచ్చే ఓటర్లకు నీల రోబో చేతులు జోడించి నమస్కరిస్తోంది. ఓటు వేయడానికి వచ్చినందుకు ధన్యవాదాలు. మీ ఓటు హక్కును వినియోగించుకోండి అంటూ సందేశం ఇస్తూ వారిలో ఉత్సాహం నింపుతోంది. ఈ అనూహ్య పరిణామానికి ఓటర్లు, ముఖ్యంగా యువత ఆశ్చర్యపోయారు. చాలామంది నీల రోబోతో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపారు. ఓటింగ్ శాతాన్ని పెంచడంతో పాటు, ఓటర్లలో చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ సరికొత్త ఆలోచనను అమలు చేసింది. పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి బారులు తీరారు.

# అంచనాలను మించి భారీ పోలింగ్

### పోలింగ్ ముగిసేనాటికే 75శాతం దాటిన ఓటింగ్

**తిరువనంతపురం, ఏప్రిల్ 9:** కేరళ, అసోం రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. మూడు ప్రాంతాల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ అధికారికంగా ముగిసినప్పటికీ, పలు కేంద్రాల్లో ఓటర్లు క్యూలలో వేచి ఉండటంతో వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో తుది పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది.

ఈ ఎన్నికల ఓట్ల లెక్కింపును మే 4వ తేదీన చేపట్టనున్నారు. కేరళలో గెలుపుపై ఎవరి ధీమా వారిదే అన్నట్లుగా ఉంది. ప్రజాస్వామ్య పండుగగా అభివర్ణించే ఎన్నికల పర్వానికి కేరళలో గురువారం సాయంత్రం 6 గంటలకు అధికారికంగా తెరపడింది. రాష్ట్రంలోని 140 అసెంబ్లీ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో సాయంత్రం 5 గంటల సమయానికి 75.01 శాతం ఓటింగ్ నమోదైంది. కోజికోడ్ జిల్లాలో అత్యధికంగా 77.63 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

2021 అసెంబ్లీ ఎన్నికల్లో 75.75 శాతం పోలింగ్ నమోదవగా, ఈసారి కూడా తుది సంఖ్య 80 శాతం మార్కును దాటుతుందా లేదా అనేది ఆసక్తికరంగా ఉంది. 1987 తర్వాత 80 శాతం ఓటింగ్ దాటడం ఇదే తొలిసారి అవుతుంది. పోలింగ్ ముగియడంతో, ఇప్పుడు అందరి దృష్టి మే 4న జరగబోయే ఓట్ల లెక్కింపుపైనే ఉంది. రాబోయే ఐదేళ్లపాటు రాష్ట్ర సచివాలయాన్ని ఎవరు శాసిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్), తమ ప్రస్తుత 99 సీట్ల కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేసింది. మరోవైపు, కాంగ్రెస్ సీనియర్ నేత ఏకే ఆంటోనీ, వీడీ సతీశన్ వంటి నేతల సారథ్యంలోని ప్రతిపక్ష యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), 100 సీట్ల మార్కును దాటి అధికారంలోకి వస్తామని ధీమాగా చెబుతోంది. ఈ రెండు కూటములకు భిన్నంగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని అంచనా వేశారు. 2016లో ఒక్క సీటు గెలిచి, 2021లో దాన్ని కోల్పోయిన బీజేపీ అంచనాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి.

పుదుచ్చేరిలో రికార్డు బ్రేకింగ్ పోలింగ్ నమోదయింది. 30 అసెంబ్లీ స్థానాలున్న పుదుచ్చేరిలో రికార్డు స్థాయి ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటలకే 86.92 శాతం పోలింగ్ నమోదవడం విశేషం. ఇది 2006లో నమోదైన 86 శాతం రికార్డును అధిగమించింది. తుది పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తం 9.5 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో మహిళా ఓటర్లే అధికం. అధికార ఎన్డీఏ కూటమి (ఏఐఎన్ఆర్‌సీ నేతృత్వంలో), ప్రతిపక్ష ఇండియా కూటమి (కాంగ్రెస్, డీఎంకే, వీసీకే) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వీరితో పాటు నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టివికె), సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళ్ కట్చి (ఎన్టీకే) కూడా బరిలో నిలవడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. అసోం, ఇతర ఉప ఎన్నికల్లోనూ భారీగా ఓటింగ్ నమోదయింది.

అసోంలోని 126 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 84.42 పోలింగ్ నమోదైంది. సౌత్ సల్మారా మంకాచార్ జిల్లాలో అత్యధికంగా 94.08 ఓటింగ్ నమోదైంది. ఇక వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో 65.68 , దావణగెరె సౌత్‌లో 63.04 , నాగాలాండ్‌లోని కోరిడాంగ్ స్థానంలో 80.62, త్రిపురలోని ధర్మనగర్‌లో 79.84పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లోని అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. మే 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా, మధ్యాహ్నానికి ఫలితాలపై స్పష్టత రానుంది. అప్పటి వరకు ఇదే ఉత్కంఠ అభ్యర్థుల్లో నెలకొంటుందనడంలో సందేహంలేదు.



అసోంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు





కేరళలో ఓటువేసేందుకు వచ్చి నవజంట



పాండిచ్చేరిలో మండుటెండలకు తాళలేక సేద తీరుతున్న ఓటర్లు

## త్రిదళాల్లో 'థియేటర్ కమాండ్' వ్యవస్థలు..!



కేంద్ర రక్షణశాఖ

### పరిశీలనలో ప్రతిపాదనలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:** రక్షణ దళాల్లో థియేటర్ కమాండ్ వ్యవస్థను సరికొత్తగా రూపొందిస్తున్నారు. కొత్త తరహా థియేటర్ కమాండ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు త్రివిధ దళాలు ప్లాన్ రెడీ చేసాయి. రక్షణ బలగాలు ఈ వ్యవస్థ కింద సరికొత్త రీతిలో తమ విధులను నిర్వర్తిస్తాయి. పశ్చిమ సరిహద్దుల్లో పాకిస్థాన్‌ను ఎదుర్కొనేందుకు వెస్ట్రన్ థియేటర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కమాండ్ భారతీయ వైమానిక దళం ఆధీనంలో ఉండనున్నది. ఇక ఉత్తర థియేటర్ కమాండ్ చైనా సరిహద్దుల్ని పర్యవేక్షిస్తుంది. దీనికి ఆర్మీ ఆఫీసర్ నాయకత్వం వహించనున్నారు. ఇక మారిటైం థియేటర్ కమాండ్‌కు నేవీ ఆఫీసర్ నాయకత్వం వహిస్తారు. త్రివిధదళాల మధ్య సమన్వయం కోసమే థియేటర్ కమాండ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఈ వ్యవస్థలకు రక్షణశాఖ, భద్రతా క్యాబినెట్ కమిటీ నుంచి ఆమోదం దక్కాల్సి ఉంటుంది. భౌగోళిక సరిహద్దులతో థియేటర్ కమాండ్ వ్యవస్థలు పనిచేస్తాయి. ప్రతి కమాండ్‌కు ఓ మిలిటరీ కమాండ్ నాయకత్వం వహిస్తారు. యుద్ధానికి కావాల్సిన అన్ని ఆయుధాలు అతని ఆధీనంలో ఉంటాయి. యుద్ధ పోరాట పరికరాలు, విమానాలు, హెలికాప్టర్లు, గన్నులు, యుద్ధ ట్యాంక్‌లు, సామాగ్రి, సైన్యం మొత్తం ఆ కమాండర్ ఆదేశాల పరిధిలోకి వస్తాయి. కొత్త ప్లాన్ ప్రకారం వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు పర్మనెంట్‌గా భారతీయ వైమానిక దళం నేతృత్వం వహించనున్నది.

10-4Pg6exHMNWJQE.qxd:10-4Pg6exHMNWJQE.qxd 1/1/02 6:33 AM Page 1



## ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ స్క్రీనింగ్ కమిటీ పునర్వ్యవస్థీకరణ

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) అధికారుల ఉద్యోగోన్నతుల పరిశీలన కోసం స్క్రీనింగ్ కమిటీని పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ పరిపాలనా శాఖ జి.ఓ 718 ప్రకారం.. అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి (అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కజర్వేటర్) స్థాయి ప్రమోషన్లను పరిశీలించేందుకు ఈ కమిటీ పనిచేయనుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇంతకుముందు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ, కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సభ్యులుగా అటవీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ / ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రధాన అటవీ సంరక్షణాధికారి, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి ఉంటారు. ఈ కమిటీ ఐఎఫ్ఎస్ అధికారుల పనితీరు, సీనియారిటీ తదితర అంశాలను పరిశీలించి, ఉద్యోగోన్నతులపై తుది సిఫారసులు చేయనుంది.

### ఉగ్ర లింకుల కేసులో మరో ఆరుగురిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విజయవాడ ఉగ్ర లింక్స్ కేసులో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో అరెస్టయిన మరో ఆరుగురు నిందితులను కొత్తపేట పోలీసులు గురువారం నుంచి ఐదు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న వీరిని మధ్యాహ్నం విజయవాడకు తరలించనున్నారు.

13వ తేదీ వరకు వీరిని విచారించేందుకు విజయవాడ సీజేఎం కోర్టు పోలీసులకు అనుమతి మంజూరు చేసింది. అంతకుముందు పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించిన ఐదుగురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా తాజా విచారణకు రంగం సిద్ధమైంది. వారి స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ ఆరుగురి నుంచి కీలక సమాచారం రాబట్టాలని పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం కస్టడీలోకి తీసుకోనున్న నిందితుల్లో బిహార్‌కు చెందిన షాద్‌మాన్ దిల్కష్ (ఏ4), ఢిల్లీకి చెందిన లక్కీ అహ్మద్ ( ఏ7), రాజస్థాన్‌కు చెందిన జిషాన్ (ఏ9), పశ్చిమ బెంగాల్‌కు చెందిన మీర్ ఆసిఫ్ అలీ (ఏ10), పుణెకు చెందిన షారుక్ ఖాన్ (ఏ12), మహారాష్ట్రకు చెందిన షేక్ ఫయాజ్ రెహమాన్ (ఏ13) ఉన్నారు. కాగా, ఈ కేసులో మొత్తం 13 మందిపై కేసు నమోదు కాగా, పోలీసులు ఇప్పటివరకు 12 మందిని అరెస్ట్ చేశారు. వారిలో ఒకరు మైనర్ కావడంతో జువైనల్ హోమ్‌కు తరలించారు. మిగిలిన నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉంచి విచారణ కొనసాగిస్తున్నారు.

## జగన్ ఏమి చెప్పినా జనం వినే స్థితిలో లేరు

**- కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**

**విజయవాడ, ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుచిత విధానాలను అనుసరిస్తున్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. ఆయన ఏమీ చెప్పినా ప్రజలు ఆయనను విశ్వసించే పరిస్థితి లేదన్నారు. వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మూడు రాజధానుల పేరుతో రుషికొండను మింగేసి, సొంతానికి ప్యాలెస్‌లు కట్టుకున్న జగన్.. ఇప్పుడు మావిగన్ జోకర్ గా మిగిలిపోయారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ కేవలం వైఎస్సార్ పేరును ఉపయోగించుకున్నారో తప్ప, ఆయన ఆశయాలకు వారసుడు కాలేకపోయారని విమర్శించారు. వైఎస్సార్ జీవితకాలం వ్యతిరేకించిన బీజేపీకి జగన్ దత్తపుత్రుడిగా ఎలా మారారని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా క్రైస్తవ మైనారిటీలపై దాడులు జరుగుతున్నా వైఎస్సార్ వారసుడిగా జగన్ ఎందుకు ఖండించలేదని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని దుయ్యబట్టారు.

# క్వాంటమ్ హార్డ్‌వేర్ హబ్‌గా అమరావతి

**- 14న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం**




హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్ టెక్నాలజీ ప్రాజెక్ట్(ఉహాచిత్రం)

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతికి విశ్వవ్యాప్తం ఖ్యాతిని తీసుకుని వచ్చే,ఓ చారిత్రకత్మ ఆవిష్కరణకు తొలి అడుగు ఈ నెలలో పడనుంది.దేశంలోనే తొలి క్వాంటమ్ హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్‌లతో భవిష్యత్ టెక్నాలజీలో అమరావతి మరో సంచలనానికి నాంది పలుకనున్నది. ఈ నెల 14న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభమయ్యే ప్రాజెక్ట్ క్వాంటమ్ యుగానికి అంకుర్పారణ కానున్నది. అమరావతిని గ్లోబల్ క్వాంటమ్ హబ్‌గా మలిచే దిశగా ఇది చారిత్రక ఘట్టంగా నిలుస్తోంది. క్వాంటమ్ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారు. రాష్ట్ర రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి క్వాంటమ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యం దిశగా కీలకమైన ముందడుగు పడింది. దేశంలోనే తొలి క్వాంటమ్ హార్డ్‌వేర్ టెస్ట్ బెడ్‌లు అమరావతిలోని ఎస్ ఆర్ఎం యూనివర్సిటీ, విజయవాడలోని మేధాటవర్స్‌లోనూ ఏర్పాటవుతున్నాయి. భారత్ క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ గా వ్యవహరిస్తున్న వీటిని ఈ నెల 14న ప్రపంచ ఈ రెండుచోట్ల దేశీయ పరిజ్ఞానంతో తయారుచేసిన రెండు చిన్న క్వాంటమ్ కంప్యూటర్లను ఏర్పాటు చేస్తున్నారు. క్వాంటమ్ వ్యాలీ ఆలోచన మొగ్గతొడిగాక, ఆ రంగంలో విశేష నైపుణ్యం ఉన్న దేశ, విదేశీ నిపుణులతో స్టార్టప్ కంపెనీగా ఏర్పాటైన క్యూబిట్ ఫోర్స్ సంస్థ ఈక్వాంటమ్ కంప్యూటర్లను రూపొందించింది. అమరావతిలో ఏర్పాటు చేస్తు న్న రిఫరెన్స్ ఫెసిలిటీస్‌ను కేవలం క్వాంటమ్ హార్డ్‌వేర్ టెస్టింగ్ కోసమే కాకుండా, దేశంలోని పరిశోధకులు, స్టార్టప్ కంపెనీలు, పరిశ్రమలు, యూనివర్సిటీలు, విద్యార్థులు వినియోగించు కోవచ్చు. క్వాంటమ్ టెక్నాలజీని ఇంత వరకు పాఠ్యపుస్తకాల్లో చదివి, సిమ్యులేటర్లపైనే ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు ఇకపై నేరుగా క్వాంటమ్ కంప్యూటర్లపై ప్రయోగాలు చేయవచ్చు. ఎస్ఆర్ఎం, మేధాటవర్స్‌లో ఏర్పాటు చేస్తున్న రిఫరెన్స్ ఫెసిలిటీల్లో 111 క్యూబిట్స్ వరకు క్వాంటమ్‌ప్రాసెసర్‌లను పరీక్షించవచ్చు. రాబోయే పదేళ్లలో మిలియన్ క్యూబిట్స్ వరకు టెస్టింగ్ సదుపాయాన్ని అభివృద్ధి చేయాలని క్యూబిట్ ఫోర్స్ లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలోని 6 నగరాలకు చెందిన సంస్థలు తయారుచేసిన క్వాంటమ్ విడిభాగాల్ని అమరావతికి తీసుకొచ్చి వాటిని క్యూబిట్ ఫోర్స్ సంస్థ అసెంబుల్ చేస్తోంది. వాటికి కావలసిన ప్రాసెసర్‌లను టీఐఎఫ్ఆర్ ముంబయి, ఐఐఎస్సీ బెంగళూరు తయారు చేశాయి. పుణెలోని డీఆర్‌డీవో ల్యాబ్ క్వాంటమ్ కంట్రోల్ ఎలక్ట్రానిక్స్‌ను అందజేసింది. ఆంబర్ ఎంటర్‌ప్రైజెస్, క్యూబిట్‌ఫోర్స్ సంస్థలు అత్యంత కీలకమైన డైల్యూషన్ రిఫ్రిజిరేటర్లను తయారుచేశాయి. క్యూట్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ప్రిసిషన్ కరెంట్ అండ్ వోల్టేజ్ సోర్సెస్‌ను అందజేసింది. దిమిరా సంస్థ ఫ్లెక్స్ కేబుళ్లు, క్రయోజెనిక్ వైరింగ్‌ను సమకూర్చింది. సిస్టమ్ ఇంటిగ్రేషన్, అసెంబ్లింగ్, టెస్టింగ్ బాధ్యతలను క్యూబిట్ ఫోర్స్ నిర్వహిస్తోంది. క్వాంటమ్ కంప్యూటర్లలో ప్రాసెసర్లు ఎంత కీలకమో, డైల్యూషన్ క్రయోజెనిక్ రిఫ్రిజిరేటర్లూ అంతే కీలకం. క్వాంటమ్ కంప్యూటర్లలో 273 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను నిర్వహించేందుకు డైల్యూషన్ రిఫ్రిజరేటర్లను వినియోగిస్తారు. వీటిలో హీలియం3, హీలియం4 వాయువుల్ని వాడతారు. అమరావతి రిఫరెన్స్ ఫెసిలిటీస్‌లో ఏర్పాటుచేస్తున్న కంప్యూటర్లలో హీలియం4 వాయువుల్ని వినియోగించారు. దానితో ఉష్ణోగ్రతను 269 నుంచి 272 డిగ్రీల వరకు తగ్గించవచ్చు. హీలియం3 వాయువు చాలా అరుదుగా దొరుకుతుంది. మన దేశంలోని రక్షణరంగ పరిశోధన సంస్థల దగ్గరే అందుబాటులో ఉంది. ఇక వాటిలో వినియోగించిన కీలకమైన హార్డ్‌వేర్‌ను ప్రముఖ ప్రభుత్వరంగ రక్షణ, శాస్త్రసాంకేతిక పరిశోధన సంస్థలతో పాటు, ప్రైవేటు సంస్థలు తయారు చేశాయి.

## వైఎస్సార్ మొదలుపెట్టిన పాదయాత్ర - చరిత్రను తిరగ రాసిన ఘట్టం



**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్రకు ఏప్రిల్ 9కు 23 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, వైసీపీ అధినేత జగన్ తన తండ్రి స్మృతులను నెమరువేసుకున్నారు. ఎక్స్ వేదికగా ఆయన భావోద్వేగంతో కూడిన ఒక ట్వీట్ చేశారు. 2003 ఏప్రిల్ 9వ తేదీన ఎర్రటి ఎండలో వైఎస్సార్ మొదలుపెట్టిన పాదయాత్ర కేవలం ఒక ప్రయాణం కాదని, అది రాష్ట్ర రాజకీయ చరిత్రనే తిరగరాసిన అపూర్వ ఘట్టమని జగన్ కొనియాడారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు సాగిన ఆ యాత్ర, జన హృదయాల్లో నేనున్నాననే భరోసాను నింపిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉచిత విద్యుత్ ఫైల్‌పై తొలి సంతకం చేసి, రైతన్నలను రాజులుగా నిలబెట్టిన ఘనత వైఎస్సార్‌దేనని జగన్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యేలా చేయడంతో పాటు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో పేదలకు ప్రాణదాతగా నిలిచారని పేర్కొన్నారు.

## దేశాభివృద్ధికి పరిశ్రమలు ఎంతో అవసరం

**- ప్రతి కార్మికుడు దేశానికి ఒక విలువైన ఆస్తి: మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** దేశాభివృద్ధికి పరిశ్రమలు ఎంతో అవసరమని రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, భీమా శాఖ మంత్రి వాసంసెట్టి శుభాష్ వెల్లడించారు. నాగార్జున అగ్రికం కెమికల్ లిమిటెడ్ (ఎన్ఎసిఎల్)లో 55వ జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి మంత్రితో పాటు ఎచ్చెర్ల నియోజకవర్గం శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లతో కలసి గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ ఏ సి ఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ లో నిర్వహిస్తున్న 55వ జాతీయ భద్రతా దినోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సంస్థలోని యాజమాన్యం, ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది భద్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ పట్ల చూపుతున్న నిబద్ధతకు అభినందనలు తెలిపారు". జాతీయ భద్రతా దినోత్సవం ఒక సాధారణ వేడుక మాత్రమే కాదని, ఇది మనందరికీ భద్రతపై అవగాహన పెంచే ఒక జాతీయ ఉద్యమన్నారు. దేశ అభివృద్ధికి పరిశ్రమలు ఎంతో అవసరం. అయితే, ఆ అభివృద్ధి భద్రత, ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణతో కలిసి ఉండాలన్నారు. ప్రతి కార్మికుడు దేశానికి ఒక విలువైన ఆస్తి అని, వారి భద్రతను కాపాడటం కేవలం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాదు, ఒక నైతిక బాధ్యత కూడా ఉంటుందన్నారు. ప్రతి ఉద్యోగి భద్రతలో భాగస్వామ్యం చేయాలని, వారికి అవగాహన కల్పించాలని, నియమాలను కచ్చితంగా ఉండాలని వివరించారు. ఎన్ ఏ సి ఎల్ ప్రోసెస్, భద్రత, మేనేజ్ మెంట్ సిస్టం అమలు చేస్తూ, స్టడీస్, రిస్క్ అసెస్మెంట్స్, మేనేజ్మెంట్ ఆఫ్ ఛేంజ్ విధానాలను పాటిస్తున్నట్లు తెలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇంటర్లాక్స్, గ్యాస్ డిటెక్టర్లు, ఎమర్జెన్సీ షట్ డౌన్ సిస్టమ్స్ వంటి ఇంజనీరింగ్ నియంత్రణలను సమర్థంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. రెగ్యులర్ ఆడిట్లు, మాక్ డ్రిల్, లీడర్షిప్ ఆధారిత సేఫ్టీ ఇనీషియేటివ్స్ ద్వారా ప్రమాదాలను ముందుగానే నివారించే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీరో లిక్విడ్ డిస్చార్జ్ వంటి విధానాలను అమలు చేయడం అభినందనీయమన్నారు. ఉద్యోగులకు శిక్షణ, ఎమర్జెన్సీ సిద్ధపాటు, వ్యక్తిగత రక్షణ పరికరాలు వినియోగం పై ప్రత్యేక దృష్టి పెట్టడం ప్రసంశనీయమన్నారు. ఇలాంటి సమగ్ర భద్రతా విధానాలు ప్రమాదాలను తగ్గించడమే కాకుండా సంస్థ పనితీరును మెరుగుపరుస్తాయని కొని యాడారు. ఎన్ ఏ సి ఎల్ సంస్థకు సి ఐ ఐ నుండి భద్రతా నాయకత్వం బహుమతి, ఐ సి సి నుండి పర్యావరణ పరిరక్షణ బహుమతి లభించడం గర్వకారణమన్నారు. ఇతర పరిశ్ర మలు కూడా ఇలాంటి ఉత్తమ పద్ధతులను అనుసరించిలన్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, కార్మికులు కలిసి పనిచేసి జీరో హార్మ్ లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. భద్రత కేవలం పరిశ్రమలకే పరిమితం కాదు జీవితంలో కూడా పాటించాలని చెప్పారు. ఈ సందర్భంగా అన్ని సంస్థలు భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని, శిక్షణలో పెట్టుబడులు పెట్టాలని, భద్రతను ఒక విలువగా మార్చాలని కోరారు. ఎన్ ఏ సి ఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ను మరోసారి అభినందించారు.

## ఎర్రచందనం స్మగ్లర్లకు యేడాది జైలుశిక్ష

**తిరుపతి,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన ముగ్గురు ముద్దాయిలకు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి గురువారం తీర్పునిచ్చారు. తిరపతి జిల్లా పోలీసుల గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థతో స్మగ్లర్లకు శిక్ష,జరిమానా విధింపబడుతోందని పోలీసులు తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా ,తీవ్ర అటవీ నేరాలకు పాల్పడితే కఠిన శిక్ష తప్పదని హెచ్చరికలు చేస్తున్నారు.. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పర్యవేక్షణలో అమలవుతున్న "గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థ ద్వారా ఈ కేసును సమర్థవంతంగా నడిపి, నిందితులకు శిక్ష ఖరారు చేయడంలో జిల్లా పోలీసులు విజయవంతమయ్యారన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి 2టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో నమోదున 29/2016 ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో, తిరుపతి జిల్లా ఆర్ఎస్ఎస్ ఎడిజె కోర్టు కీలక తీర్పు వెలువరించింది. రైల్వే కోడూరు మండలంకు చెందిన కదడా హరిబాబు అనే బాలపల్లి బాబు (60.), నాగారం బాబు రెడ్డి (36 ) కొర్లగుంట తిరుపతి, గోడింలా మల్లికార్జున్ (51) నిందితులకు న్యాయమూర్తి ఏ. నరసింహ మూర్తి దోషులుగా నిర్ధారిస్తూ, ఒక్కొక్కరికి ఒక సంవత్సరం కారాగార శిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. ఈ కీలక కేసులో విచారణ, పర్యవేక్షణ, కోర్టు లైజనింగ్ విభాగాల్లో అంకితభావంతో పనిచేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

### లులు కంపెనీకి స్థల కేటాయింపు రద్దు ప్రజాపోరాట విజయం

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్ బాబురావు**

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** లులు కంపెనీకి స్థల కేటాయింపు రద్దు ప్రజాపోరాట విజయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు పేర్కొన్నారు. విజయవాడ పాత ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని లులు మాల్ కొరకు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరిస్తున్నట్లు, నిన్న హైకోర్టులో ప్రభుత్వం తరఫున ఏజీ రాతపూర్వకంగా తెలియజేశారు. లులు కి భూముల కేటాయింపును వ్యతిరేకిస్తూ రైతు నేత శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు హైకోర్టులో పిల్ వేసారు. దీంతో ప్రభుత్వం భూ కేటాయింపును రద్దు చేసినట్లు రాతపూర్వకంగా కోర్టుకు తెలిపింది. ఇది ప్రజా పోరాట విజయం, ప్రభుత్వం చట్ట విరుద్ధంగా, నిబంధనలు ధిక్కరించి బడా కంపెనీలకు ప్రభుత్వ స్థలాలను ధారా దత్తం చేయటం, ఈ అడ్డగోలు కేటాయింపులపైన ప్రభుత్వానికి ఇదొక హెచ్చరిక అని సిహెచ్ బాబురావు పేర్కొన్నారు.

### వేసవిలో పశువుల తాగునీటికి నీటితొట్టెల ఏర్పాటు

**పశుసంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ టి. దామోదర్ నాయుడు**

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక అనుసంధానంతో గ్రామీణ ప్రాంతాలలో నీటి తొట్టెలను నిర్మించి, వేసవిలో పశువులకు తాగునీటి వసతి కల్పించడం జరిగిందని పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి దామోదర్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వేసవి కాలంలో పశువులు, జీవాల నీటి కొరతను అధిగమించడానికి పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

## సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం

**సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ**

**పత్తికొండ,ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** సామ్రాజ్యావాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేపడుదామని సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పిలుపు నిచ్చారు. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో కామ్రేడ్ చదవుల రామయ్య శతజయంతి ఉత్సవాలు సిపిఐ మండల కార్యదర్శి యు.కారుమంచి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా చదవుల రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళీలు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేవానికి ప్రమాదకరంగా ఉన్నాయని, మోడీ 12 ఏళ్ళ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్, ఇజ్రాయిల్ అమెరికా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా చమురు, వాణిజ్య, ఆహార ధరలు విపరీతంగా పెరిగి పోయి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పిచ్చోడిలా పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. భూస్వాముల నుండి వేలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిన ఘనత చదువుల రామయ్యకే దక్కిందన్నారు. సిపిఐ శ్రేణులు కామ్రేడ్ చదువుల రామయ్య స్ఫూర్తితో ఉద్యమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, పి.రామచంద్రయ్య, ఆవుల శేఖర్, బి.గిడ్డయ్య, ఉమ్మడి జిల్లాల నుండి సిపిఐ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిఆర్ఎన్ వలసలో ఉద్రిక్తత

**మాజీ ఎమ్మెల్సీ జగదీష్, ఎమ్మెల్యే విజయచంద్ర మద్దతుదారుల మధ్య వివాదం**

**పార్వతీపురం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండలంలోని పిన్నింటి రామినాయుడువలసలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ జగదీష్ ఎమ్మెల్యే విజయ్ చంద్ర మద్దతుదారుల మధ్య వివాదం చోటు చేసుకుంది. పిఆర్ఎన్ వలస స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్టించి విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యేను పిలవగా ఎమ్మెల్యే తనకు సమయం కేటాయించలేదని దానితో మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్ను పిలవడం జరిగిందని అన్నారు. దానితో స్థానిక ఎమ్మెల్యే మద్దతుదారులు తాము ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని తొలగించడం జరిగిందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ విగ్రహావిష్కరణకు స్థలానికి చేరుకోగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దతుదారులు పిఆర్ఎన్ వలస చేరుకొని జగదీష్‌తో విగ్రహావిష్కరణ చేయించొద్దంటూ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్త నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు వివాదం వద్దకు చేరుకొని ఇరువర్గాలను సముదాయించి కార్యక్రమాన్ని వాయిదా వేయించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్వతీపురం చరిత్రలోనే మునుపెన్నడూ ఇటువంటి రాజకీయం జరగలేదని సొంత పార్టీ వాలే పార్టీ కార్యక్రమాల్ని అడ్డుకోవడం మంచి సంస్కృతి కాదని అన్నారు. ఇది సొంత కార్యక్రమం కాదని పార్టీ కార్యక్రమాన్ని శాసించే అధికారం ఎవరికి లేదని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రైవేట్ లిమిటెడ్ పార్టీ కాదని ఒకరికి సంబంధించిన పార్టీ కాదని అన్నారు. ఈ కార్యక్రమాన్ని వాళ్ళు చేసిన మేము అభ్యంతరం చెప్పే వాళ్ళం కాదని అన్నారు. తాము వివాదానికి రాలేదని కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరం జీవులు, బిజెపి నాయకులు సురగాల ఉమామహేశ్వర రావు జగదీష్ మద్దతుదారులు పాల్గొన్నారు.

## విజయవాడలో 11న రాష్ట్ర స్థాయి జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి ఉత్సవం

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** బడుగుల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతబ్ది జయంతి ఈ నెల 11న ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జ్యోతిరావు పూలే జయంతిని రాష్ట్ర పండుగగా, అధికారికంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పూలే జయంత్యోత్సవం నిర్వహించనున్నామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా విద్య, దళిత, బడుగు వర్గాల హక్కుల కోసం, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కోసం జీవితాన్ని ధారపోశారన్నారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారన్నారు. ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతిని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జ్యోతిరావు పూలే జయంతిని రాష్ట్ర పండుగగా, అధికారికంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి పూలే జయంత్యోత్సవం నిర్వహించనున్నామని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్ కు చెందిన శిల్ప కళాకారులు రూపొందించిన జ్యోతిరావు పూలే విగ్రహ నమూనాలను తన క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత పరిశీలించారు. వాటిని రూపొందించిన కళాకారులను మంత్రి అభినందించారు. ఈ సమావేశంలో పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు నందం అబద్ధయ్య, మల్లె ఈశ్వరరావు, ఎర్రిబోతు రమణరావు, వీరంకి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ బయోమెట్రిక్ నమోదుకు 15 నుంచి ప్రత్యేక శిబిరాలు

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆధార్ బయోమెట్రిక్ నమోదుకు ఈ నెల 15 నుంచి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు స్వర్ణ గ్రామ, వార్డుల (ఎస్‌జిఎస్‌డబ్ల్యు) శాఖ తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల విద్యాశాఖ, సంబంధిత అధికారులకు ఆ శాఖ డైరెక్టర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. తొలి విడతలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకూ, మలి విడతలో ఈ నెల 21 నుంచి 24 వరకు ఈ శిబిరాలను స్వర్ణ గ్రామ, వార్డుల కార్యాలయాల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే మార్చి 2026 వరకు ఆధార్ నమోదు కార్యక్రమాలు పూర్తయ్యాక, రాష్ట్రంలో సుమారు 12.09 లక్షల మంది బయోమెట్రిక్ నమోదు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన శిబిరాల ద్వారా 79 వేల బయోమెట్రిక్ నమోదు పూర్తయ్యిందని తెలిపారు. ముఖ్యంగా 15 నుంచి 17 ఏళ్ల వయసు గల జూనియర్ కాలేజీ విద్యార్థుల బయోమెట్రిక్ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. కొత్త ఆధార్ నమోదు, ఇతర సేవలు ఈ శిబిరాల్లో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. జిల్లాల వారీ పరిశీలిస్తే, కర్నూలు, నంద్యాల, తిరుపతి, విశాఖపట్నం జిల్లాల్లో ఎక్కువ బయోమెట్రిక్ నమోదులు పెండింగ్‌లో ఉన్నట్లు, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 12,09,554 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. శిబిరాల నిర్వహణకు అవసరమైన ఆధార్ కిట్ల మొబిలైజేషన్ కోసం ప్రతి కేంద్రానికి రూ.1,000 చొప్పున నిధులు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపిందన్నారు. అదనపు భద్రత, సహాయక చర్యల కోసం మహిళా పోలీసులను కూడా నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాలు నిర్వహించే సమయంలో డిజిటల్ అసిస్టెంట్లు, డబ్ల్యుఇడిపిఎస్‌లను ఇతర పనులకు పంపొద్దని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం

**- తిరుపతిలో ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ వేడుకలు**



**తిరుపతి,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘాల్లో ఎన్ ఎస్ యు ఐ ఒకటని, విద్యార్థుల సమస్య లపై రాజీలేని పోరాటం చేస్తూ ఇందిరాగాంధీ ఆశయ సాధనకు ముందుకు సాగుతున్నామని విద్యార్థి నాయకులు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తిరుపతిలో గురువారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు శివ బాలాజీ ఆధ్వర్యంలో స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి ,స్వర్గీయ ఇందిరా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు కేకు కట్ చేసి విద్యార్థులకు, నాయకులకు పంచిపెట్టారు. విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ విద్యార్థులకు అండగా నిలబడుతుందన్నారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని 1971లో విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం,ఉన్నత చదువుల కోసం దీనిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎన్ ఎస్ యు ఐ ఆ దిశగా ముందుకు సాగుతోందని, విద్యార్థుల్లో జాతీయ భావాలు పెంపొందిస్తూ సమానత్వం కోసం ప్రజాస్వామ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తుందని చిట్టిబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి , ఏఐసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ కంభంపాటి ,చిత్తూరు శివ శంకర్ ,ఎన్ ఎస్ యు ఐ తిరుపతి నగర కార్యదర్శులు గౌతం, దీపక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జ్యోతీశ్వర్ నాయక్, తిరుపతి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం భారతీయ ఆధ్యాత్మిక వారసత్వం



**తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం దేశంలోనే అత్యున్నత వేద విద్యా కేంద్రంగా వెలుగొందుతోంది. 'వేదాలకు పుట్టినిల్లు తిరుమల" అనే మహోన్నత భావాన్ని సార్థకం చేస్తూ శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించే దివ్య విద్యా కేంద్రంగా నిలుస్తోంది. భారతీయ సంస్కృతికి మూలాధారమైన వేద సంప్రదాయాల పరిరక్షణ, ప్రచారం, ప్రోత్సాహంలో టిటిడి తనదైన శైలిలో అగ్రగామిగా నిలుస్తోంది. వేద విజ్ఞాన పీఠం 1884 ఫిబ్రవరిలో మహంత్ ప్రయాగ్ దాస్ ఆధ్వర్యంలో స్థాపించబడిన ఈ వేదపాఠశాల ప్రారంభంలో మూడు విభాగాలతో మొదలై కాలక్రమేణా వేద, ఆగమ, పౌరోహిత్యం, శాస్త్ర విద్యలను సమగ్రంగా బోధించే విశిష్ట సంస్థగా అభివృద్ధి చెందింది. 1992లో తిరుమల ధర్మగిరిలో శాశ్వతంగా స్థాపించబడిన ఈ సంస్థకు "వేద విజ్ఞానపీఠం"గా పునర్నామకరణం చేశారు. 17 విభాగాల్లో వేద విద్యా బోధన జరుగుతోంది. నాలుగు ప్రధాన విభాగాల కింద మొత్తం 17 ప్రత్యేక విద్యా శాఖలు నిర్వహించబడుతున్నాయి. వేదాధ్యయనంలో 7 వేదశాఖలు, ఆగమాధ్యయనంలో 5 ఆగమాలు, స్మార్త అధ్యయనంలో 4 విభాగాలు, దివ్యప్రబంధంలో ఆళ్వారుల 4000 పాశురాలు బోధించబడుతున్నాయి. ఈ కోర్సులు దీర్ఘకాలికంగా నిర్వహించబడుతూ విద్యార్థులకు లోతైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందిస్తున్నాయి ఈ విద్యాసంస్థలో ప్రస్తుతం మొత్తం 374 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో వేద కోర్సుల్లో 140 మంది, ప్రబంధఆగమ కోర్సుల్లో 177 మంది, స్మార్త కోర్సుల్లో 57 మంది ఉన్నారు. వీరికి బోధన అందించేందుకు 43 మంది పండితులు సేవలందిస్తున్నారు. 540 మంది విద్యార్థులకు వసతి కల్పించే సామర్థం ఉన్న హాస్టల్ సౌకర్యాలు, శుభ్రమైన నివాస వాతావరణం, 24 గంటల నీటి సరఫరా, వేడి నీటి సదుపాయం అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించేందుకు ఉదయం పాలు, ఇడ్లీ, దోసె, ఉప్మా వంటి వంటకాలు, మధ్యాహ్నం అన్నం, పప్పు, కూరలు, సాంబారు, రసం, పెరుగు, సాయంత్రం పాలు, రాత్రి భోజనం అందిస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, నిత్యావసర వస్తువులు (సబ్బులు, నూనెలు, పేస్ట్ మొదలైనవి) అందించబడుతున్నాయి. ఆరోగ్య పరిరక్షణ కోసం అశ్విని ఆసుపత్రి ద్వారా ప్రతిరోజూ వైద్య సేవలు అందించబడుతున్నాయి. అవసరమైతే తిరుపతిలోని స్విమ్స్, బర్డ్ ఆసుపత్రుల్లో కూడా ఉచిత చికిత్స అందిస్తున్నారు.

-7_-7.qxd 4/10/2026 12:33 AM Page 1





# నర్సుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

## - కేజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల ఆందోళన



**విశాఖపట్నం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త**

విధుల్లో ఉన్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కేజీహెచ్‌లో గురువారం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు ఆందోళనకు దిగారు. ఏపీ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో రాజేంద్ర ప్రసాద్ వార్డులో విధుల్లో ఉన్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ పైడిరాజును, కేజీహెచ్ లో మేల్ వార్డ్ బాయ్ గా పని చేస్తున్నఅప్పలస్వామి తన మనుమరాలకి వైద్యం సరిగా చేయడం లేదని గొడవపడి, దాడి చేసి కొట్టారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట గురువారం బైఠాయించి నిరసన తెలిపారు. క్లాస్ 4 ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలాపు శ్రీను, ఎమ్మార్వో అప్పల స్వామి ఆధ్వర్యంలో పదిమంది కలిసి తనను కొట్టారని పైడిరాజు సూపరింటెండెంట్కి ఫిర్యాదు చేశారు. ఇలాగైతే కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ లకు ఉద్యోగ భద్రత ఎక్కడుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో స్పందించి నసూపరింటెండెంట్ ఐ వాణి యూనియన్ నాయకుడు ఏమి జరి గిందో కనుక్కొని, కమిటీ వేసి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు ఆందోళన విరమించి యథావిధిగా వీధిలోకి వెళ్లడంతో పరిస్థితి చక్కబడింది.




# మలుం గుమ్మి జలపాతంలో విషాదం

## - ముగ్గురు గిరిజన విద్యార్థులు జలసమాధి



**అనంతగిరి, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త):**

అనంతగిరి మండలంలోని వాలసి పంచాయితి మలుం గుమ్మి జలపాతం వద్ద గురువారం మధ్యాహ్నం పెను విషాదం చోటుచేసుకుంది. సరదాగా గడుపుదామని వెళ్లిన నలుగురు విద్యార్థినుల్లో ముగ్గురు నీటిలో మునిగి మృతి చెందగా, ఒకరు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. హుకుంపేట మండలం బుర్జ పంచాయతీ జంబువలస గ్రామానికి చెందిన సాలెపు త్రిష 17, సాలెపు రత్నకుమారి 16, సాలెపు పవిత్ర 16, సాలెపు అంజలి 18 నలుగురు విద్యార్థినులు మధ్యాహ్నం 12 గంటల సమయంలో మలుం గుమ్మి జలపాతాన్ని సందర్శించేందుకు వెళ్లారు. నీటిలోకి దిగిన సమయంలో లోతు తెలియకపోవడంతో నలుగురు ప్రమాదవశాత్తు మునిగిపోయారు. స్థానికులు వెంటనే స్పందించి సాలెపు అంజలి ని కాపాడగలిగినప్పటికీ, మిగిలిన ముగ్గురు అప్పటికే మృతి చెందారు. సమాచారం







అందుకున్న ఎస్ ఐ శంకర్ రావు తహసీల్దార్ విరబ్రమచారి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలకు అధికారులు పంచనామా నిర్వహించారు ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువతులు మృతి చెందడంతో జంబువలస గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ఇరాన్ విద్యార్థులకు రూ.1 లక్ష ఆర్థిక సాయమందించిన జిల్లా కలెక్టర్

*- సంజీవని నిధి, కనకమహాలక్ష్మీ దేవస్థానం నుంచి చెరొక రూ.50 వేలు అందజేత*

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



యుద్ధ నేపథ్యంలో ఏర్పడిన క్లిష్ట పరిస్థితులను వివరిస్తూ ఆర్థిక సాయం కోరిన ఇరాన్ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ రూ.1 లక్ష ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా సంజీవని నిధి నుంచి రూ.50 వేలు విలువ గల చెక్కును, కనకమహాలక్ష్మి దేవస్థానం సమకూర్చిన రూ.50 వేలు నగదును కలెక్టర్ తన ఛాంబర్లో గురువారం సాయంత్రం వారికి అందించారు. ఏయూలో ఫార్మసీ కోర్సు చదువుతున్న జినాబ్, సోల్మాజ్ అనే విద్యార్థులు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి వినతి పత్రం ఇచ్చిన క్రమంలో కలెక్టర్ ఈ చర్యలు తీసుకున్నారు.

# పీఎం శ్రీ పాఠశాలలను సందర్శించిన కేంద్ర కార్యదర్శి రాఘవ్ లాంగర్

**విశాఖపట్నం, ప్రభాతవార్త**

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ రాఘవ్ లాంగర్ విశాఖపట్నం జిల్లా లోని పీఎం శ్రీ పాఠశాలలు అయిన కేంద్రీయ విద్యాలయం శ్రీ విజయనగర్ మరియు జవహర్ నవోదయ విద్యాలయం కొమ్మాది పాఠశాలలను సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా, కార్య దర్శి ప్రతి తరగతి గదిని, గ్రంథాలయాన్ని, ప్రయోగశాలలను పరిశీలించి, అక్కడి సౌకర్యాలను, అభ్యసనా వాతావరణాన్ని నిశితంగా సమీక్షించారు. ఆయన వివిధ తరగతుల విద్యార్థులతో ముచ్చటించి, వారి భాగస్వా మ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, అభ్యసన ఫలితాలను అభినందించారు. పి.ఎం. శ్రీ కార్యక్రమం కింద అమలు చేస్తున్న విద్యా, సహ పాఠ్య కార్యకలాపాలు, ముఖ్యంగా వినూత్న బోధనా పద్ధతుల ఏకీకరణ, చక్కగా నిర్వహించ బడుతున్న మౌలిక సదుపాయాలు మరియు విద్యార్థుల భాగస్వామ్యం పట్ల డాక్టర్ రాఘవ్ లాంగర్ ఎంతగానో ముగ్ధులయ్యారు. ఈ పర్యటనలో పాఠశాల విద్యాశాఖ జోన్1 ఆర్.జె.డి శ్రీ బి. విజయభాస్కర్., విశాఖపట్నం డి.ఇ.ఓ శ్రీ.ఎన్.ప్రేమ కుమార్, సమగ్ర శిక్షా ఎ.పి.సి డా. జె.చంద్రశేఖర్, సీమాట్ లెక్చరర్ డా.ఎస్ ప్రసాదరావు మరియు ఇతర అధికారులు ఆయన వెంట ఉన్నారు. వీరు తనిఖీ అంతటా గౌరవనీయ కార్యదర్శిని అనుసరించి, పి.ఎం. శ్రీ కార్యక్రమాల అమలుకు సంబంధించి అవసరమైన సూచనలు అందించారు. ఈ పర్యటన విజయవంతంగా మరియు ప్రోత్సాహకరంగా సాగింది. గౌరవనీయ కార్యదర్శి గారు చేసిన పరిశీలనలు, పిఎం శ్రీ మార్గదర్శకాల అమలును మరింత బలోపేతం చేయడానికి బలమైన ప్రేరణగా నిలుస్తాయి అని తెలియచేశారు.



# ప్రధాన రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత

**- ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసి ప్రాధాన్యత రహదారుల ప్రగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన విశాఖ ఎంపి శ్రీభరత్, వియంఆర్‌డిఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్, కమిషనర్ వి తేజ్ భరత్**




**విశాఖపట్నం, ప్రభాతవార్త**

భోగాపురం ఎయిర్ పోర్టుకు అనుసంధానించే ప్రధాన రహదారుల నిర్మాణ పనులను విశాఖ ఎం పి శ్రీభరత్, వియంఆర్‌డిఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ వి తేజ్ భరత్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గురువారం ఉదయం ముందుగా అడవివరం కూడలి నుంచి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రహదారి నిర్మాణ నాణ్యతను కూడా పరిశీలించారు. అక్కడ నుంచి ద్విచక్ర వాహనాల పై ప్రయాణం చేసి రాకపోకలకు అనువుగా ఉందా లేదా అనేది అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ రహదారి నుంచి జాతీయ రహదారికి చేరుకునే మార్గాలను పరిశీలించారు. తదుపరి వియంఆర్‌డిఎ చైర్మన్ శ్రీ ఎం వి ప్రణవ్ గోపాల్ గారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు సూచనలతో భోగాపురం ఎయిర్ పోర్టు కార్యకలాపాలు ప్రారంభించే నాటికి అనుసంధాన ప్రాధాన్యత రహదారులు నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ 7 ప్రధాన రహదారులను జూన్ మొదటి వారం నాటికి పూర్తి చేస్తామని, తిమ్మాపురం మారికవలస రహదారి ఇప్పటికే పూర్తి చేయటం జరిగిందన్నారు. అడవివరం నుంచి శొంఠ్యాం రహదారి 42 శాతం పనులు పూర్తి అయ్యాయని, అటవీ శాఖ భూములు ఉండటంతో పనులు కాస్త ఆలస్యమవుతున్నాయని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో సాధ్యమైనంత త్వరగా మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు. మిగిలిన రహదారుల పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయన్నారు. నేరేళ్లవలసకొత్తవలస రహదారి పనులు ఇప్పటికే 62 శాతం పూర్తి చేసుకున్నామని, బోయపాలెం కాపులుప్పాడ రహదారి పనులు 66 శాతం, వేపగుంట, పినగాడి రహదారిలో జులీళిదీతి కి చెందిన రహదారి పనులు ఇప్పటికీ 35 శాతం పూర్తి అయ్యాయన్నారు. ఈ రహదార్ల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. విమానాశ్రయానికి వెళ్ళే ప్రయాణికులు రాకపోకలు అనువుగా ఉండేలా ఎట్టి పరిస్థితుల్లో విమానాశ్రయ ప్రారంభంనాటికి రహదారులను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ వి తేజ్ భరత్ ఐఏఎస్ మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో పనులు చాలా వేగవంతంగా జరుగుతున్నాయని, రహదారి నిర్మాణంలో ప్రభావితమైన కట్టడాలకు పరిహారం కూడా చెల్లించడం జరిగిందని అన్నారు. గంభీరం వద్ద మేజర్ బ్రిడ్జి నిర్మాణానికి కొంత సమయం పడుతుందని, మిగిలిన రహదారి పనులను పూర్తి చేస్తామన్నారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ శ్రీ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదనరావు, కార్యనిర్వహక ఇంజనీర్ దుర్గా ప్రసాద్, ఉపకార్యనిర్వహక ఇంజనీర్లు రవిశంకర్, విశ్వనాథ్, రెడ్డి గుత్తేదారు తదితరులు పాల్గొన్నారు.

# చందనోత్సవంలో భక్తుల సహకారం అవసరం!




*- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్*

**విశాఖపట్నం ఏప్రిల్ 9 ప్రభాతవార్త**

చందనోత్సవానికి సింహాచలం దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ భక్తుల సహకారం అవ సరమని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అన్నారు. గురువారం సింహగిరిపై ఏర్పాట్లను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వామివారి నిజరూప దర్శనాకి లక్ష నుండి లక్షా ఏభై వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని ఈనేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో అన్ని పరిశీలించడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. భక్తులు ఎక్కడా ఇబ్బంది పడకుండా పక్కా ప్రణాళికతో క్యూలు ఏర్పాటు చేశారని అవసరమైన చోట వంతెనలు, ర్యాంపులు ఏర్పాటు చేశారని వెల్లడించారు. ఇంకా మిగిలిఉన్న పనులను కూడా త్వరలోనే పూర్తిచేస్తామని చెప్పారు. 11 వ తేదీన చందనోత్సవం నిర్వహణ పై ఉన్నత స్థాయి సమావేశం కలక్టరేట్లో జరగనుందని తెలిపారు. మంత్రులు హాజరవుతున్నారని తెలిపారు. దర్శనం టిక్కెట్లు అమ్మకాలను త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని 17వ తేదీ లోపే అన్ని పూర్తిచేస్తామన్నారు. దేవుడి ఆశీర్వాదం ప్రజల మద్దతుతో ఎటువంటి అవాంఛనీ యసంఘటనలు జరగకుండా ప్రభుత్వం, దేవస్థానం తరపున అధికార యంత్రాంగం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని కలెక్టర్ తెలియజేశారు. అందరూ సంయమనం పాటించిమంచిగా దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులు తీసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# చట్టసభల్లో యువతకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

## - ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విశాఖపట్నం,ప్రభాతవార్త**



దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం పెరగాలంటే, చట్టసభల్లో 40 ఏళ్ల లోపు వారికి కనీసం 33 శాతం సీట్లను రొటేషన్ పద్ధతిలో రిజర్వ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ప్రతిపాదించారు. గోవాలో జరుగుతున్న కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) పశ్చిమ ప్రాంత సదస్సు లో ఖిదేశాభివృద్ధిలో యువ శాసనకర్తల పాత్రఖి అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సగటు భారతీయుడి వయసు 32 ఏళ్లు కాగా, లోక్‌సభ సభ్యుల సగటు వయసు 56, ఏపీ శాసనసభ్యుల సగటు వయసు 53 ఏళ్లుగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సగటు పౌరుడికి, ప్రజాప్రతినిధులకు మధ్య వయసులో 20 ఏళ్ల వ్యత్యాసం ఉండటంపై అందరూ ఆలోచించాలన్నారు. 18వ లోక్‌సభలో 40 ఏళ్ల లోపు యువత కేవలం 11 శాతం మాత్రమే ఉండగా, ఏపీ అసెంబ్లీలో ఇది 7 శాతానికే పరిమితమైందని వివరించారు. చట్టసభల్లో కొందరు శాసనసభ్యుల ప్రవర్తన కారణంగా యువత రాజకీయాలను ఏవగించుకుంటున్నారని, ప్రజాప్రతినిధుల పనితీరు ఆదర్శప్రాయంగా ఉంటేనే రాజకీయాల పట్ల యువతకు గౌరవం కలుగుతుందని స్పీకర్ పేర్కొన్నారు. విద్యార్థి దశలో రాజకీయాలకు దాదాపు తెరపడటం, విశ్వవిద్యాలయాల నుంచి నాయకులు రాకపోవడం దీనికి ఒక కారణమన్నారు. 1982లో ఎన్టీ రామారావు యువతకు అవకాశాలు కల్పించడం వల్లే ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని తాను 25 ఏళ్లకే ఎమ్మెల్యేను కాగలిగానని, అవకాశం కల్పిస్తే యువత తప్పక రాణిస్తుందని ఆయన గుర్తు చేసుకున్నారు. త్వరలో రాబోతున్న మహిళా రిజర్వేషన్ల తరహాలోనే, చట్టసభల్లో యువతకు సైతం రిజర్వేషన్లు కల్పించాలని అయ్యన్నపాత్రుడు సూచించారు. ఈ ఆలోచన విమర్శలకు దారితీసినప్పటికీ, విభిన్నంగా ఆలోచించి యువతను చట్టసభల్లోకి తీసుకువస్తేనే కొత్త ఆలోచనల తో మెరుగైన భవిష్యత్తుకు పునాదులు పడతాయని ఆయన స్పష్టం చేశారు.

# ప్రతీ యేటా చందనోత్సవం టికెట్ల తంతు..

# అయినవారికి ఆకుల్లో..కానివారికి కంచాల్లో..!

(ప్రభాతవార్త, సింహాచలం)

వరాహ నారసింహుడి నిజరూప దర్శనం.. ఏడాదికి ఒక్కరోజు మాత్రమే లభించే అద్భుత భాగ్యం.. శ్రీ మహావిష్ణువు వరాహ వదనంతో మానవ శరీరంతో సింహవాలంతో విలక్షణ మూర్తిగా దర్శనమిచ్చే ఈ అవకాశాన్ని ఎవరైనా వదులుకుంటారా..? ఎట్టి పరిస్థితుల్లోను వదులుకోరు.. ఎన్ని వ్యయ ప్రయాసలకోర్చైనా ఆరోజు స్వామివారి నిజరూపాన్ని చూసి తరించాల్సిందేనంటూ.. మనసులోని ధృడ సంకల్పంతో ప్రయత్నాలు చేస్తారు. స్వామివారి అనుగ్రహం ఉంటే..ఎలాగోలా దర్శనమైపోతుందంటూ విశ్వాసంతో వచ్చే సాధారణ భక్తుల విషయం పక్కన పెడితే..! దేవస్థానం విక్రయించే 1000 రూపాయలు శీఘ్ర దర్శనం, 1500 రూపాయలు ప్రోటోకాల్ దర్శనం టికెట్ల కోసం ప్రయత్నాలు చేసే వారితోనే అధికారయంత్రాంగానికి తలనొప్పులు. ప్రోటోకాల్ టికెట్ల వ్యవహారమైతే ప్రతీ ఏటా సవాలుగానే మారుతోంది. "అయినవారికి ఆకుల్లో.. కానివారికి కంచాల్లో..!" అన్న తీరులో చివరికి టిక్కెట్లతంతు ముగుస్తూ ఉంటుంది. ఈ టిక్కెట్లను పరిమిత సంఖ్యలోనే ముద్రిస్తామని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ రాజకీయంగా వత్తిళ్లు ఎదురవుతుండడంతో అధికార యంత్రాంగం కాస్తా వెసులుబాటు తీసుకోక తప్పడం లేదు. ఈనేపథ్యంలోనే రిక్వెస్ట్ లెటర్స్ విధానాన్ని అందుబాటులో ఉంచి.. స్థాయిని బట్టి టిక్కెట్లు కేటాయించే ప్రక్రియ చేపడుతోంది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ సాంకేతిక లోపాల కారణంగా గత ఏడాది ఈ



వ్యవహారంతో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. టికెట్లు కేటాయించినట్టు దేవస్థానం అందరికీ ఫోన్లలో మెసేజ్ లు పంపినప్పటికీ బ్యాంకులు వద్దకు వెళ్ళేసరికి లిస్టులో పేర్లు లేవని అధికారులు నిరాకరించడం జరిగింది. ఈ తతంగం తీవ్ర గందరగోళానికి దారితీసింది. పైగా ప్రోటోకాల్ టికెట్ల వ్యవహారం ముందురోజు వరకు తేల్చకపోవడంతో ఫోన్లలో మెసేజ్ లు వచ్చినవారు బ్యాంకుల వద్దకు పరుగులు తీయాల్సి వచ్చింది. ప్రత్యేక టికెట్ల వ్యవహారాన్ని నాలుగైదు రోజులు ముందుగానే పూర్తిచేస్తామని ప్రతీ ఏటా ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం సాధ్యం కావడంలేదు. దాతలకు తప్పని తిప్పలు !సింహాచలేశుని కోట్ల రూపాయలు విరాళంగా ఇచ్చిన దాతలకు చందనయాత్ర టిక్కెట్ల కోసం తిప్పలు తప్పడం లేదు. దేవస్థానం సమాచారం మేరకు టిక్కెట్లకు లేఖలు పెట్టుకున్నా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు, పడిగాపులు తప్పడం లేదు. కోట్లు ఖర్చు చేసి బంగారు తాపడాలు చేయించినవారికి కూడా దేవస్థానం నుండి ఆశించిన కనీస మర్యా దదక్కడంలేదని ఆరోజు టిక్కెట్లు కోసం వచ్చే దాతల పరిస్థితి చూస్తే అర్థమవుతుంది. ప్రజా ప్రతినిధుల కార్యాలయాల్లో చందనోత్సవ టిక్కెట్లు ! ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొం తమందికి అందని ద్రాక్షగా మారుతుంటే.. మరికొందరికి అత్యంత సునాయాసంగా అందిపోతున్నాయి. దేవస్థానం పిలుపు మేరకు లేఖలు పెట్టుకొని కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా దక్కని టిక్కెట్లు ఉత్సవం ముందురోజు కొంత మంది ప్రజా ప్రతినిధుల కార్యాలయాల్లో విచ్చలవిడిగా అందుబాటులోకి వస్తున్నాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

## డెలివరీ సిబ్బందికి పోలీసుల అవగాహన కార్యక్రమం

- హెల్మెట్, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచన

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)



పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నముషిడివాడ ప్రాంతంలోని బ్లింకిట్ గోదాం వద్ద పనిచేస్తున్న డెలివరీ సిబ్బంది, కార్మికులకు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెందుర్తి ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో విధి నిర్వహణ సమయంలో పాటించాల్సిన భద్రతా నిబంధనలను వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు కంపెనీ యూనిఫాం ధరించాలని సూచించారు. అలాగే ప్రతి డెలివరీ సిబ్బంది వద్ద చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.యాజమాన్యం తమ వద్ద పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి పూర్తి వివరాలు నమోదు చేసి రికార్డులు నిర్వహించాలని, ఆధార్, చిరునామా వంటి వివరాలను సక్రమంగా భద్రపరచాలని సూచించారు. ప్రతి ఉద్యోగికి పోలీస్ వెరిఫికేషన్ చేయించుకోవాలని కూడా తెలిపారు.పని ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఇన్స్పెక్టర్ తెలిపారు.

## వాటర్ స్పోర్ట్స్‌లో రాష్ట్రస్థాయికి విశాఖ యువ క్రీడాకారులు

అండర్15, అండర్18 విభాగాల్లో ఎంపిక

(విశాఖపట్నం ప్రభాతవార్త):



విశాఖపట్నం నుంచి తొలిసారిగా అండర్15, అండర్18 విభాగాల్లో వాటర్ స్పోర్ట్స్ పోటీలకు యువ క్రీడాకారులు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. కాయకింగ్, కనోయింగ్, డ్రాగన్ బోటు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీలలో విజయవాడలో జరిగే శాప్ లీగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.జిల్లా స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసిన సందర్భంగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీమతి జూన్ అభినందించారు. రాష్ట్రస్థాయిలో మెడల్స్ సాధించి విశాఖపట్నం ప్రతిష్టను మరింత పెంచాలని ఆకాంక్షించారు.కఠిన శిక్షణతో ముందుకు సాగుతున్న ఈ క్రీడాకారులకు తగిన సదుపాయాలు కల్పిస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ శ్రమతో సాధన చేసి జిల్లా స్థాయి పోటీల్లో ఎంపిక కావడం అభినందనీయమని శాప్ కోచ్ వి. దాసారావు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కోచ్‌లు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీమ్ మేనేజర్లు మారుపల్లి నూకరాజు, కె. ఎర్రయ్యతో పాటు ఇతర శాప్ కోచ్‌లు పాల్గొన్నారు.

## టెలిగ్రామ్ ప్రిడిక్షన్ పేరుతో బెట్టింగ్ మోసం

- రూ.12.50 లక్షలు నష్టపోయిన విద్యార్థి ఫిర్యాదు
- క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల ప్రచారకులకు పోలీసుల ఉక్కుపాదం
- ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాపై సైబర్ క్రైమ్ దాడి
- మధురవాడ భగవాన్ దాస్ కాలనీకి చెందిన ఇద్దరు అనలిస్టుల

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)





టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా అక్రమ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ వెబ్‌సైట్లను ప్రమోట్ చేస్తూ ప్రిడిక్షన్ పేరుతో ప్రజలను ఆకర్షిస్తున్న ఇద్దరు అనలిస్టులను విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు జరిగిన దర్యాప్తులో నిందితులను గుర్తించి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం, విశాలాక్షినగర్‌కు చెందిన ఓ విద్యార్థి ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన క్రికెట్ ప్రిడిక్షన్ ప్రకటనను చూసి, అందులో ఇచ్చిన టెలిగ్రామ్ లింక్ ద్వారా ఒక ఛానల్‌లో చేరాడు. అక్కడ "ఏకే క్రికెట్ ప్రిడిక్షన్స్ "ఎస్ ఎస్ క్రికెట్ ప్రిడిక్షన్స్" పేర్లతో క్రికెట్ మ్యాచ్‌లపై ప్రిడిక్షన్లు ఇస్తూ స్టేక్ 888,లోటస్.స్టేక్ 888, డియాం 247 వంటి బెట్టింగ్ వెబ్‌సైట్లను ప్రచారం చేస్తున్నట్లు గుర్తించాడు. ఆ ప్రిడిక్షన్లను నమ్మి బెట్టింగ్‌లో పాల్గొన్న ఫిర్యాదుదారు సుమారు రూ.12.50 లక్షలు నష్టపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహిస్తున్న మధురవాడ భగవాన్ దాస్ కాలనీకి చెందిన వాన సాయి గణేష్, వాన అనిల్‌కుమార్‌లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపరచగా 14 రోజుల న్యాయ నిర్బంధం విధించారు. నిందితుల వద్ద నుంచి బెట్టింగ్ ప్రచారానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియా ద్వారా వచ్చే "ఖచ్చితమైన ప్రిడిక్షన్‌లు", "భారీ లాభాలు" వంటి ప్రకటనలను నమ్మవద్దని పోలీసులు హెచ్చరించారు. అనుమానాస్పద బెట్టింగ్ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరాలపై ఫిర్యాదుల కోసం నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా లేదా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు.

## తొలి జీతం అందుకున్న ట్రాన్స్‌జెండర్ల ఆనందం

- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికు ధన్యవాదాలు

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త):



గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వీపర్ ఉద్యోగాల్లో చేరిన 20 మంది ట్రాన్స్‌జెండర్లు తమ తొలి జీతం అందుకున్న సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.గత ఏడాది డిసెంబర్ 19న పోలీస్ కమిషనర్ ప్రోత్సాహంతో వీరు ఉద్యోగాల్లో చేరారు. ఇటీవల 72 రోజుల జీతం వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో ఆనందం వ్యక్తం చేస్తూ గురువారం మధ్యాహ్నం కమిషనర్ కార్యాలయానికి వెళ్లి పూలమాలతో సత్కరించి, శాలువా కప్పి గౌరవించారు. జీవితంలో తొలిసారి జీతం అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమాజంలో వివక్ష, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా గౌరవప్రదమైన జీవనానికి మార్గం సుగమమవుతుందని చెప్పారు. కొత్తగా సంస్థలు, కంపెనీలు ముందుకు వచ్చి మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పిస్తే సమాజంలో వారి పట్ల ఉన్న వివక్ష తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.భిక్షాటనపై ఆధారపడుతున్న మిగిలిన ట్రాన్స్‌జెండర్లకూ ఇలాంటి అవకాశాలు లభిస్తే వారి జీవితాల్లో మార్పు వస్తుందని ఆయన పేర్కొన్నారు.



## అదృశ్యమైన యువతి ఆచూకీ కనుగొన్న 3 టౌన్ పోలీసులు

- స్నేహితురాలి ఇంట్లో ఉన్న యువతి తల్లిదండ్రులకు అప్పగింత

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త):




విశాఖ నగరంలోని జెఎస్‌ఎం కాలనీ, రామనగర్‌కు చెందిన బంగారు తార (19) ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు 3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్రైమ్ పోలీసులు అదృశ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా మహిళా హెడ్ కానిస్టేబుల్ రత్నం ఆధ్వర్యంలో పోలీసులు యువతి వివరాలను సేకరించి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు అదృశ్యమైన యువతని ట్రేస్ చేశారు..శివాజీపాలెం ప్రాంతంలో తన స్నేహితురాలి ఇంటి వద్ద యువతిని గుర్తించి గురువారం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు యువతి పోలీసులకు తెలిపింది. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## మావిగన్ నుంచి డైవర్షన్ కోసం దిగజారిన అచ్చెన్నాయుడు

- మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త



కూటమి నేతల స్వార్థం కోసం వైయస్సార్ పేరు లాగొద్దు ఆరోజు ఘటనలకు అనే ప్రత్యక్ష సాక్షిని అప్పుడు జగన్ విదేశాల్లో ఉన్నారనేది అబద్ధం అని రాజకీయాల కోసం తాను మీలా దిగజారను అని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. గురువారం బీచ్ రోడ్ లోపల ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చెనాయుడివి మాటలు రాజకీయాల కోసం ఇంతలా దిగజారాలా అని చంద్రబాబు ఈ మాటలు వినాలని తెలిపారు. అచ్చెన్నా యుడు నీచపు వ్యాఖ్యలను తాను ఖండిస్తున్నా అని అన్నారు. అచ్చెన్నాయుడు వెంటనే క్షమాపణలు చెప్పాలి అని డిమాండ్ చేశారు. ఆచరణకు సాధ్యం కాని అమరావతి రాజధానికి ప్రత్యామ్నాయంగా జగన్ సూచించిన మచిలీపట్నం–విజయవాడ–గుంటూరుతో కూడిన "మావిగన్"పై సమాధానం చెప్పలేని టీడీపీ, దిగజారి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని అన్నారు. ఆ దిశలోనే గతి తప్పిన మంత్రి అచ్చెన్నాయుడు మహానేత వైయస్సార్ మరణం, వైయస్ జగన్‌పై కారుకూతలు కూశారని ఆయన ఫైర్ అయ్యారు. ఆరోజు ఘటనలకు తానే ప్రత్యక్షసాక్షి అన్న బొత్స, అప్పుడు జగన్ విదేశాల్లో ఉన్నారనేది పచ్చి అబద్ధమని స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం వైయస్సార్ పేరు లాగొద్దని తేల్చి చెప్పారు. మహానేత వైయస్సార్ మరణించిన రోజున ఏదేదో జరిగిందంటూ అచ్చెన్న దిగజారుడు వ్యాఖ్యలు చేశారని, తానలా దిగజారబోనని, అందుకే అచ్చెన్నాయుడి ప్రతి మాటను ఖండిస్తున్నట్లు బొత్స వెల్లడించారు. మంత్రి అచ్చెన్నాయుడు వెంటనే తన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అరుకు పార్లమెంట్ సభ్యురాలు చెట్టి తనుజ రాణి, శాసనమండలి సభ్యులు కుంభ రవిబాబు, సమన్వయకర్త మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు

## గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

ఆరిలోవ, ఏప్రిల్ 9, ప్రభాతవార్త

హనుమంతవాకలో గంజాయి కలిగి ఉన్న ఆరుగురును ఆరిలోవ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. నగరంలో కొంతమంది బ్యాచ్ గా ఏర్పడి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో శాంతి భద్రతల ఎస్సై వై.కృష్ణ సిబ్బందితో కలిసి నిఘా పెట్టగా ఆరిలోవ పరిసర ప్రాంతాలకు చెందిన ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు.వీరి వద్ద నుండి 6 కేజీల 25 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల్లో షేక్ మస్తాన్, రాఘవ రాజు అలియాస్ టింకు, వీరిద్దరూ రౌడీ షీటర్లు కాగా, వినోద్, బోరా సూర్య ప్రకాష్ అలియాస్ చైనా, తొండల సూర్య, బోధి రాజు అనే ఈ ఆరుగురుని అదుపులోకి తీసుకొని రిమాండ్ కి తరలిస్తున్నట్లు తెలిపారు. మరో వ్యక్తి బండి మనోజ్ కుమార్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

## డ్రోన్ నిఘాతో జూదరుల పట్టివేత

- భూపేష్‌నగర్‌లో జూదంపై పోలీసుల దాడి నలుగురు అరెస్ట్.. ముగ్గురు పరారీవి

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)





విశాఖ నగరంలోని భూపేష్‌నగర్ ప్రాంతంలో జూదం నిర్వహిస్తున్న వారిపై టూ టౌన్ పోలీసులు డ్రోన్ సాయంతో దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో సిఐ ఎర్రం నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్ నేతృత్వంలో ప్రత్యేక బృందం డ్రోన్ నిఘా ఏర్పాటు చేసి జూదం జరుగుతున్న ప్రదేశాన్ని గుర్తించింది. అనంతరం ఆకస్మికంగా దాడి చేయగా నలుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.430 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో మరో ముగ్గురు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.పట్టుబడిన వారిపై ఆంధ్రప్రదేశ్ పోలీస్ గేమింగ్ చట్టం సెక్షన్ 9(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## ఏక్యూజే ఆధ్వర్యంలో ఏయూ శతాబ్ది ఉత్సవాలు

ఆనందపురం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:

మండలంలోని గుడిలోవలో ఉన్న ఏ క్యూ జే కళాశాలలో ఏయూ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 8 న విద్యార్థులకు వ్యాసరచన , ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గురువారం ఆనందపురం జంక్షన్ లో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, శత వసంతాల విద్యా వైభవం నూరేళ్ళ నవ్యో దయం అనే నినాదంతో ర్యాలీ నిర్వహిచారు.

## రెండు గంటల్లో మైనర్ బాలిక ఆచూకీ

- వేగంగా స్పందించిన మహారాణిపేట పోలీసులు
- సీఐ దివాకర్ యాదవ్ చొరవతో బాలిక గుర్తింపు

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త):



విశాఖ నగరంలోని మహారాణిపేట ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలిక అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు గురువారం మహారాణిపేట పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే సీఐ దివాకర్ యాదవ్ పరిస్థితిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని సిబ్బందిని అప్రమత్తం చేశారు.బాలిక ఇంటి పరిసరాలు, వెళ్లే అవకాశమున్న ప్రాంతాలు, స్నేహితుల ఇళ్లు, ప్రధాన రహదారుల వద్ద వెంటనే గాలింపు ప్రారంభించారు. సీసీ కెమెరాల దృశ్యాలు పరిశీలిస్తూ, అందిన సమాచారం ఆధారంగా ప్రత్యేకంగా బృందాలు విడగొట్టి శోధన కొనసాగించారు. ఈ క్రమంలో కేవలం రెండు గంటల్లోనే బాలిక ఆచూకీ గుర్తించి సురక్షితంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.అనంతరం బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. వేగంగా స్పందించి తక్కువ సమయంలోనే బాలికను గుర్తించడం పట్ల స్థానికులు పోలీసుల పనితీరును అభినందించారు. ముఖ్యంగా సీఐ దివాకర్ యాదవ్, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించడం వల్లే ఈ విజయవంతమైన గాలింపు సాధ్యమైందని ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ప్రజా సమస్యలపై వేగంగా స్పందిస్తున్న పోలీసు సిబ్బంది, ఇలాంటి ఘటనల్లో కూడా చురుకుదనం ప్రదర్శిస్తూ ప్రజల్లో విశ్వాసం పెంచుతున్నారని స్థానికులు పేర్కొన్నారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు - పోలీసులకు ఫిర్యాదు

గాజువాక,ఏప్రిల్ 9,ప్రభాతవార్త



మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఓ పత్రిక అధినేత పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైకాపా నేతలు మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే మళ్ళ విజయప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమం చేపట్టాయి."ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే"లో మహిళల గౌరవానికి భంగం కలిగించేలా మాట్లాడిన ఆయన పై తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బద్రీనాథ్, లక్ష్మణరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నడింపల్లి కళాశాలలో సాంకేతిక కేంద్రం ప్రారంభం

ఆనందపురం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:



ఆనందపురం మండలం లోని సొంట్యాంలో వద్ద గల నడింపల్లి సత్యనారాయణ రాజు సాంకేతిక విద్యా సంస్థలో నూతన సాంకేతిక అభ్యాస కేంద్రంతో పాటు కృత్రిమ మేధస్సు అవగాహన కార్యక్రమాలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హర్ష వల్లరి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు వినియోగం ద్వారా భవిష్యత్తులో విద్యార్థులు మరింత ప్రతిభను చాటుకుని పోటీ ప్రపంచంలో ముందంజలో నిలవగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ–విద్యాసంస్థల అనుసంధానంపై పి.ఎన్.ఈ. నవీన్ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానంలో విద్యార్థులు ముందుండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంభు ప్రసాద్ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఇలాంటి అభ్యాస కేంద్రాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రాజా మురుగదాస్ నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. శ్రీకాంత్ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కోర్సులు రూపకల్పన చేయాల్సిన అవసరాన్ని వివరించగా, సురేష్ విద్యార్థుల్లో ప్రాయోగిక నైపుణ్యాల పెంపొందింపుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం సంస్థ కార్యదర్శి ప్రసాద రాజు అధ్యక్ష ప్రసంగం చేశారు. వెంకట్ రెడ్డి, సత్యప్రసాద్, సీతారాం తదితరులు పాల్గొని కళాశాలలో చేపడుతున్న నూతన కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.

## విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలు వాయిదా

- కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఎన్నికల ప్రక్రియ నిలిపివేత

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)

శుక్రవారం జరగాల్సిన విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది ఎ. ప్రభాకర్ రెడ్డి గురువారం రాత్రి ప్రకటించారు. జిల్లా ప్రధాన న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.సీనియర్ న్యాయవాది ఎండి. హబిబుల్లా దాఖలు చేసిన పిటిషన్‌పై జిల్లా ప్రధాన న్యాయస్థానం విచారణ జరిపి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను పరిగణలోకి తీసుకుని ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించి త్వరలో కొత్త షెడ్యూల్ విడుదల చేస్తామని తెలిపారు. ముఖ్యంగా సి.ఓ.పీ. లేని కారణంగా ఓటు హక్కు కోల్పోయిన సుమారు 800 మంది న్యాయవాదుల అంశంపై వచ్చిన అభ్యంతరాలను కూడా పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలు, ఎన్నికలపై వచ్చిన అభ్యంతరాలు, సభ్యుల అర్హతల అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాత ఎన్నికల తేదీలను మళ్లీ ప్రకటిస్తామని వెల్లడించారు. పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.

## ఒక్కరోజులో 2,607 ఈచలానాలు

- ట్రాఫిక్ ఉల్లంఘనలపై విశాఖలో కొనసాగుతున్న ప్రత్యేక తనిఖీలు

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)



నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీ, ట్రాఫిక్ ఉల్లంఘనలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఒక్కరోజులోనే 2,607 ఈచలానాలు విధించారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం బుధవారం నిర్వహించిన తనిఖీల్లో వివిధ రకాల నిబంధనల ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశారు.హెల్మెట్ ధరించకుండా ప్రయాణించిన 1,185 మందిపై కేసులు నమోదు చేయగా, వెనుక కూర్చున్న పిలియన్ రైడర్ హెల్మెట్ ధరించని 209 మందిపై చలానాలు విధించారు. ట్రిబుల్ రైడింగ్ చేసిన 70 మంది, ఇంటర్‌సెప్టర్ వాహనం ద్వారా గుర్తించిన 416 ఓవర్‌స్పీడ్ కేసులు నమోదు చేశారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన 22 మంది, డ్రైవింగ్ లైసెన్స్ లేని 12 మంది, మైనర్లు వాహనాలు నడిపిన 2 కేసులు నమోదయ్యాయి.రాంగ్ పార్కింగ్‌పై 185 కేసులు నమోదు చేయగా, టోయింగ్ ద్వారా 54 వాహనాలపై చర్యలు తీసుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 36 మందిపై కేసులు నమోదు చేశారు. మొత్తం 66 వాహనాలను సీజ్ చేశారు. ఇతర మోటారు వాహనాల చట్ట ఉల్లంఘనల కింద మరో 505 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.ఆర్టీవో శాఖతో కలిసి 21 ప్రైవేటు, ఆర్టీసీ బస్సులను సంయుక్తంగా తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనం నడిపిన 15 మందికి గౌరవ మేజిస్ట్రేట్ రూ.1.50 లక్షల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.నగరంలో బైక్ రేసింగ్, ర్యాష్ డ్రైవింగ్, మార్పులు చేసిన సైలెన్సర్ల వినియోగంపై కూడా ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) ప్రవీణ్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సిలిండర్ కోసం గ్యాస్ బోయ్‌పై దాడి

- తలకు తీవ్రగాయాలతో ప్రైవేటు ఆసుపత్రికి తరలింపుపరవాడ పోలీసులకు ఫిర్యాదు

విశాఖపట్నం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త



సకాలంలో గ్యాస్ సిలిండర్ ఇవ్వలేదని ఓ వ్యక్తి గ్యాస్ డెలివరీ బాయ్ పై దాడి చేశాడు. వివరాల్లోకి వెళ్తే లంకెలపాలెం వద్ద బుధవారం జరిగిన సంఘట నగ్యాస్ డెలివరీ బాయ్స్ పై జరుగుతున్న దాడులతీవ్రతకు అద్దం పడుతుంది. ఈ మేరకు బాధితునికుటుంబ సభ్యులు పరవాడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాధితుని బంధువు పాలిశెట్టి పైడిరాజు కథనం మేరకు.. తన బావ భీమనపల్లి రమణ బాబు (50) లంకెలపాలెం, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ లో గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్ గా పనిచేస్తున్నాడు. ఆయ నఅగనంపూడి ఎస్సీ కాలనీలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం 1 ప్రాంతంలో లంకెలపాలెం ఐఓసీ పెట్రోల్ బంక్ వద్ద ఆటోతో గ్యాస్ సిలిండర్ డెలివరీ నిమిత్తం బయలు దేరి వెళ్తున్నాడు. ఆ సమయంలో స్థానికంగా వుంటున్న నమ్మి నాగేష్ మరియు ఇంకొక వ్యక్తి కలిసి రమణబాబును గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని అడిగారు. అందుకు ఆయన ముందుగా బుక్ చేసుకుంటేనే ఇవ్వగలమని చెప్పగా వారు అతనితో వాగ్వావాదానికి దిగారు. మద్యం మత్తులో ఉండి రమణబాబును ఆటో నుండి బయటకు లాగి ఇనుప రాడ్డుతో తలపై దాడి చేశారు. రమణ బాబు శరీరంపైనా ఇష్టాను సారంగా కొట్టారు. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా, బాధితుడు అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. స్థానికులు గా వున్న తమ బంధువులు గమనించి అగనంపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథ మచికిత్స తరువాత పరిస్తితి తీవ్రత దృష్ట్యా బాధితుడు రమణ బాబును గాజువాకలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, GUNDUBOGULA RAJESH S/O G.SESHAYYA, previously called GUNDUBOINA RAJESH R/O 1-139, SAKHINETIPALLI LANKA, DR. BR AMBEDKAR KONASEEMA, now changed my name from GUNDUBOINA RAJESH to GUNDUBOGULA RAJESH. Henceforth I will be called as GUNDUBOGULA RAJESH for all purposes. (Ro.No.1045)

★ I, REDDI BHAVANI W/O PENTA JAGANNADHAM, previously called PENTA BHAVANI R/O 2-33, PEDDA STREET, R. VENKAMPETA, SEETHANAGARAM, PARVATHI PURAM MANYAM now changed my name from PENTA BHAVANI to REDDI BHAVANI. Henceforth I will be called as REDDI BHAVANI for all purposes. (Ro.No.1061)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## మెగా జాబ్ డ్రైవ్ తో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం

**- పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్**

**విశాఖపట్నం, ఏప్రిల్ 9, (ప్రభాతవార్త)**



పైడా కాలేజ్ ఫర్ ఉమెన్, పైడా డిగ్రీ కాలేజ్ సంస్థల ఆధ్వర్యంలో డేటా ప్రో సహకారంతో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతంగా జరిగిందని పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు పలు ప్రముఖ కంపెనీలు హాజరయ్యాయి. తదితర సంస్థలు విద్యార్థులను ఎంపిక చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఉత్తమ ఉపాధి అవకాశాలు కల్పించడం విద్యాసంస్థల ముఖ్య లక్ష్యమని తెలిపారు. అలాగే ప్రిన్సిపాల్ డా. డి సరోజ్ మాట్లాడుతూ, విద్యార్థులు మంచి ప్రదర్శన కనబరిచి కంపెనీల దృష్టిని ఆకర్షించారని అన్నారు. ప్లేస్‌మెంట్ ఫలితాల విషయానికి వస్తే, వోల్టాస్ సంస్థ 13 మందికి ఆఫర్ లెటర్లు ఇచ్చిందన్నారు. ఫాక్స్కాన్ సంస్థ 4 మందిని ఎంపిక చేసింది. జయభేరి 6 మందికి అవకాశాలు కల్పించింది. కాన్సంట్రిక్స్ సంస్థలో 16 మంది విద్యార్థులు రెండో దశ ఇంటర్వ్యూకు షార్ట్‌లిస్ట్ అయ్యారు. ఇంకా పలువురు విద్యార్థులు తదుపరి రౌండ్‌లకు ఎంపిక కావడం విశేషం. మొత్తం మీద ఈ మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపి,వారి భవిష్యత్తుకు బాటలు వేసిందనీ తెలియజేశారు.

## అమ్మవార్ల సేవలో ఎమ్మెల్యే పల్లా

**గాజువాక,ఏప్రిల్ 9,ప్రభాతవార్త**



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం డొంకాడ, కొత్తపాలెం ఫార్మాసిటీ గ్రామాల్లో పర్యటించారు. అక్కడ వెలసిన దుర్గమాంబ అమ్మవార్ల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాసరావు, స్థానిక నేతలు కర్రి దశేంద్ర, గొల్లవిల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరు మన జెండా మన వార్డు మన జెండా



29 వార్డు మహారాణిపేట మహిళాభ్యున్నతికై మహిళా బిల్లు ప్రధాని మోడీ ధ్యేయం, పివిఎన్ మాధవ్ రాష్ట్ర అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ ఆంధ్ర ప్రదేశ్, భారతీయ జనతా పార్టీ 46 ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మన వార్డు మన జెండా కార్యక్రమంలో భాగంగా బీచ్ రోడ్డు గోకుల్ పార్క్ సుప్రీం హోటల్ దరి బిజెపి జెండా ను పివిఎన్ మాధవ్ ఆవిష్కరి, గగనతలానికి ఎగురువేశారు వారు ప్రసంగిస్తూ సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ క ప్రయాస్ అందరి సహకారంతో దేశ అభివృద్ధికి పాలుపంచుకోవాలని కోరారు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మోడీ ఆకాంక్ష 2016లో హుదూద్ తుఫాను తరువాత పచ్చదనం పెంపుకై 1000 కోట్లు రూపాయలు శాంక్షన్ చేశారని నేటి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మోడీ చలవే అని అన్నారు. అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా గెజిట్ పాస్ చేశారని అన్నారు అన్ని వర్గాల అభ్యున్నతే చేయమని కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వరాలు అని అన్నారు. 2047 వికసిత్ భారత్ ద్వారా అభివృద్ధి లక్ష్యముగా పని చేయాలని అన్నారు, బూతు స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు ప్రతి వార్డులోనూ ప్రతి గ్రామంలోనూ జెండా ఎగురువేయాలని అన్నారు, ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా బిజెపి అధ్యక్షుడు ఎం ఎం ఎన్ రాజు, మహారాణిపేట మండల అధ్యక్షుడు దేవర చంద్రశేఖర్, రాష్ట్ర వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్ ,చొక్కాకుల రాంబాబు, ఓ ఆల్బర్ట్ ,బొత్స సురేష్ , తలాడ గిరిజ, ఎస్. శ్రీలక్ష్మి, పావని ,సుశీల , పూర్ణ మార్కెట్ గోవిందు, రామ్ కుమార్, రమా, రాష్ట్ర నాయకులు ఎం నాగేంద్ర, సుబ్బరామిరెడ్డి, ఎస్ వి ఎస్ ప్రకాష్ రెడ్డి, నరేంద్ర ప్రకాష్, అధిక సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

## మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం..ఆరోపణల నీడ వీడదా?

**- ఏసీబీ తనిఖీల తర్వాతా కొనసాగుతున్న అక్రమాల ప్రచారం**

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**




రియల్ ఎస్టేట్ లావాదేవీలు వేగంగా పెరుగుతున్న మధురవాడ ప్రాంతంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పనితీరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఏసీబీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు అప్పట్లో సంచలనం రేపగా, అనంతరం శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి భారీ మొత్తంలో ముడుపులు చెల్లించి వ్యవహారాన్ని సర్దుబాటు చేసుకున్నారన్న ప్రచారం స్థానికంగా మరింత చర్చకు దారితీసింది. అధికారిక ధృవీకరణ లేని ఈ ప్రచారం నిజానిజాలపై స్పష్టత లేకపోయినా, కార్యాలయంపై ఉన్న అనుమానాలను మాత్రం తగ్గించలేకపోయింది.తనిఖీల అనంతరం కొంతకాలం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కట్టుదిట్టమైన నిబంధనలు అమలైనట్టు కనిపించినప్పటికీ, ప్రస్తుతం మళ్లీ పాత ఆరోపణలే వినిపిస్తున్నాయన్నది స్థానికుల అభిప్రాయం. అధికారిక రుసుములతో పాటు అదనపు చెల్లింపులు లేకుండా పనులు వేగంగా పూర్తికావడం కష్టమని కొందరు చెబుతున్నారు. ముఖ్యంగా మధ్యవర్తుల ద్వారా వచ్చిన పత్రాలు త్వరగా పూర్తవుతుండగా, సాధారణ ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని అసంతృప్తి వ్యక్తమవుతోంది.భూముల మార్కెట్ విలువ నిర్ణయం, పాత డాక్యుమెంట్ల ధృవీకరణ, వివాదాస్పద ఆస్తుల రిజిస్ట్రేషన్, నిషేధిత జాబితాలో ఉన్న భూముల పరిశీలన వంటి అంశాల్లో పారదర్శకతపై ప్రశ్నలు లేవుతున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో ప్రతి రోజు భారీ మొత్తంలో ఆస్తి లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కార్యాలయంలో చిన్న నిర్లక్ష్యమే భవిష్యత్తులో పెద్ద న్యాయ వివాదాలకు దారితీయవచ్చని న్యాయవర్గాలు సూచిస్తున్నాయి.తనిఖీల సమయంలో రికార్డులు, పెండింగ్ ఫైళ్లు, ప్రాసెసింగ్ విధానాలపై ఏసీబీ దృష్టి పెట్టినట్లు తెలిసినా, అనంతరం వ్యవస్థలో శాశ్వత మార్పు కనిపించలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. కొంతకాలం కఠినతరంగా కనిపించిన పద్ధతులు తిరిగి సడలిపోయాయని, మధ్యవర్తుల ప్రభావం తగ్గలేదని ఆరోపణలు వస్తున్నాయి. మధురవాడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏమి జరుగుతోంది? అనే ప్రశ్నలు తలెత్తినప్పుడు.. ఫైళ్ల ప్రాసెసింగ్‌లో ఆలస్యం పై అసంతృప్తి వినిపిస్తోంది. అలాగే మధ్యవర్తుల ద్వారా వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఉందన్న ప్రచారం బలంగా వినిపిస్తుంది.. అంతేకాకుండా మార్కెట్ విలువ నిర్ణయంలో ప్రజలు స్పష్టత కోరుకుంటున్నారు. అలాగే రికార్డు ధృవీకరణలో మరింత డిజిటల్ పర్యవేక్షణ అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి..ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు మళ్లీ ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి, రిజిస్ట్రేషన్ వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా మార్చాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ప్రజల్లో నమ్మకం పెరగాలంటే తనిఖీలు మాత్రమే కాకుండా, ఫిర్యాదులపై వేగవంతమైన చర్యలు కూడా అవసరమని అభిప్రాయపడుతున్నారు.

## కలెక్టర్ ఆదేశాలతో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అనధికార పార్కింగ్‌పై చర్యలు

**విశాఖపట్నం, ఏప్రిల్ 09: ప్రభాతవార్త**



నగరంలోని ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో సిటీ సర్వీస్ (దిది) బస్సులు అనధికారంగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు రవాణా శాఖ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ మేరకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సీహెచ్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అమలు బృందాలను ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. శ్రీనివాస్ యాదవ్, జి. సత్యనారాయణలను ఆ ప్రాంతంలో పర్యవేక్షణకు నియమించారు. ఈ బృందాలు కాంప్లెక్స్ పరిసరాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించడంతో పాటు అనధికార పార్కింగ్ చేస్తున్న దిది బస్సులపై కేసులు నమోదు చేస్తాయి. ట్రాఫిక్‌కు అడ్డంకులు కలిగించే వాహనాలను తొలగించి, డ్రైవర్లు, ఆపరేటర్లలో కేటాయించిన పార్కింగ్ స్థలాలపై అవగాహన కల్పిస్తాయి. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం పలు వాహనాలను తనిఖీ చేసి.. అంధికారిక పార్కింగ్ ప్రాంతాల నుంచి తరలించారు. ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, అధికారులకు సహకరించాలని ఈ సందర్భంగా డిటిసి ఆర్.సి.హెచ్. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

## అంబేద్కర్ ఆశయాలను కాపాడుకుందాం

**- దళిత హక్కుల పోరాట సమితి పిలుపు**

**గాజువాక,ఏప్రిల్ 9,ప్రభాతవార్త**



దేశంలో రాజ్యాంగ పరిరక్షణకు, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని దళిత హక్కుల పోరాట సమితి విశాఖ జిల్లా విభాగం పిలుపునిచ్చింది. డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా పారిశ్రామిక ప్రాంతం అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం విడుదల చేసిన కరపత్రంలో పలు కీలక అంశాలను ప్రస్తావించింది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల రద్దు, ఉపాధి హామీ పథకం నిర్వీర్యం వంటి చర్యలు పేదలు, దళితులకు శాపంగా మారాయని సమితి ఆందోళన వ్యక్తం చేసింది. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం పోరాడాలని, అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టి చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని కోరింది. మహనీయులు బాబూ జగజీవన్ రామ్, జ్యోతిరావు పూలే, అంబేద్కర్‌ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు సమితి నేతలు తెలిపారు. సంఘం ప్రతినిధులు రాంబాబు వై రాజు పాల్గొన్నారు.

## జనగణన పై సిబ్బందికి శిక్షణ

**ఆనందపురం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త**




జనగణన పై ఆనందపురం మండల పరిషత్ సమావేశం మందిరంలో డిఆర్వో విశ్వేశ్వరనాయుడు అధ్యక్షతన స్వర్ణ గ్రామం సిబ్బంది, జనగణన ఎనుమరేటర్లకు, సూపర్వైజర్లగా నియమించబడిన పంచాయతీ అభివృద్ధి అధికారులకు అందించే మూడు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైనది. మొదటి విడతగా 40 మంది సిబ్బందికి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఎస్ . శ్రీనుబాబు, జిల్లా ఇంచార్జి పిల్లా రేవతి , మండల స్వర్ణ గ్రామం అధికారి శ్రీరామ మూర్తి, ఎ ఎస్ వో శ్రీనివాస్, శిక్షకులు గంగాదరుడు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## పిల్లలు సంరక్షణపై అవగాహన

**ఆనందపురం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త**



శిశు పోషణ, పిల్లలు సంరక్షణ పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షబీనా భాను మాట్లాడుతూ 0 2 వయస్సు గల పిల్లలకు మెదడు అభివృద్ధి 80 శాతమే ఉంటుందని చెప్పారు. ప్యాక్ చేసిన జంక్ ఫుడ్ తినడం వలన అనేక వ్యాధులు వస్తాయని పోషకాలు ఉన్న హోమ్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిదని తెలియజేశారు. ఐసీడీస్ సూపర్వైజర్ పి వి వి రత్నం మాట్లాడుతూ పిల్లల అభివృద్ధికి టీ వి, మొబైల్స్ అందుబాటులో లేకుండా చేసి ఆటలు, కథలు వైపు మళ్లించడం ద్వారా వారి నైపుణ్యాలను మెరుగు పరచవచ్చని తెలియజేశారు. హెచ్ వి పార్వతమ్మ మాట్లాడుతూ తక్కువగా ఉప్పు, సుగర్ వాడితే మెరుగైన ఆరోగ్యం ఉంటుందని తెలిపారు. తల్లి, శిశు పోషణ, మెదడు అభివృద్ధికి ప్రారంభ దశ ప్రేరణ, ఆట ఆధారిత విద్య వంటి అంశాల పై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వృద్ధుడి ఆత్మహత్య

**ఆనందపురం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త**



మద్యం సేవించడానికి కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వలేదని మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆనందపురం మండలం బోయిపాలెం ప్రాంతానికి చెందిన పైలా నారాయణస్వామి (60) గత పదేళ్లుగా ఓ ప్రయివేట్ కాలేజీలో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు పైలా రాజేష్ అనిట్స్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, చిన్న కుమారుడు పైలా సురేష్ వేములవలసలో నివసిస్తున్నాడు.భార్య మరణించిన తర్వాత నారాయణస్వామి కొంతకాలంగా ఇద్దరు కుమారుల వద్ద ఉంటున్నాడు. అయితే ఇటీవల ఆయనకు మద్యం సేవించే అలవాటు మరీ ఎక్కువై డబ్బులు కోసం కుటుంబ సభ్యులను వేధించగా అతిగా మద్యం సేవించడం వలన ఆరోగ్యం పాడవుతుందని నచ్చ జెప్పి డబ్బులు ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో మనస్తాపానికి గురైన నారాయణస్వామి గురువారం ఆనందపురం సమీపంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద ఉన్న మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదు చేసి ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రియుడి హత్యకు ప్రియురాలి పథకం.. ముగ్గురు అరెస్ట్

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**



ఆత్మహత్యగా కనిపించిన వ్యక్తి మృతి వెనుక హత్య జరిగిందని పీఎంపాలెం పోలీసులు దర్యాప్తులో తేల్చారు. వివాహేతర సంబంధాల నేపథ్యంలో పక్కా ప్రణాళికతో జరిగిన ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం అప్పుఘర్ ప్రాంతానికి చెందిన క్యాటరింగ్ వంటమాస్టర్ ఉమాశంకరరావు (51)కు మధురవాడ శివశక్తినగర్‌కు చెందిన రాజాన రాజేశ్వరితో దాదాపు 13 ఏళ్లుగా పరిచయం ఉంది. ఇటీవల రాజేశ్వరి తేజ అనే వ్యక్తితో సన్నిహితంగా ఉండటంతో ఉమాశంకరరావుతో విభేదాలు పెరిగాయి. ఈ నెల 1వ తేదీన ఉమాశంకరరావును తన ఇంటికి పిలిపించిన రాజేశ్వరి, తన సోదరుడు వాసు, తేజతో కలిసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.అనంతరం ఘటనను ఆత్మహత్యగా మలచేందుకు ఉరివేసుకున్నట్లుగా చిత్రీకరించి ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. అయితే మృతుడి భార్య అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు మలుపు తిరిగింది.పీఎంపాలెం సీఐ జి. బాలకృష్ణ ఆధ్వర్యంలో సాంకేతిక ఆధారాలతో విచారణ జరపగా నిందితులు నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితులు రాజాన రాజేశ్వరి, వాసు, తేజలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## శ్రీ సాయి బాబా ఆలయంలో ఘనంగా అన్నసమారాధన

**గాజువాక,ఏప్రిల్ 9,ప్రభాతవార్త**



శ్రీ షిరిడి సాయి బాబా ఆలయంలో ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. మల్కాపురం యాదవ వీధిలో నివాసం ఉంటున్న నూనెల భార్గవ సాయి గణేష్ కు ముంబై లోని హెచ్ పి సి ఎల్ లో ఉద్యోగం వచ్చిన సందర్భంగా కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జీవీఎంసీ60వ వార్డ్ గుల్లలపాలెం మహాత్మాగాంధీ వ్యాపారసముదాయం వద్ద నున్న ఈ ఆలయ ప్రాంగణంలో గురువారం జరిగినఈకార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా మాజీకార్పొరేటర్ కలిదిండిబద్రీనాథ్, ఐఎన్టియుసి నాయకులు భోగవిల్లినాగభూషణం పాల్గొని అన్నసమారాధనకార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు నూనెలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి 10 మంది అరెస్ట్.. రూ.50,300 నగదును స్వాధీనం

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**

పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్.ఆర్.పురంలో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో విశాఖ నగర టాస్క్‌ఫోర్స్ జోన్1 పోలీసులు దాడి నిర్వహించి 10 మందిని పట్టుకున్నారు.విశాఖ నగర టాస్క్‌ఫోర్స్ జోన్1 సీఐ భాస్కరరావు నేతృత్వంలో సిటీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఈ దాడి చేపట్టారు. ఈ మేరకు 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.50,300లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను తదుపరి విచారణ నిమిత్తం పెందుర్తి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## 50వ వార్డులో పర్యటించిన జీవీఎంసీ అదనపు కమిషనర్ నల్లనయ్య

**మాధవధార, ఏప్రిల్ 9, ప్రభాతవార్త**




జీవీఎంసీ 50వ వార్డు మాధవధార,తేన్నేటి నగర్,మురళీనగర్‌లో జీవీఎంసీ అదనపు కమిషనర్ నల్లనయ్య గురువారం సుడిగాలి పర్యటన చేశారు. ఏఎంహెచ్ఓ అప్పల నాయుడు,సానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సూపర్‌వైజర్ చిరంజీవి,తో కలిసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రతిరోజూ విధిగా పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని,సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలించాలన్నారు. సింగల్ యూస్ ప్లాస్టిక్ వాడకంపై ఎప్పటికప్పుడు తనిఖీ నిర్వహించాలన్నారు. వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.వేసవి దృశ్యా జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు ఉదయం 5:30 నుండి 10:30 వరకు సాయంత్రం 3 గంటల నుండి 6 గంటల వరకు విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టామని సూచించారు.కార్యక్రమంలో సూపర్ వైజర్ గణేష్,సచివాలయం సెక్రెటరీలు,మలేరియా సిబ్బంది,టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

## గాజువాకలో వైభవంగా సీతారాముల ఆలయ వార్షికోత్సవం

**గాజువాక, ఏప్రిల్ 9,ప్రభాతవార్త**



72వ వార్డ్ పాత కర్ణవానిపాలెంలో శ్రీ సీతారాముల ఆలయ ఐదవ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ కర్ణంరెడ్డి నర్సింగరావు జ్యోతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ధర్మమార్గంలో ఎలా జీవించాలో శ్రీరాముడు ఆచరించి చూపారని, ఆదర్శ దాంపత్యానికి సీతారాములే ప్రతీక అని పేర్కొన్నారు. గ్రామంలో రామాలయం ఉండటం ఆ ప్రాంతానికి క్షేమదాయకమని ఆయన అన్నారు. ఈ వేడుకలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం కూడా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గాజువాక బీజేపీ బి.ఎల్.ఎ1గా కర్ణంరెడ్డి నర్సింగరావు

**గాజువాక,ఏప్రిల్ 9,ప్రభాతవార్త**



నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జ్ కర్ణంరెడ్డి నర్సింగరావు ఆ నియోజకవర్గ బి.ఎల్.ఎ1 (బూత్ లెవల్ ఏజెంట్)గా నియమితులయ్యారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన ఉత్తరాంధ్ర నేతల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. ఏప్రిల్ రెండో వారం నుంచి చేపట్టనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, జాబితా ప్రక్షాళనపై ప్రతి బూత్ స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన నాయకత్వానికి నర్సింగరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు పాల్గొన్నారు.

## తుంగ్లంలో వైభవంగా శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారు పండగ

**గాజువాక, ఏప్రిల్ 9,ప్రభాతవార్త**



జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి పండగ వైభవంగా జరిగింది. గురువారం తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం బళ్ళ వేషాలు, కోయ నృత్యాలు, పులి వేషాలతో అమ్మవారి అణుపు కార్యక్రమం కోలాహలంగా సాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు మాజీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, కొల్లి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ ఏ డి పరిధిలో నేడు పవర్ కట్

**మాధవధార :ఏప్రిల్ 9, ప్రభాతవార్త**

ఏపీఈపిడిసిఎల్ ఆపరేషన్ డివిజన్ జోన్ 2లో ఎన్ఎస్టిఎల్ సెక్షన్ లో మాధవధార,కరసా ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం నాడు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషనల్ డివిజన్ జోన్ 2 ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి కె నాయుడు గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.దీంతో మాధవధార ఉడా కాలనీ, ఆర్ టి ఓ ఆఫీస్, ఈస్ట్ పార్క్, ఓల్డ్ కరసా,న్యూ కరసా, ఎన్ ఏ డి, సాయిబాబా గుడి,రామాలయం గుడి పరిధిలో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. పురుషోత్తపురం కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్ (విశాఖ క్రైమ్ ప్రభాతవార్త) శాంతిభద్రతల పరిరక్షణ, అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపు, చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ లక్ష్యంగా పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పురుషోత్తపురం కాలనీలో గురువారం తెల్లవారుజాము నపెందుర్తి ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ నేతృత్వంలో ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పోలీసు సిబ్బంది కాలనీలో ఇంటింటికీ తనిఖీలు నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించారు. సరైన పత్రాలు లేని ఆరు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక రౌడీ షీటర్ నివాసాన్ని కూడా తనిఖీ చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజల భద్రత కోసం ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు.

## జిప్యాట్ 2026లో గీతం విద్యార్థుల ప్రతిభ




ఎంఫార్మశీ కోర్సులలో ప్రవేశానికి, ప్రతిభ స్కాలర్‌షిప్‌లకు అర్హత సాధించడానికి జాతీయ స్థాయిలో ఈ ఏడాది జరిగిన గ్రాడ్యుయేట్ ఫార్మశీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జిప్యాట్ 26) లో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ విద్యార్థుల సత్తా చాటారు. బిఫార్మశీ ఆఖరి సంవత్సరం విద్యార్థులు ఎమ్.భావన సుదర్శన్, డి. కృష్ణవర్ధన్, అర్జున బతాబ్యాల్ జాతీయ స్థాయి ర్యాంకులను సాధించారని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థుల ప్రతిభ జూనియర్ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిందని అభినందించారు.

## పురుషోత్తపురం కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



శాంతిభద్రతల పరిరక్షణ, అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపు, చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ లక్ష్యంగా పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పురుషోత్తపురం కాలనీలో గురువారం తెల్లవారుజాము నపెందుర్తి ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ నేతృత్వంలో ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పోలీసు సిబ్బంది కాలనీలో ఇంటింటికీ తనిఖీలు నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించారు. సరైన పత్రాలు లేని ఆరు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక రౌడీ షీటర్ నివాసాన్ని కూడా తనిఖీ చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజల భద్రత కోసం ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు.





## గ్రామాభివృద్ధికి దిశానిర్దేశం

### ప్రత్యేక అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

అచ్చుతాపురం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త

ఎలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ అచ్చుతాపురంలో పంచాయతీలకు ఇటీవల నియమితులైన ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై సమగ్ర చర్చ జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో మౌలిక వసతుల పరిస్థితిని సమగ్రంగా అంచనా వేయాలని అధికారులకు సూచించారు. త్రాగునీరు, వీధి లైట్లు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక అవసరాలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉన్నాయా లేదా అనేది ప్రత్యేకంగా పరిశీలించాలని ఆదేశించారు. గ్రామాల్లో అమలు అవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై పూర్తి వివరాలు సిద్ధం చేసుకుని, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. త్వరలోనే నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని స్వయంగా పర్యటిస్తానని ఎమ్మెల్యే తెలియపరిచారు. ఈలోపు గ్రామాల వారీగా సమస్యలు, అవసరాలు గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజల పట్ల చిత్తశుద్ధితో సేవలందిస్తూ, తమ పనితీరుతో మంచి పేరు తెచ్చుకోవాలని ప్రత్యేక అధికారులకు ప్రోత్సాహం ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), నాలుగు మండలాల ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, మున్సిపల్ కమిషనర్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు. ప్రజల సంక్షేమం, గ్రామాభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే తీసుకుంటున్న ఈ చొరవను స్థానికులు అభినందిస్తున్నారు.

## ఉత్తరాంధ్ర చేనేతల సమస్యలపై మంత్రిని కలిసిన ప్రతినిధులు ..తక్షణ చర్యలకు హామీ

అచ్చుతాపురం ఏప్రిల్ 9 ప్రభాతవార్త



అచ్చుతాపురం మండలం దుప్పుతూరు గ్రామానికి చెందిన బి.సి చేనేత రాష్ట్ర (ఏ.ఐ.డబ్ల్యూ.ఎఫ్ ) జెఏసి ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మాడెం పూరి అప్పారావు ఆధ్వర్యంలో చేనేత ప్రతినిధుల బృందం విజయవాడలోని జయభేరి, కొలనుకొండలో గల క్యాంపు కార్యాలయంలో గౌరవనీయులైన బి.సి సంక్షేమశాఖ, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు ఎస్. సవితమ్మను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరంగా మంత్రివర్యులకు తెలియజేశారు. ముఖ్యంగా అనకాపల్లి జిల్లా చేనేత సహకార సంఘాల సమస్యలు, కార్పెట్ తయారీ, ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ల అమలు, అలాగే నేత వస్త్రాల నిల్వలు పెరిగిపోవడం వంటి అంశాలను ప్రతినిధులు వారి దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా పట్టు రాయితీ పాస్ పుస్తకాలను నెలకు రూ.3000 చొప్పున అమలు చేయాలని, చేనేత కార్మికులకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలని, గుర్తింపు కార్డులు లేని చేనేత కార్మికులకు వెంటనే కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బి.సి మహిళల టైలరింగ్ అభివృద్ధి కార్యక్రమాలపై కూడా మంత్రివర్యులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వినతిపత్రం స్వీకరించిన మంత్రివర్యులు వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు ఆదేశాలు జారీ చేశారు. విజయవాడలోని చేనేత డిప్యూటీ కమిషనర్‌కు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించగా, విజయనగరం ఏడి మురళీకృష్ణతో కూడా మాట్లాడి చేనేతల సమస్యలపై నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లాకు చెందిన ఆంధ్రప్రదేశ్ బి.సి సంక్షేమ సంఘం చేనేత రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు వీర భాస్కర్, అనకాపల్లి జిల్లాకు చెందిన మాడెం సూరి అప్పారావు, నేత విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మంత్రివర్యుల సానుకూల స్పందనతో చేనేత కార్మికుల్లో ఆశలు నెలకొన్నాయి.

## “భక్తి పారవశ్యంలో తేలిన గురుజాపాలెం...

### వైభవంగా శ్రీ దుర్గాలమ్మ తల్లి మహోత్సవం

అచ్చుతాపురం ఏప్రిల్ 9 ప్రభాతవార్త



అచ్చుతాపురం మండలం (ఎస్ఇజడ్) కాలనీ గురుజాపాలెం గ్రామంలో వెలసిన గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ దుర్గాలమ్మ తల్లి పండుగ మహోత్సవం అపార భక్తి శ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించబడింది. నవరాత్రుల సందర్భంగా అమ్మవారి ఆలయం భక్తజనాలతో కళకళలాడింది. ఉదయం 5:30 గంటల నుండి అమ్మవారి ఆలయం వద్ద గంటల నాదం, మంత్రోచ్చారణల మధ్య భక్తులు కుంకుమ పూజలు నిర్వహించి, తమ మొక్కులను అమ్మవారి చరణాల్లో సమర్పించారు. చీర సారెలతో అలంకరించిన మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం విశేషంగా నిలిచింది. గ్రామం మొత్తం ఓ ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయి, “అమ్మ తల్లి కటాక్షమే అన్నిటికీ ఆధారం” అనే భావంతో ప్రతి ఒక్కరూ భక్తి పారవశ్యంలో లీనమయ్యారు. ఈ సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పండుగ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేసి, తాగునీరు, ప్రసాదాలు, దర్శన ఏర్పాట్లను సమర్థంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లాలం రాజు, ఎంపీటీసీ నీరుకొండ నర్సింగరావు, వైస్ సర్పంచ్ రాజాన విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ రాజాన భాను ప్రకాష్, అడిగర్ల దేముడు, కాళ్ళ రాజుబాబు, యాంద్ర అప్పలనాయుడు, లాలం సురేష్, లాలం మురళీ, రాజాన రవికుమార్, పంచదార్ల శేఖర్, లాలం సూర్యనారాయణ, లాలం శేఖర్, పోలవరపు దుర్గారావు, రేఖా నాగేశ్వరరావు, లాలం సంజీవ్, పంచదార్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి కృపతో గ్రామంలో సుఖశాంతులు నెలకొని, ప్రతి ఇంటా ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆనందం వెల్లివిరియాలని భక్తులు హృదయపూర్వకంగా ప్రార్థించారు.

## కూటమి నాయకుల అసత్య ప్రసారాలను తిప్పుకొట్టాలి

### నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మలసాల భరత్ కుమార్

కశింకోట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త



కార్పొరేటర్ల,సర్పంచ్ల పదవీకాలం ముగిసిన సందర్భంగా వారికి సత్కార కార్యక్రమం వైసిపి అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కర్త మలసాల భరత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం ఎస్.ఆర్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డెడ ప్రసాద్,మాజీ ఎంపీ డాక్టర్ బిసెట్టి సత్యవతి,అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకరాలు శోభ హైమావతి, మలసాల భరత్ కుమార్,రాష్ట్ర కమిటీ నాయకులు దిలీప్ కుమార్ విచ్చేశారు. అతిథులు, పలువురు సర్పంచ్‌లు కార్పొరేటర్లు మాట్లాడిన అనంతరం, భరత్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ ఓడిన విజయం మనదే అన్నట్టుగా మన కార్యక్రమాలు అధినాయకుడు జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో ఘనంగా జరుగు తున్నాయన్నారు. కార్పొరేటర్లు సునీత,లక్ష్మి ప్రసన్న ఏవిధమైన కూటమి ప్రభుత్వం ప్రలోభాలకు లొంగకుండా నిలబడడం గొప్ప విషయం అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న లడ్డు అసత్య ప్రచారాలు,ఛైర్మెన్ నీచమైన పనులు పైన మనం పోరాడం,రాబోయే 3సంవత్సరాలు ఇదే బాధ్యత తో ముందడుగు వేయాలన్నారు. అనంతరం కార్పొరేటర్లకు, సర్పంచులకు సత్కార కార్యక్రమం నిర్వహించి జ్ఞాపికలు అందజేశారు. వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు మలసాల కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, అనకాపల్లి గొర్లి సూరిబాబు, మందపాటి సునీత,జానకి రామరాజు,జాజుల లక్ష్మీ ప్రసన్న రమేష్, పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, నమ్మి మీనగణేష్, నీటిపల్లి లక్ష్మి,దివాకర్, బొడ్డెడ శివ,విల్లూరు చంద్ర శేఖర్, నీలకంఠ లక్ష్మీ, శోభ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోషణ్ పక్వాడా అవగాహన పక్షోత్సవాలు విజయవంతం చేయాలి

### గోడ పత్రిక ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



అనకాపల్లి ఏప్రిల్ 9, ప్రభాతవార్త

ప్రతి ఒక్కరూ 8వ పోషణ్ పక్వాడా” అవగాహన పక్షోత్సవాల కార్యక్రమంలో భాగస్వాములై, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో 8వ పోషణ్ పక్వాడా అవగాహన పక్షోత్సవాల గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ఐ.సి.డీ.ఎస్. పీడీ ఎన్. సూర్య లక్ష్మీ ,డి ఎం. హెచ్ ఓ డాక్టర్ హైమావతి, ఐ.సీ.డి.ఎస్.సిబ్బంది, తదితర అధి పాల్గొన్నారు. ఈ నెల 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించునున్నట్లు తెలిపారు. మొదటి ఆరు ఏళ్లలో మెదడు అభివృద్ధిని పెంపొందించడం అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

## 26న అయ్యప్ప స్వామి ఆలయం ప్రారంభం

ఎస్ రాయవరం ఏప్రిల్ 9 ప్రభాతవార్త



మండల కేంద్రమైన ఎస్ రాయవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి ఆలయం ను ఈ నెల 26వ తేదీ ప్రారంభోత్స ఆహ్వాన పత్రికను మాజీ ఎంపీ బీశెట్టి వెంకటసత్యవతి, భర్త డాక్టర్ విష్ణుమూర్తి మాడుగుల నియోజక వర్గ శాసనసభ్యులు బండారు సత్యనారాయణ ,తాతయ్యబాబు చైర్మన్ ఆంధ్రపదేశ్ రాష్ట్ర హౌసింగ్ బోర్డు మరియు అధ్యక్షుడు, టి.డి.పి అనకాపల్లి జిల్లా మరియు కోట్ని బాలాజీ డి.సి.ఎం.ఎస్ చైర్మన్‌కు కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు సోమిరెడ్డి రాజు, కొణతాల శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు (వాసు ), బత్తుల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## దళిత రైతుల పోరాటానికి సిపిఎం మద్దతు.. వినూత్న నిరసన



( రాంబిల్లి ఏప్రిల్ 09 ప్రభాతవార్త)

రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలో దళిత రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమం 65వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలకు చెందిన సిపిఎం నాయకులు రైతుల పోరాటానికి మద్దతు తెలిపారు. నోట్లో ఆకులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలుపుతూ ప్రభుత్వం దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జి. దేవుడు నాయుడు, కె. సోము నాయుడు, సిహెచ్. శివాజీ మాట్లాడుతూ పేద రైతులపై ముఖ్యంగా దళిత రైతులపై జరుగుతున్న అన్యాయాలను తీవ్రంగా ఖండించారు. దాదాపు 50 ఏళ్ల క్రితం ప్రభుత్వం కేటాయించిన డి–పట్టా భూములను రైతుల అనుమతి లేకుండా నష్టపరిహారం చెల్లించకుండా స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. పంచదార్ల పంచాయతీలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నప్పటికీ, వాటిని వినియోగించకుండా, సంవత్సరాలుగా హక్కులు పొందుతూ జీవనోపాధి సాగిస్తున్న దళిత రైతుల భూములను తీసుకోవడం అన్యాయమని విమర్శించారు, రైతు భరోసా, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం, బ్యాంకు రుణాలతో తమ కుటుంబాలను పోషించుకుంటున్న రైతుల జీవనాధారాన్ని దెబ్బతీయడం అభివృద్ధి కాదని స్పష్టం చేశారు, పేదల భూములను లాక్కొని ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం అభివృద్ధి పేరుతో జరుగుతున్న అన్యాయం అని సిపిఎం నాయకులు మండిపడ్డారు. భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించినప్పటికీ, దళిత రైతులకు గౌరవంగా జీవించే హక్కు లేకపోవడం బాధాకరమని అన్నారు, రైతులకు న్యాయం జరిగేంతవరకు దళిత రైతుల పక్షాన సిపిఎం పార్టీ నిరంతరం పోరాడుతుందని వారు హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో రైతులు గుడబండి అప్పారావు, గూటాల నాగ అప్పారావు, గారపాటి అబద్ధం, కనకరత్నం, ఏ.చిరంజీవి, గూటాల రాజు, జి.రవి, ఏ.అర్జున్ రావు, ఏ.నూకాలు, టి.నాగమణి, నూకాలమ్మ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై తగిన చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి ఏప్రిల్ 9, ప్రభాతవార్త



బాల్య వివాహాల ప్రమాధికార ఫలితాలు పై ప్రజల్లో అవగాహన కల్పించాలని మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిని ఎన్ సూర్యలక్ష్మి పిలుపునిచ్చారు. పిడి –డిఆర్‌డిఎ వారు నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో వైఎంవిఎ సమావేశహాల్లో గురువారం అనకాపల్లి మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిని ఎన్ సూర్యలక్ష్మి మాట్లాడుతూ టీనేజీ ప్రెగ్నెన్సీ వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యం పోషణ విద్య ప్రాముఖ్యత అలాగే టీనేజీ ప్రెగ్నెన్సీలు, బాల్యవివాహాల ప్రమాదకర ఫలితాలు వంటి అంశాలు విస్తృతంగా చర్చించారు. పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు విద్యా సమాజంలో బాల్యవివాహాల ప్రభావం వంటి విషయాలను వివరించారు. సమాజంలో సుస్థిరమైన మార్పులను తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సిడిపిఓ రమణకుమారి, ఏసిడిపిఓ శశికళ, డీసీపీవో రమేష్, వన్ స్టాప్ సెంటర్ కేంద్ర నిర్వాహకురాలు మంజులావాని పిఓఎన్ఐసి మనోహర్, పారా లీగల్ సునీత ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## భీమవరం చెక్ పోస్ట్ వద్ద విస్తృత తనిఖీలు



గొలుగొండ ఏప్రిల్ 9, ప్రభాతవార్త

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై భీమవరం చెక్ పోస్ట్ వద్ద నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో విసురుతు తనిఖీలు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల నుండి మైదాన ప్రాంతాలకు, మైదాన ప్రాంతాల నుండి ఏజెన్సీ కి తరలి వెళ్తున్న వాహనాలను తనిఖీలు చేపట్టారు. గంజాయి సారా తో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిరోధించేందుకే డ్రోన్ ద్వారా పరిసర ప్రాంతాలను పరిశీలిస్తూ వాహనాలను తనిఖీలు చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని అటువంటి వారు ఎవరైనా ఉంటే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. యువత చెడు వ్యసనాలు బారినపడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నాయని సిఐ అన్నారు. ఈ తనిఖీల్లో గొలుగొండ, కృష్ణదేవిపేట ఎస్ ఐ లు రామారావు, రిషికేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర

ఎస్.రాయవరం ఏప్రిల్ 9, ప్రభాతవార్త



మండలంలో కర్రివానిపాలెం గ్రామంలో వేంచేసి యున్న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి భారీ సంఖ్యలో భక్తులు ఆలయనకు చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మ వారికి మ్రొక్కులు,ముడుపులు చెల్లించుకున్నారు. పురవీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం భజన బృందాలతో భక్తి గీతాలు ఆలపించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు భారీ విద్యుత్ అలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. క్యూ లైన్‌ల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా నూకాంబిక నెల పండుగ చాటింపు

అనకాపల్లి ఏప్రిల్ 9, ప్రభాతవార్త

ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి నెల పండగ చాటింపు గురువారం రాత్రి నూకాంబిక అమ్మవారి దేవస్థానం లో మాజీ మంత్రి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో నెల పండగ చాటింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా అమ్మవారి సన్నిధిలో ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 16,17 తేదీల్లో జరగబోవు నెల పండగ జాతర, నెల పండుగ శుక్రవారం అమావాస్య సందర్భంగా పండగ చాటింపు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేష్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.






## సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంపై అవగాహన సదస్సు

ఎస్.రాయవరం ఏప్రిల్ 9 ప్రభాతవార్త



మండలంలోని సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమం పై వైద్య సిబ్బందికి గర్భవతులకు బాలింతలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పుట్టిన బిడ్డ నుంచి ఆరు సంవత్సరాల వయసు వరకు మెదడు అభివృద్ధి చెందుతుందని తల్లిదండ్రులు కుటుంబ సభ్యులకు సమాజం కూడా తగిన శ్రద్ధ తీసుకోవాలని దీనిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు .ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వాసంతి ,ఐసిడిఎస్ సూపర్వైజర్ కనకదుర్గ ,పిహెచ్ఎన్ సబి , ఎఎన్ఎం లు,ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రాజం జంక్షన్‌లో సీసీ కెమెరాలు

### భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

బుచ్చయ్యపేట ఏప్రిల్ 9 ప్రభాతవార్త



రాజాం జంక్షన్ లో ట్రాఫిక్ సమస్యలు, అలాగే చోరీలు వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకొని రాజం జంక్షన్‌లో ఆధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ చర్యతో ప్రాంతంలో భద్రత మరింత మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బుచ్చయ్యపేట ఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ, “సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణలో కీలకమైన మార్పులు వస్తాయి. ట్రాఫిక్ నియంత్రణకు కూడా ఇవి ఎంతో ఉపయోగపడతాయి” అని తెలిపారు. జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ముఖ్యమైన ప్రదేశాలను కవర్ చేసేలా కెమెరాలను అమర్చడం జరిగిందని, వీటి ద్వారా 24 గంటల పర్యవేక్షణ కొనసాగించబడుతుందని, అనుమానాస్పద కార్యకలాపాలు వెంటనే గుర్తించే వీలుంటుందని, స్థానిక వ్యాపారులు, ప్రజలు ఈ చర్యను స్వాగతిస్తూ, “ఇప్పటికైనా మా ప్రాంతంలో భద్రత పెరుగుతుంది” అని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో జరిగే చిన్నచిన్న దొంగతనాలు తగ్గుతాయని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసరావు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

### ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



అనకాపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త

రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారిం చుటకు గుర్తించిన ప్రదేశాలలో అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి జిల్లా రహదారి భద్రతా సమన్వయ కమిటీ సమావేశశీ జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన విషయాలపై తీసుకున్న చర్యలు, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్, జంక్షన్లు దగ్గర లైటింగు ఏర్పాటు చెయ్యాలని, స్పీడ్ బ్రేకర్లు దగ్గర రేడియం కలర్ పెయింటింగ్ వెయ్యాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు రాష్ట్ర, జాతీయ రహదారులలో జరిగిన రోడ్డు ప్రమాధాలు, ప్రమాదం వలన చనిపోయిన వారి సమగ్ర వివరాలను తెలుసుకొని కారణాలను విశ్లేషించారు. రోడ్డు ప్రమాదాలు ఏ కారణం వలన జరుగుతున్నాయో ప్రమాద స్థలానికి వెళ్లి పరిలించాలన్నారు. ప్రమాదాల వలన చనిపోయిన వారికి పరిహారం త్వరతగతిన అందేవిదంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రజలు స్పందించి క్షతగాత్రులను తక్షణమే దగ్గరలోని ఆసుపత్రిలో చేర్పించి క్షతగాత్రుల వివరాలు రవాణా శాఖ అధికారులకు ఇవ్వాలని జిల్లా వైద్య శాఖ అధికారికి ఆదేశించారు. కూడళ్లలోను, తరచు ప్రమదాలు జరిగే ప్రదేశాల వద్ద సి.సి. టి వి కెమెరాలను ఏర్పాటు చెయ్యాలని తెలిపారు. బస్ స్టాప్ లు వద్ద సి సి టి వి కెమెరాలు ఏర్పాటు చెయ్యాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ప్రవీణా ని ఆదేశించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, ప్రమాదకర రహదారులు, మలుపులు, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద సరిపడా లైట్లు ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి అధికారులకు ఆదేశించారు. జిల్లాలో రహదారి ప్రమాదాలను పూర్తిగా నివారించాలని, ఇందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం రావాలని, ఇందుకు అవసరమైన ర్యాలీలను, ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి జి.మనోహర్ మాట్లాడుతూ ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని కృషి చేస్తామన్నారు. ఇప్పటికే హెల్మెట్ ధారణ చేయనివారిని, స్పీడ్ గా వాహనాలు నడిపే వారిని, రాంగ్ రూట్ లలో నడిపే వారిని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిని గుర్తించి అపరాధ రుసుమును విధించడం జరుగుతుందని తెలిపారు. రహదారి భద్రతపై ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందని, లారీ, ఆటో డ్రైవర్లు, ఆర్టిసి డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ యంత్రాంగం తో సమన్వయం చేసుకుంటూ అవగాహనా కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా రవాణా, ప్రజా రవాణా అధికారి, ప్రవీణా, నర్సీపట్నం ఆర్.డి.ఒ. వివి రమణ, డిఎంహెచ్ఓ డాక్టర్ హైమావతి, రోడ్లు భవనాలశాఖ ఇఇ ఎన్.సాంబశివరావు, డిఇఇ విద్యాసాగరరావు, డి.ఎస్పీ.లు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, పోలీసు ఇన్స్పెక్టర్లు, ఎన్ హెచ్ ఎ ఐ, మైనింగు, పరిశ్రమలు, డిఆర్డిఎ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వడ్డాది కొత్తూరులో చెత్త దహనం.. పొగతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

### శ్వాసకోశ సమస్యలతో గ్రామస్తులు ఇబ్బంది - అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

బుచ్చయ్యపేట ఏప్రిల్ 9 ప్రభాతవార్త



వడ్డాది కొత్తూరు గ్రామంలో చెత్తను బహి రంగంగా కాల్చడం వల్ల ఏర్పడుతున్న దట్టమైన పొగ ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారింది. గ్రామ పరిసరాల్లో రోజూ చెత్తకు అగ్గిపెట్టడం వల్ల గాలిలో కాలుష్యం పెరిగి, స్థానికులు ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా వృద్ధులు, చిన్నపిల్లలు శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ పొగ వల్ల ఇళ్లలో ఉండలేకపోతున్నాం. పిల్లలు కూడా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపాలి” అని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సమస్యపై వెంటనే స్పందించి చెత్త దహనాన్ని నిలిపివేసి, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## ఎస్ఎస్సి స్పాట్ వేల్యుయేషన్ క్యాంప్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ టి.నిశాంతి



పాడేరు,ఏప్రిల్9,ప్రభాతవార్త

అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరు జిల్లా కేంద్రం పాడేరు స్కూల్ తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఎస్సి స్పాట్ వేల్యుయేషన్ క్యాంప్‌ను అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వేల్యుయేషన్ జరుగుతున్న తీరును జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావును కలెక్టర్ అడిగితెలుసుకున్నారు. వేల్యుయేషన్ విధులు నిర్వర్తిస్తున్న టీచర్లకు కల్పించిన వసతులను పరిశీలించి కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేసారజిల్లా విద్యాశాఖాధికారి కె.రామకృష్ణారావు తోపాటు. స్పాట్ వేల్యుయేషన్ పూర్తి వివరాలు కలెక్టర్‌కు తెలిపారు. ఎస్ ఎస్ సి స్పాట్ వేల్యుయేషన్ ప్రారంభించి నాలవ రోజు ప్రశాంతంగా పూర్తి చేసినట్టు డిఈఓ పేర్కొన్నారు. అల్లూరి జిల్లా కు సంబంధించి 1,07,581 జవాబు పత్రాలు కేటాయించగా ఇప్పటి వరకు మూల్యాంకనం 36,892 స్పాట్ వేల్యుయేషన్ జరిగాయని మొత్తం 34శాతం స్పాట్ వేల్యుయేషన్ జరిగిందని కలెక్టర్ నిశాంతి డీఈఓ రామకృష్ణారావు వివరించారు. ఎక్కడా ఎటువంటి తప్పులు జరగకుండా ఉపాధ్యాయులు వ్యవహరించాలని కలెక్టర్ నిశాంతి సూచించారు.

## పోషణ పక్షోత్సవానికి శ్రీకారం - గోడపత్రికల ఆవిష్కరణ

పాడేరు,ఏప్రిల్9,ప్రభాతవార్త:



మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ 8వ పోషణ పక్షోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ నిశాంతి అధికారికంగా గోడపత్రికను ఆవిష్కరించారు. 2026 సంవత్సరానికి "జీవితంలోని మొదటి ఆరు సంవత్సరాలలో మెదడు అభివృద్ధిని గరిష్ఠ స్థాయికి చేర్చడం" అనే ప్రధాన ఇతివృత్తంతో ఏప్రిల్ 9 నుండి 23వ తేదీ వరకు పోషణ పక్షోత్సవం నిర్వహించనున్నారు తల్లి-శిశు పోషణ, 0-3 సంవత్సరాల పిల్లలలో మెదడు అభివృద్ధికి ప్రారంభ ఉద్దీపన, 3-6 సంవత్సరాల పిల్లలకు ఆటల ఆధారిత విద్య, స్క్రీన్ సమయ నియంత్రణలో తల్లిదండ్రుల పాత్ర, మరియు అంగన్వాడీల బలోపేతం వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా కుటుంబాలు మరియు సమాజంలో పోషణపై అవగాహన పెంపొందించడంతో పాటు, "జన ఆందోళన్" భావనతో సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రత్యేకంగా ఈ సంవత్సరం సంరక్షణ మరియు పోషణలో పురుషుల భాగస్వామ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ, ప్రతి కుటుంబం చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదల కోసం పోషకాహారం, సరైన సంరక్షణ, ప్రేమతో కూడిన వాతావరణాన్ని కల్పించాలని ఆమె పిలుపు నిచ్చారు. పోషణ పక్షోత్సవం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికాణి సి.హెచ్ ఝాన్సీ బాయి తో పాటు జిల్లా ఆరోగ్య శాఖ వైద్యాధికారి డాక్టర్ డి. కృష్ణ మూర్తి నాయక్, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ టి. ప్రతాప్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ గ్రీష్మ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయిన ఐదుగురు మావోయిస్టులు



పాడేరు,ఏప్రిల్9,ప్రభాతవార్త:

సుకుమా జిల్లా పీఎల్ జిఏ బెటాలియన్‌కి చెందిన ఐదుగురు మావోయిస్టు క్యాడర్లు గురువారం పాడేరు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ సమక్షంలో స్వచ్ఛందంగా లొంగిపోయారు. లొంగిపోయిన వీరంతా జనజీవన స్రవంతిలోకి తిరిగి చేరారు.ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాడేరు డీఎస్పీ అభిషేక్ తో కలిసి లొంగిపోయిన ఐదుగురు మావోయిస్ట్ క్యాడర్ల వివరాలను జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తెలియజేశారు. మావోయిస్టే పార్టీ సుకుమా జిల్లా డివిజినల్ ఏరియా కమిటీ మెంబర్ కొవ్వాసి భుదర అలియాస్ జిత్రు,అలియాస్ కిరణ్ 8లక్షలు రికార్డు, మావోయిస్ట్ పార్టీ ప్లటూన్ పార్టీ కమిటీ మెంబర్ విధులు నిర్వహించిన ముచ్చ కి కొస అలియాస్ గగస్ ఐదు లక్షలు రివార్డు మావోయిస్ట్ పార్టీ ప్లటూన్ పార్టీ కమిటీ మెంబర్ విధులు నిర్వహిస్తున్న మడివి సంబట్టి అలియాస్ నాగమణి ఐదు లక్షలు రివార్డు మావోయిస్ట్ పార్టీ ప్లటూన్ పార్టీ కమిటీ మెంబర్, మడివి సుకంతి అలియాస్ రోని,ఐదు లక్షలు రివార్డు మావోయిస్ట్ పార్టీ మెంబర్ మిరగం కొస లక్ష రివార్డులు ఉన్నాయని వీరంతా స్వచ్ఛందంగా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారని ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు.

### మావోయిస్టులు లొంగిపోవడానికి కారణాలు

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసుల ఆపరేషన్లు తీవ్రతరం కావడం, కొత్త పోలీసు శిబిరాల ఏర్పాటు వల్ల వారి కదలికలు పరిమితం కావడం అలాగే ప్రాణభయ పరిస్థితులు ఏర్పడ టం,మావోయిస్టుల పట్ల ప్రజల మద్దతు తగ్గిపోవడం, వారి సిద్ధాంతాలపై విశ్వాసం కోల్పోవడం జరిగిందన్నారు.అలాగే మావోయిస్టులు నిరంతర లొంగుబాట్ల కారణంగా పార్టీ సిద్ధాంతాలపై నిరాశ పెరగడం ఒక కారణంగా వారు పేర్కొన్నారని ఎస్పీ తెలిపారు. ఛత్తీస్గఢ్, ఒడిశా మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన వరుస ఎదురుకాల్పులలో పలువురు సీనియర్ మావోయిస్టు నేతలు మరణించడంతో సంస్థ కార్యకలాప శక్తి తీవ్రంగా బలహీనపడటం జరగటంతో లొంగుబాట్లకు కారణం ఎస్పీ అన్నారు.ప్రభుత్వ పునరావాస విధానాలు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న ఆకర్షణీయమైన లొంగుబాటు ప్రయోజనాలు - ఆర్థిక సహాయం, భూమి, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు- గురించి అవగాహన కలగడంతో తీవ్రవాదాన్ని విడిచి ప్రధాన స్రవంతి సమాజంలోకి తిరిగి చేరేందుకు ప్రేరణ పొందడంతో మావోయిస్ట్ లు లొంగుబాటు ప్రధాన కారణం ఎస్పీ అన్నారు.లొంగిపోయిన మావోయిస్టులను ప్రభుత్వ సంక్షేమ మరియు పునరావాస పథకాలను పూర్తిగా వినియోగించుకుని గౌరవప్రదమైన, శాంతియుత జీవితం గడపాలని ఎస్పీ కోరారు. అర్హులైన వారికి అన్ని ప్రయోజనాలు వెంటనే అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ ప్రాయోజిత శిక్షణ కార్యక్రమాల ద్వారా నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఇంకా ఇతర మావోయిస్టు క్యాడర్లు సమీప పోలీస్ స్టేషన్లో స్వచ్ఛందంగా లొంగిపోవాలని లేదా కుటుంబ సభ్యుల ద్వారా గానీ, నేరుగా సీనియర్ పోలీస్ అధికారులను సంప్రదించాలని ఎస్పీ అమిత్ బర్దర్ కోరారు .ఈ సమావేశంలో చింతూరు ఏఎస్పీ బొడ్డు హేమంత్,పాడేరు డీఎస్పీ అభిషేక్ పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్‌కు తొలి ఆహ్వాన శుభలేఖ

### తన పెళ్లికి ఆహ్వానించిన రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

పాడేరు,ఏప్రిల్9,ప్రభాతవార్త:



రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని అమరావతి ఉండవల్లి నివాసంలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ (జిసిసి) చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు లో మే13వ తేదీన జరగనున్న తన వివాహానికి సంబంధించి తొలి ఆహ్వాన శుభలేఖను మంత్రి నారా లోకేష్ కు చైర్మన్ శ్రావణ్ అందజేసి తన పెళ్లికి ఆహ్వానించారు. వివాహ ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించిన నారా లోకేష్, పెళ్లికి కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చినట్టు శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు.

## జల్లి బాబులను పరామర్శించిన కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



పాడేరు,ఏప్రిల్9, ప్రభాతవార్త:

అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వైస్సార్సీపీ సీనియర్ నాయకులు జల్లి బాబులని పాడేరు మాజీ ఎమ్మెల్యే, వైస్సార్సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి గురువారం పరామర్శించారు. నర్సీపట్నం లోని అమ్మ హాస్పిటల్‌లో ఆయన చికిత్స పొందుతున్నారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఆయనను పరామర్శించిన వారిలో ఎంపీపీ బదుగు రమేష్, మంప మాజీ ప్రెసిడెంట్ రాజులమ్మ, డా. నరసింగరావు ఉన్నారు.

## ఎన్నాళ్ళ కల... కూటమితో నెరవేరెనిలా..!

### కితాబు రోడ్డుపనులను ప్రారంభించిన మాజీ సర్పంచ్,టిడిపి నేత భీమరాజు

కొయ్యూరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త



కితాబు గ్రామస్తుల ఎన్నాళ్ళు కల, ఎట్టకేలకు టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతో నెరవేరుతుందని టిడిపి నేత, పెదమాకవరం మాజీ సర్పంచ్ లోతా భీమరాజు సంతోషం వ్యక్తం చేశారు. రూ. 4కోట్ల పీఎం జన్మన్ నిధులతో మండలంలోని వెలగల పాలెం పంచాయితీ కితాబు రోడ్డు, మధ్యలో వంతెన నిర్మాణ పనులను గురువారం ఆయన స్థానిక నేతలు వెలగలపాలెం సూపర్ సర్పంచ్ ఇరవాడ సత్యనారాయణ, తదితరులు అలాగే కాంట్రాక్టర్ లగుడు చిన్నయ్య నాయుడు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటీరోడ్ తో పాటు వంతెనకు రూ.నాలుగు కోట్లు పీఎం జన్మన్ నిధులతో శంకుస్థాపన చేయడం స్థానిక కూటమినేతల విజయంగా ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలతో పాటు, కితాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాడేరులో ఘనంగా 'పోషణ పక్వాడ' ప్రారంభం

### చిన్నారుల మేధో శక్తి అభివృద్ధికి తల్లిపాలే అమృతం:ఐసీడీఎస్ అధికారి శారద వెల్లడి



పాడేరు,ఏప్రిల్9,ప్రభాతవార్త

పాడేరు ఐసీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక మాతా శిశు ఆసుపత్రిలో 'పోషణ పక్వాడ' కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభించారు. చిన్నారుల ఆరోగ్యం, గర్భిణులు, బాలింతల పోషణపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు, ఆరోగ్య నిపుణులు పలు కీలక సూచనలు చేశారు.?తల్లిపాల ప్రాముఖ్యత, శిశువు పుట్టినప్పటి నుండి రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు అందించడం ఎంతో అవసరమన్నారు. చిన్నారుల మెదడు అభివృద్ధిలో 90 శాతం తల్లిపాల ద్వారానే అభివృద్ధి జరుగుతుందని వారు గుర్తుచేశారు. ఆహార నియమాలలో బాలింతలు జంక్ ఫుడ్ (బయటి ఆహారం) కు పూర్తిగా దూరంగా ఉండాలి. కేవలం ఇంట్లో తాజాగా తయారుచేసిన పౌష్టికాహారాన్ని మాత్రమే తీసుకోవాలి. డిజిటల్‌కి దూరంగా ఉండే విధంగా చూడాలని, పిల్లలకు సెల్ ఫోన్లను అలవాటు చేయవద్దాన్నారు.మొబైల్ వాడకం వల్ల పిల్లల మెదడు పనితీరు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కుటుంబ బంధాలు,పిల్లలు తమ తల్లిదండ్రులు, తాతయ్యలు మరియు అమ్మమ్మలతో ఎక్కువ సమయం గడిపేలా చూడాలని, దీనివల్ల వారిలో సామాజిక స్పృహ, మానసిక వికాసం మెరుగుపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిడిపిఓ జి.శారదా దేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.నర్సింగరావు, మండల తాసిల్దార్ సత్యనారాయణ, ఎండిఓ తేజ రతన్, గైనకాలజిస్ట్ డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ ప్రసన్న డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ బేగం, ఐసిడిఎస్ సూపర్వైజర్లు లక్ష్మి,, కొండమ్మ, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ పి రాజేశ్వరి, ఆసుపత్రి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది తల్లులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ తల్లి పండగ సందర్భంగా(పందిరి) రాట కార్యక్రమం



హుకుంపేట, ఏప్రిల్ 9,ప్రభాతవార్త

హుకుంపేట గ్రామంలో మే 3,4,5 వ తేదిలలో జరిగే శ్రీ మొదకొండమ్మ జాతర ఉత్సవలు సందర్భంగా పండుగ పందిరి రాట కార్యక్రమం ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలోగురువారం నిర్వహించారు . ప్రతి సంవత్సరం ఘనంగా జరిగే ఉత్సవాలు మరంత ఘనంగాఈ సంవత్సరం కూడా మోదకొండమ్మ తల్లి పండగ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షులు కె.నాగబాబు తెలిపారు. ఈ కార్యక్రమం కి ముఖ్య అతిధి గా హుకుంపేట జ× సన్యాసి నాయుడు , హుకుంపేట సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ,ఎంపీటీసీ కొమ్మ రమ,ఉత్సవ కమిటీ ఉప అధ్యక్షులు శోభ సంతోష్, మాజీ వైస్ సర్పంచ్ గోవింద్,మాజి జడ్పీటీసీ కాసులమ్మ, వైస్సార్సీపీ మండలం అధ్యక్షులు అనిల్,ఉత్సవ కమిటీ సభ్యులు కోశాధికారి నైని సత్తిబాబు, సిరగం సూర్య కాంతం, హుకుంపేట మండలం పీసా ప్రధాన కార్యదర్శి జన్ని.వెంకటరమణ,ఓలుగు.వాసు దేవ్, బద్నాయిని, శివ బాలు, పాడి.వెంకటేష్, లక్ష్మణ్,నూకరాజు,సభ్యులు, వంతల ఈశ్వర్ రావు గ్రామస్తులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అందరి భాగస్వామ్యంతో పంచాయతీ అభివృద్ధి

### పంచాయతీ ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు

అనంతగిరి ఏప్రిల్ 9,ప్రభాతవార్త



పంచాయితీలో గల రాజకీయ నాయకులు సచివా లయం సిబ్బంది గ్రామ ప్రజల భాగస్వా మ్యంతోనే పంచాయతీ అభివృద్ధి చేస్తానని పంచాయతీ ప్రత్యేక అధికారి బిబి నాగేశ్వరరావు అన్నారు. గురు వారం గుమ్మ, పెద్ద బిడ్డ సచివాలయంలో పంచాయతీ కార్య దర్శిల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గుమ్మ, పెదబిడ్డ, లుంగుపర్తి పంచాయతీలలో ఎన్నో ఏళ్లగా త్రాగునీరు ,సిసి రోడ్లు, వీధి కాలువలు లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు. ఆయా గ్రామాల గిరిజనుల సమస్యలు తెలుసుకుని ఏ గ్రామానికి త్రాగునీరు అవసరము, సిసి రోడ్ల, కాలువలు అవసరము గుర్తించి ఆ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. మూడు పంచాయతీల గిరిజనులు ఏ ఏ సమస్యలు ఉన్నాయో తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తయారుచేసి అందరు సహకారంతో అభివృద్ధి చేస్తానని ఆయన తెలిపారు.పంచాయతీ అభివృద్ధికి ఆయా పంచాయతీల గిరిజనులు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రత్యేక అధికారి నాగేశ్వరరావుకు కూటమి నాయకులు, సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు,ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బారావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గాలి నరేంద్ర, గుమ్మ పంచాయతీ మాజీ సర్పంచ్ రాములమ్మ, పెదబిడ్డ పంచాయతీ మాజీ సర్పంచ్ పెంటమ్మ, గ్రామ కమిటీ అధ్యక్షులు బిడ్డ దేవుడు, మాజీ సర్పంచ్ వీరన్నదొర మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బుజ్జిబాబు, టిడిపి సీనియర్ నాయకులు బిడ్డ లక్ష్మణరావు, కూటమి నాయకులు నాగేష్ బాలరాజు, బిడ్డ గంగులు, తదితరులు పాల్గొన్నారు.

## జంక్ ఫుడ్‌ను పిల్లల దరిచేరనీయకండి..!

### '8వ పోషణ పక్వాడ'లో జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్

కొయ్యూరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త



జంక్ ఫుడ్ ను పిల్లల దరిచేరనీయకుండా చూసి, అదే సమయంలో వారికి ఇంట్లో తయారుచేసిన పౌష్టికాహారాన్ని అందేలా తల్లులు జాగ్రత్త వహించాలని టిడిపి నేత, జిసిసి మాజీ చైర్మన్ ఎం వి వి ప్రసాద్ సూచించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కొయ్యూరు సిడిపిఓ దేవమణి ఆధ్వర్యంలో రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్, తహసిల్దార్, వైద్యాధికారి జగదీష్ నాయక్ , సిహెచ్ ఓ ప్రశాంత్ కుమార్,మాజీ ఎంపిటిసి శివరామరాజు, పాల్గొన్నారు. ఈనెల 9నుండి 23 వరకు ప్రాజెక్టు పరిధిలో ఉన్న అన్ని సెంటర్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. తొలిరోజు ఈ కార్యక్రమం యొక్క ప్రధాన అంశం తల్లి మరియు శిశు పోషణ లో భాగంగా గర్భధారణ సమయంలో ఆహారం మరియు సంరక్షణ, గర్భిణీ పరీక్షల ప్రాముఖ్యత, పుట్టిన బిడ్డ కు పూర్తిగా తల్లిపాలు ఇవ్వడం , సరైన వయసులో అనుబంద ఆహారం ప్రారంభించడం వంటి సూచనలను గర్భిణీలకు , బాలింతలకు సిడిపిఓ వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంవివి ప్రసాద్ మాట్లాడుతూ- గర్భిణీలు సరైన సమయంలో పరీక్షలు చేసుకోవాలని అందుబాటులో ఉన్న ఆసుపత్రిలోనే డెలివరీలు చేసుకోవాలని సూచిస్తూ, గర్భిణీలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.సి లో ఉన్న గర్భిణీలు , బాలింతలు , సూపర్వైజర్లు , పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

### అంబులెన్స్‌ను తప్పించబోయి బొలెరో ఢీకొన్న బైక్.. ఒకరు మృతి



గూడెం కొత్తవీధి ఏప్రిల్ 9, ప్రభాతవార్త

మండలంలోని మరో విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గూడెం కొత్తవీధి మండలం పరిధిలోని ముల్లుమెట్ట--రింతాడ గ్రామాల మధ్య టేకులవీధి సమీపంలో గురువారం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడగా, వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో యువకుడు ప్రాణాపాయ స్థితిలో విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక సమాచారం మేరకు చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీకి చెందిన కూర్మన్నపాకలు గ్రామ నివాసులు కొర్ర కోటిబాబు (26), పాంగి అప్పారావు (28) వ్యక్తిగత పనిమీద బైక్‌పై చింతపల్లి మీదుగా గూడెం కొత్తవీధి వైపు వెళున్నారు. ఈ క్రమంలో రింతాడ పంచాయతీ పరిధిలోని ముల్లుమెట్ట రోడ్డులో వేగంగా ప్రయాణిస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న అంబులెన్స్‌ను తప్పించబోయి అదుపు కోల్పోయిన బైక్ రోడ్డుపక్కన నిలిపి ఉన్న బొలెరో వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో ఇద్దరూ రోడ్డు పక్కనున్న పొదల్లోకి ఎగిరిపడి పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరి కాళ్లకు తీవ్ర గాయాలు కాగా ఎముకలు బయటకు కనిపించేలా దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు. ఘటనను గమనించిన గ్రామస్థులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. చింతపల్లి 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి క్షతగాత్రులను చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్యాధికారిణి డాక్టర్ చందన అత్యవసర చికిత్స అందించినప్పటికీ, తీవ్ర గాయాలతో పాంగి అప్పారావు పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరోవైపు కోటిబాబు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్య సేవల కోసం విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో యువకులు మద్యం మత్తులో ఉన్నారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం చోటుచేసుకున్న ముల్లుమెట్ట రోడ్ సన్నగా ఉండటం, ప్రమాదకర మలుపులు ఎక్కువగా ఉండటం, అలాగే వేగం మరియు నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి భద్రతపై చర్యలు తీసుకోవాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, పోలీసు పర్యవేక్షణ పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనపై చింతపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.






## పన్నులు వసూళ్లులో అల్లూరి జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం

పాడేరు,ఏప్రిల్9,ప్రభాతవార్త:



అల్లూరి సీతారామరాజు జిల్లాలో పన్నులు మరియు పన్నేతరముల వసూళ్లలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం విశేషంగా అల్లూరి జిల్లా నిలిచింది. జిల్లాలో మొత్తం 244 గ్రామ పంచాయతీలు మరియు 3461 హాబిటేషన్లు ఉన్నాయి. చరిత్రలో తొలిసారిగా 244 గ్రామ పంచాయతీలలో 240 గ్రామ పంచాయతీలు 100 శాతం వసూళ్లు పూర్తి చేయడం జిల్లా పరిపాలనకు గర్వకారణంగా నిలిచింది. ఈ విజయానికి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కె పూర్ణ చంద్రశేఖర్ సమర్థ నాయకత్వం మరియు పర్యవేక్షణ ప్రధాన కారణమని అధికారులు పేర్కొన్నారు. అలాగే ఉప మండల అభివృద్ధి అధికారులు,డి ఎల్ పి ఓ లు,డి డి ఓ లు, పంచాయతీ అభివృద్ధి అధికారులు అందరూ సమిష్టిగా కృషి చేయడం వల్ల ఈ విజయాన్ని సాధించగలిగామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఉత్తమంగా పనిచేసిన పంచాయతీ అభివృద్ధి అధికారులకు ప్రశంసా పత్రాలు గురువారం అందజేశారు. జిల్లా పంచాయతీ అధికారి కె.పూర్ణ చంద్రశేఖర్ పంచాయతీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపినందుకు అధికారులు మరియు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## జిల్లాలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### మొబైల్ సిగ్నల్ కనెక్టివిటీపై సమీక్షా సమావేశం : జిల్లా కలెక్టర్ నిషాంతి.టి

పాడేరు,ఏప్రిల్ 9,ప్రభాతవార్త



జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్ కనెక్టివిటీ మెరుగుపరచడానికి రెవిన్యూ,అటవీ శాఖల అనుమతులు పొందిన పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో తన ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో టెలికాం ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయంతో రెవిన్యూ, అటవీ, పంచాయతీరాజ్, పి ఐ యు ఇంజనీరింగ్, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖల నుండి ఇప్పటికే పరిశీలన, అనుమతులు లభించిన టవర్ల నిర్మాణ పనుల్లో ఎటువంటి జాప్యం ఉండకూడదని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని సిగ్నల్ కనెక్టివిటీ గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు, ప్రజలకు ఇంటర్నెట్, మొబైల్ సేవలకు అత్యవసరమని, ఈ ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేయాలని టెలికాం విశాఖపట్నం బిఎస్ఎన్ఎల్ డీజీఎం, (కన్స్యూమర్ మొబైల్ డేటా) శ్రీకాంత్ పట్నాయక్ కు కలెక్టర్ సూచించారు. కేటగిరీ 5లో అనుమతులు పొందిన చట్రాయపుట్టి సిగ్నల్ టవర్ ఇన్ ఎక్సెస్ బుల్ గా ఉందని, కొత్తపల్లి టవర్ పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. కేటగిరి 6లో 11 అనుమతులు పొందగా అందులో నాలుగు పెండింగ్ ఉన్నాయని త్వరలో వాటి స్థితిగతులు తెలియజేస్తామని వివరించారు. అలాగే పెదవేల మండలం లింగేటి పంచాయతీ దొండగరువు టవర్ కు సంబంధించిన పరిశీలించి, సిగ్నల్ టవర్ ఏర్పాటుకు అనుమతులు పొందాలని సూచించారు. జిల్లాలో అనుమతులు ఇచ్చిన అన్ని మండలాల లోని మారుమూల గ్రామాలకు సంబంధించిన క్లియరెన్స్‌లు, రెవెన్యూ,ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చిన ప్రాంతాల్లో వెంటనే సివిల్ పనులు ప్రారంభించి, మిగిలిన చోట్ల ప్రతిపాదనలను వేగవంతం చేయాలని, నెక్స్ట్ జరగబోయే సమావేశంలో పెండింగ్ సమస్యలపై పూర్తి చేసి రావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరిమాని శ్రీ పూజ, ఇన్చార్జి జిల్లా రెవిన్యూ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవిఎస్ లోకేశ్వరరావు , పాడేరు చింతపల్లి అటవీ శాఖాధికారులు, రెవిన్యూ అధికారులు,మండల తాసిల్దార్, పి ఆర్,పిఐయు, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు, జియో,ఎయిర్టెల్,బిఎస్ఎన్ఎల్ వివిధ టెలికాం నెట్‌వర్క్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జనసేన కార్యకర్త కుటుంబానికి భరోసా కల్పించిన మండల జనసేన నాయకులు



గూడెం కొత్తవీధి,ఏప్రిల్ 9ప్రభాతవార్త

మండలంలోని పెదవలస గ్రామ పంచాయతీ పరిధిలోని చాపరతిపాలెం గ్రామానికి చెందిన జనసైనికుడు కసింకోట వెంకట రమణ మంగళ౼వారం రాత్రి మృతి చెందడం ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.ఈ దుర్వార్త తెలుసుకున్న వెంటనే జనసేన పార్టీ నాయకులు ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. జనసేన పార్టీ పాడేరు ఇంచార్జి రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు,అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీరవెంకట్ సహా పలువురు నాయకులు మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల ఆవేదనను చూసి నాయకులు కూడా భావోద్వేగానికి గురయ్యారు. "వెంకట రమణ ఇక లేరు కానీ, ఆయన కుటుంబం ఒంటరిగా లేదు.జనసేన పార్టీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుంది" అని నాయకులు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ వసుపరి ప్రసాద్, మాజీ సర్పంచ్ జంబూ బాలరాజు, క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు వసుపరి తిమోతి, జనసేన పంచాయతీ అధ్యక్షులు విరోజీ త్రిమూర్తులు,మాజీ వార్డు మెంబర్ దారబాబు, వీరామహిళా నాయకురాలు కంకిపాటి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.వెంకట రమణ మృతి జనసేన కుటుంబానికి తీరని లోటుగా పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నాయకులు ఆకాంక్షించారు.

## మండల పరిషత్ అభివృద్ధి నిధులపై శ్వేత పత్రం విడుదల కై కూటమి నేతల డిమాండ్

గూడెం కొత్తవీధి,ఏప్రిల్ 9 ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత జీకే వీధి మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని కావున జీకే వీధి మండల పరిషత్ అభివృద్ధి నిధులపై శ్వేత పత్రం విడుదల చేసి కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జీకే వీధి మండల పరిషత్తు నిధులను ప్రజల ముందు ఉంచాలని జీకే వీధి మండల కూటమి నేతలు అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పొత్తూరు కొండల రావు,మండల జనసేన పార్టీ అధ్యక్షులు కొయ్యం బాలరాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్ర బలరాం,మాజీ మండల టిడిపి అధ్యక్షుడు ముక్కలి రమేష్,సిద్ధార్థ మార్క్,మండల టిడిపి ఉపాధ్యక్షుడు పాడి శ్రీనివాస్,టిడిపి మాజీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ముక్కలి మహేష్,టిడిపి నాయకులు వడేల పాండురాజు,మాతే కామరాజు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ప్రారంభమైన పోషణ పక్వాడ్ కార్యక్రమాలు

గూడెం కొత్తవీధి,ఏప్రిల్ 9, ప్రభాతవార



మండలంలోని గురువారం నుండి ఈనెల 23 వరకు పోషణ పక్వడ కార్యక్రమాలు మండల కేంద్రంలో గర్భవతులు మరియు పిల్లలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీహెచ్సీ లలో గర్భవతులకు మరియు జీరో నుండి రెండేళ్ల వయసు గల పిల్లలకు మెదడు అభివృద్ధి 80% పెరుగుతుంది కాబట్టి తల్లులకు అవగాహన కల్పించారు.అలాగే ఉదాహరణకు పిల్లలకు చక్కెరకు దూరంగా ఉంచమని చిన్నారులకు స్క్రీన్ టైమ్ ఇవ్వవద్దు అని ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఇవ్వాలని డాక్టర్ శివరం,డాక్టర్ రుశశ్రీ వైద్యులు తెలిపారు. పిల్లలకు ఇంటి పరిసరాలలో లోపల మరియు బయట ఆటలకు ప్రోత్సహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్స్ డి వలసమ్మ,డి మోహిని,ఎల్ ఎస్ మాలతి,వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యుటీఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులు చేర్పింపుపై తల్లిదండ్రులకు అవగాహన



(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోనిదేవవరం గ్రామంలో ప్రభుత్వ పాఠ శాలలో పెద్ద ఎత్తున విద్యార్థుల చేర్పింపుపైవారం రోజులుగా యు.టి.ఎఫ్. ఆధ్వర్యంలో జరుగుతున్న తల్లిదం డ్రుల అవగాహన కార్యక్రమం మంచి సత్ఫలితాలను ఇస్తుంది. దేవవరం గ్రామంలో ఉన్న మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బుధవారం గ్రామంలో విద్యార్థులు చేర్పింపుపై అవగాహన కార్యక్రమం ఇంటింటికి నిర్వహిం చారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ పథకాలు, డిజిటల్ క్లాస్ రూమ్స్, ఆట స్థలం, మధ్యాహ్న భోజన పథకం, ఎస్ఆర్ కెవిద్యార్థి మిత్ర కిట్లు, తల్లికి వందనం, ఆహ్లాదకరమైన విద్యాబోధన వంటి విషయాలను ఇంటింటికి తిరిగి ప్రచారం చేసి, తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం వల్ల కలిగే ప్రయోజనాలు తల్లిదండ్రులకు తెలియజేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్ లో తరగతికి ఒక టీచర్ బోధన చేస్తున్నారని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలియజేశారు. దీనిపై తల్లిదండ్రుల నుంచి కూడా సానుకూల స్పందన కనిపించింది. పలువురు తల్లిదండ్రులు తమ విద్యార్థులను ఒకటవ తరగతిలో చేర్పించడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. చుట్టుపక్కల గ్రామాల్లో ప్రైవేట్ స్కూల్లో చదువుతున్నటువంటి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేరుస్తామని హామీ ఇచ్చారు. మరి కొంతమంది తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూల్లో ఉన్న తమ విద్యార్థులను మాన్పించి ప్రభుత్వ బడిలో చేరుస్తామని ముందుకొచ్చారు. గత వారం రోజులుగా జరుగుతున్న ఈ ఈ కార్యక్రమం గ్రామాల్లో సత్ఫలితాలను ఇస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యు.టి.ఎఫ్. జిల్లా గౌరవ అధ్యక్షులు పంపనబోయిన వెంకట్రావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మండల గౌరవ అధ్యక్షులు డి.ఆర్.కె.శాస్త్రి ప్రభుత్వ బడుల బలోపేతానికి యు.టి.ఎఫ్. ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని, గ్రామ నాయకులు ప్రశంసించారు.

## నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల

బుచ్చయ్యపేట ఏప్రిల్ 9 ప్రభాతవార్త

చెట్టుకొమ్మల తొలగింపు పనుల నిమిత్తం నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. వడ్డాది సబ్‌స్టేషన్ పరిధిలోని విజయరామరాజు పేట, కుమ్మందాన్నిపేట ప్రాంతాలు, అలాగే రాజం సబ్‌స్టేషన్ పరిధిలోని పెద మదిన ఫీడర్ కిందకు వచ్చే గ్రామాలు- ఉప్పరగూడెం, పెద్ద మదిన, చిన్న మదిన, కేపీ అగ్రహారం, గున్నేంపూడి, ఐతం పూడి, కొండ పాలెం, పైడం పేటల-లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ శాఖ అధికారులు ఎస్,రామకృష్ణ తెలిపారు

## నక్కపల్లి మండల పరిషత్ ఇన్చార్జి ఎంపీడీవోగా చలపతిరావు

(నక్కపల్లి, ప్రభాతవార్త)



నక్కపల్లి మండల పరిషత్ ఇన్చార్జి ఎంపీడీవో గా ప్రస్తుతం డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న కే.చలపతిరావు గురువారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన బి.చైతన్యను ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ మేరకు చలపతిరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల పరిషత్ ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధితోపాటు ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు జరగ కుండా అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని ,రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని చెప్పారు. బాధ్య తలు చేపట్టిన చలపతిరావును డిప్యూటీ ఎంపీడీవోగా ఉన్న జ్యోతి, ఏవో దెందుకూరు సీతారామరాజు, పలు వురు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## మంచినీటి సమస్యపై 'కొప్పిశెట్టి' దృష్టి.!



(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త

మండలంలోని వివిధ గ్రామాల్లో వేసవి ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర హోం మంత్రి వంగల పూడి అనిత ఆధ్వర్యంలో ఎక్కడ కూడా మంచి నీటి సమస్య ఉండకూడదని ప్రత్యేక ఆలోచనతో గ్రామీణనీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు నక్కపల్లి ఎస్సీ కాలనీలో పైపు లైన్లు పాడువడంతో కాలనీకి వెళ్లి అధికారులకు తక్షణమే పైపులైన్లు మరమ్మతులు చేసి మంచినీటిని అందజేయాలని ఆదేశించారు. మించిన అధికారులు సమస్య పరిష్కారం అయినందుకు కృషి చేశారు ఇదే కాకుండా మండలంలో ఎక్కడ కూడా మంచినీటి సమస్య లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఏ ఒక్కరి నిర్లక్ష్యం ఉన్న హోం మంత్రి క్షమించరని హెచ్చరించారు. ఆయనతోపాటు పట్టణ తెలుగుదేశం అధ్యక్షులు అద్దూరి లోవరాజు, టిడిపి నాయకులు కొప్పి శెట్టి వీరబాబు తదితరులు ఉన్నారు.

## పలు పంచాయతీలకు ప్రత్యేక అధికారి దెందుకూరి ..బాధ్యతలు స్వీకరణ

(నక్కపల్లి ,ప్రభాతవార్త)

గ్రామ పంచాయతీలకు సర్పంచులు పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయా పంచాయతీలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు మండలంలోని 32 పంచాయతీల్లో నియమితులైన ప్రత్యేక అధికారులు ఆయా పంచాయతీల్లో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అధికారులకు ఆయా గ్రామ పెద్దలు ఆ పంచాయతీల కార్యదర్శి ఘనంగా సత్కరించారు. ఈ మేరకు మండలంలోని వేంపాడు ,బుచ్చిరాజుపేట, న్యాయం పూడి గ్రామపంచాయతీలో మండల పరిషత్ ఏఓ దెందుకూరు సీతారామరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా దెందుకూరు సీతారామరాజును మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు అయినంపూడి మణి రాజు, ఎంపీటీసీ సభ్యులు కుంచె మధు, మాజీ సర్పంచ్ ఏడిద నూకరత్నం, మాజీ ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, టిడిపి నాయకులు పల్లా రాంబాబు లతోపాటు కార్యదర్శులు కిరణ్ ,పివిపి రాజశేఖర్ సచివాల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం దెందుకూరు సీతారామరాజు గ్రామపంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. ఈ మేరకు గ్రామ సచివాలయం ఎదుట మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.




## అలరించిన నూకాంబిక ఉత్సవాలు



అనకాపల్లి, ఏప్రిల్ 9,ప్రభాతవార్త

ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ శ్రీ నూకాంబిక అమ్మవారి రాష్ట్ర మహోత్సవాలు గురువారం నాటికి 24వ రోజుకు చేరుకుని వైభవంగా కొనసాగుతున్నాయి. స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో, జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కీ పర్యవేక్షణలో ఉత్సవాలు కనివిని ఎరుగని రీతిలో నిర్వహి స్తున్నారు. ఎన్టీఆర్ మైదానంలో నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అన్నమాచార్య వాగ్గేయ వరదాయని బృందం ప్రదర్శించిన కోలాటం ప్రేక్షకులను అలరిం చింది. అనంతరం పులకండ విజయబాబు అందించిన ఈలపాటలు, మైదానంలో ఉత్సాహాన్ని నింపాయి. చివరగా ఉమామహేశ్వర మ్యూజిక్ కూచిపూడి అకాడమీ కళాకారులు అందించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఈ కార్యక్రమానికి పులకండ విజయబాబు, విల్లూరి హరికృష్ణ, మణి కుమారి, దళపతి భాను, మద్దాల కృష్ణ, శృంగవరపు శ్రీకాళహస్తి, మల్ల బాబు, భారతి, ప్రియాంక తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆలయ చైర్మన్ పీలా నాగ శీను, ఈవో శ్రీధర్, ధర్మకర్తల మండల సభ్యులు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ లు తిమ్మ పాత్రుని చక్రవర్తి, సకల గోవింద్, గండేపల్లి మురళి, పాల్గొన్నారు

## నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



చోడవరం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త

చోడవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అధ్యక్షతన నియోజవర్గం లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ ఉన్నత అధికారులతో ఆయా వర్కుల పురోగతి గురించి చర్చించారు. అలాగే ఆర్ అండ్ బి, ప్రాజెక్ట్స్ ,పంచాయతీ రాజ్, ఇరిగేషన్ , ఆర్డబ్ల్యూఎస్, దేవాదాయ శాఖ అధికారులతో కూడా ఈ సమావేశంలో సమీక్షించారు.

## పాయకరావుపేట ఎంపిడిఒగా అడపా లవరాజు

పాయకరావుపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త



పాయకరావుపేట ఎంపిడిఒగా అడపా లవరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన పి విజయలక్ష్మిని అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు బదిలీ చేసిన అధికారులు అక్కడ ఎంపిడిఒగా పనిచేస్తున్న లవరాజు ను ఇక్కడకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ లవరాజును కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరిం చారు. పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ లవరాజు స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ... మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## చెట్టుపల్లి పంచాయతీ ప్రత్యేకాధికారిగా సత్కరించిన కూటమి నాయకులు



నర్సీపట్నం,ఏప్రిల్ 09,ప్రభాతవార్త

నర్సీపట్నం మండలం చెట్టుపల్లి పంచాయతీ ప్రత్యేకాధి కారిగా రామన్నపాత్రుడు గురువారం బాధ్యతలు స్వీకరిం చారు. ఈ మేరకు కూటమి నాయకులు, సచివాలయం కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శాలువతో ఘనంగా సత్కరించారు. చెట్టుపల్లి పంచాయతీ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరించాలని కూటమి నాయకులు కోరారు. నాయకులు సహకరిస్తే గ్రామ అభివృద్ధికి మరింత ముందుకు వెళ్లవచ్చునని ప్రత్యేకాధికారి చెప్పారు. కూటమి నాయకులు గజాల సూరిబాబు, అప్పికొండ రాజు, నాగులాపల్లి గోవిందు, యర్రంశెట్టి పాపారావు, మట్ట సతీష్, వూడి చక్రవర్తి, ఇన్నం రమణ, సత్యప్రసాద్, కలిమి సత్తిబాబు, గ్రామ పెద్దలు, సచివాలయం సిబ్బంది, ఎన్ఆర్ఎజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

గొలుగొండ ఏప్రిల్ 9, ప్రభాతవార్త



కృష్ణా దేవి పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈరోజు ఉదయం నమోదైన మిస్సింగ్ కేసును పోలీసులు గంటల వ్యాధిలోనే ఛేదించి బాలికను అదుపులోకి తీసుకున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసు వివరాలను పోలీసులు వెల్లడించారు. గురువారం ఉదయం 8:30 గంటలకు బాలిక తప్పిపోయినట్లు అయినట్లు ఫిర్యాదు బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు అందించినట్లు ఎస్ఐ రిషికేశ్వర రావు తెలిపారు. ఫిర్యాదు నమోదైన వెంటనే తమ సిబ్బందితో కలిసి వెతికే పని ప్రారంభించినట్లు తెలియజేశారు. ఫిర్యాదు పై నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పి పి. శ్రీనివాసరావుకు సమాచారం చేరవేయడంతో డి.ఎస్.పి సూచన మేరకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, వివిధ ప్రాంతాల్లో శోధన చర్యలు చేపట్టమన్నారు. ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సిబ్బందిని అన్ని వేగవంతంగా కదలికలు గుర్తించి దర్యాప్తు చేపట్టామన్నారు. తప్పిపోయిన బాలికను తూర్పు గోదావరి జిల్లా గండిపేట ప్రాంతంలో ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా సురక్షితంగా గుర్తించామన్నారు. వెంటనే బాలికను స్థానిక సిబ్బంది సంరక్షణలోకి తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించే చర్యలు చేపట్టామన్నారు. ఈ సంఘటనపై పోలీసులు స్పందించిన తీరును డి. ఎస్.పి అభినందించారు. పోలీసుల స్పందించిన తీరు సాంకేతిక విలువల వినియోగం సుమారు 13 లక్షలకు సమయోచిత నిర్ణయంతో మిస్సింగ్ కేస్ ఛేదించినట్లు తెలిపారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని వారు చేస్తున్న, పనులు మొబైల్ వినియోగం పై దృష్టి సారించాలని సూచించారు.

## పాడేరు అసెంబ్లీ బిఎల్ఏ -1 సళ్ళ రామకృష్ణ నియామకం

పాడేరు,ఏప్రిల్9,ప్రభాతవార్త



భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సల్ల రామకృష్ణ కు పాడేరు అసెంబ్లీ బి ఎల్ ఏ -1 నియామకం.. గురువారం విశాఖపట్నం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్ర జోనల్ మీటింగ్ విజయవంతంగా జరిగింది. ఈ సమావేశంలో వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లకు బి ఎల్ ఏ -1 పత్రాలను అందజేసారు కార్యక్రమంలో పాడేరు అసెంబ్లీ బి ఎల్ ఏ 1 గా నన్ను చసల్ల రామకృష్ణ నియామక పత్రాలను అందజేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీన్ మాధవ్ నియామక పత్రము అందజేశారు.నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నిర్వహణలో సమన్వయం, బాధ్యతలపై అసెంబ్లీ లో బాధ్యతగా నిర్వహించలని మాధవ్ కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమం లో అల్లూరి జిల్లా అధ్యక్షులు మఠం శాంతకుమారి, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పర్సురం రాజు మరియు అనకాపల్లి, విజనగరం, మన్యం, శ్రీకకోళం అధ్యక్షులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

## యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా ధూళి నూకరాజు నియామకం



నక్కపల్లి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త

యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా సీనియర్ న్యాయవాది ధూళి నూకరాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏజీపీగా ధూళి నూకరాజు నియామకంపట్ల యలమంచిలి బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధూళి నూకరాజు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం చిత్త శుద్ధితో కృషి చేస్తానని తెలిపారు.

## స్పేసెస్ డిగ్రీ కళాశాల (అటానమస్) మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల



పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల (అటానమస్) 2025-26 మొదటి సెమిస్టర్ ఫలితాలను నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్ శివయ్య విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ... స్పేసెస్ అటానమస్ సాధించిన తరువాత మొదటిసారిగా తాను ఫలితాలు విడుదల చేయడం 72 శాతం ఉత్తీర్ణత సాధించడం హర్షణీయమని తెలిపారు. కార్యక్రమంలో స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ... బిసిఏలో జి రామ్ ప్రభాస్, 10/10, బి ఎస్సీ లో కె రుష్మితా దేవి 9.85/10, బిబిఎలో ఏస్ నిజిత 9.2/10, బి కామ్ లో ఖుషి పటేల్ 8.8/10 గ్రేడ్ పాయింట్స్ తో అగ్రగాములుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ వివిఎస్ బి బంగార్రాజు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ పెనుగొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్ వి కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

## అరట్లకోటలో భారీ ఈదురుగాలులకు నేలకొరిగిన బొప్పాయి పంట

### ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న రైతు గర్లంక నాగేష్

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త

మండలంలోని అరట్లకోటలో శుక్రవారం సాయంత్రం భారీ ఈదురుగాలులు కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. హఠాత్తుగా పెనుగాలులు వీయడంతో అరట్ల కోట గ్రామానికి చెందిన రైతు గర్లంక నాగేష్ కు చెందిన బొప్పాయి పంట పూర్తిగా నేలకొరిగింది. రైతు గర్లంక నాగేష్ 35 సెంట్లు భూమిలో గత ఏడాది జూలై నెలలో బొప్పాయి పంట వేశాడు. తోటకు ఎనిమిది ట్రాక్టర్లు పెంట, ఎనిమిది బస్తాలు గ్రోమోర్ ఎరువు వేశాడు. సుమారు అరవై వేలు రూపాయలు పెట్టుబడి పెట్టాడు. సరిగ్గా పంట కోతకు వచ్చిన సమయంలో భారీ పెనుగాలులకు పంట నేలకొరగడంతో పూర్తిగా నష్టపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని నాగేష్ వేడుకుంటున్నాడు.



## పాయకరావుపేట తహశీల్దారుగా శాంతి భూషణరావు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త



పాయకరావుపేట తహసీల్దారుగా డొంకాడ శాంతి భూషణరావును జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ నియమించారు. ఇక్కడ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తోన్న శివకోటి ఆది మహేశ్వర రావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. దీంతో ఆయన సెలవులో ఉండటంతో పాయకరావు పేట తహ సీల్దారుగా శాంతి భూషణరావును నియమిం చారు. శాంతి భూషణరావు గతంలో ఇక్కడ కొంతకాలం డిప్యూటీ తహసీల్దారుగా పనిచేసారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటేషనపై అనకాపల్లి తహసీల్దారుగా బదిలీపై వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న శాంతి భూషణరావును పాయకరావుపేట తహసీల్దారుగా నియమించడంతో బుధవారం విధుల్లో చేరారు. తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన శాంతి భూషణరావును అర్ఐ టి త్రినాథ్, విఆర్వోలు, కార్యాలయం సిబ్బంది ఘనంగా సత్కరించారు. శాలువాలు కప్పి, పూల బొకేలు అందజేసి అభినందించారు.

## జనాభా గణనపై సిబ్బందికి శిక్షణ తరగతులు

గొలుగొండ ఏప్రిల్ 9, ప్రభాతవార్త



జనాభా గణన 2027 సిబ్బందికి శిక్షణా తరగతులను చీడిగుమ్మల హైస్కూల్లో గురువారం తహసిల్దార్ కాకర నూకరాజు ప్రారంభించారు. మూడు విడుదలగా నిర్వహించే శిక్షణ తరగతుల్లో మొదటి బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభమ య్యాయని అన్నారు. జనాభా లెక్కల సేకరణ వివరాల నమోదు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై ట్రైనింగ్ సిబ్బందితో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. జనాభ గణన 2027 పైన సూపెర్ వైజర్స్, ఏన్యూమాలేటర్స్ కీ తహసీల్దార్ ఎ నూకరాజు ఏ ఎస్ ఓ మీనా, మాస్టర్ అఫ్ ట్రైనీస్ ం నరసింహం,ఏ రమణమూర్తి ట్రైనింగ్ నిర్వహిస్తున్నారు. శిక్షణా తరగతుల్లో వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

10skl13:10skl13.qxd 09-04-2026 22:01 Page 1



## నగర సుందరీకరణే లక్ష్యం : రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పించిన ఖిస్వర్ణాంధ్ర ప్రదేశ్ఖి లక్ష్య సాధనలో భాగంగా శ్రీకాకుళం నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతు న్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మో హన్ నాయుడు తెలిపారు. గురువారం మధ్యాహ్నం నుంచి సాయం త్రం వరకు నగరంలోని పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుం డ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత గూనపాలెం పార్కును సందర్శించిన అనంతరం, కోడిరామ్మూర్తి స్టేడియం పనులను సమీక్షించారు. స్టేడియంకు సంబంధించిన సివిల్ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని, ఆ వెంటనే శాప్ ద్వారా రూ. 2.6 కోట్లతో అత్యాధునిక క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు వెల్లడించారు. నగరంలో అభివృద్ధి చేస్తున్న పార్కులకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, ముఖ్యంగా కార్గిల్ పార్కులో చిన్నారులు, వృద్ధుల కోసం చేసిన ప్రత్యేక ఏర్పాట్లను నగర ప్రజలు ఎంతో స్వాగతిస్తున్నారని చెప్పారు. అలాగే ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి సీఎస్ఆర్ నిధుల కింద ఒక్కో పార్కుకు రూ. 50 లక్షల చొప్పున నాలుగు పార్కులకి నిధులు కేటాయిం చినట్లు తెలిపారు. హడ్కో కాలనీ, ఆర్కే నగర్, ఏపీజే అబ్దుల్ కలాం పార్కులను పరిశీలించిన మంత్రి.. నగర ప్రమాణాలను పెంచేలా వీటిని తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. రిజర్వు స్థలా లను కాపాడాలని, పచ్చదనం, ఆహ్లాదం కోసం పార్కులను ఏర్పాటు చేసే పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ కూర్మారావు, ఆర్ అండ్ బి ఎస్ఈ సత్యనారాయణ, సుడా ఇంజనీర్ సుగుణాకర రావు, పలువురు అధికారులు, పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమణయ్య రెడ్డి



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. సభ్యులు అంతా ఏకగ్రీవంగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా నందిక రమణయ్య రెడ్డి, సెక్రటరీగా మొగళ్ళ రాంబాబు, వైస్ ప్రెసిడెంట్గా ప్రేమలత పట్నాయక్, జాయింట్ సెక్రటరీగా దక్కత కృష్ణమూర్తి రెడ్డి, ట్రెజరర్గా రేవాడ దేవరాజ్ రెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు ఎ.సత్యనారాయణ, ఎ.నారాయ ణ, భగవాన్ దాస్, సత్యనారాయణ పాడి, రంగారావు, ఎ. బైరాగి రెడ్డి, పి. ప్రహ్లాద్ రెడ్డి, భీమారావు, ప్రసాద్ రెడ్డి, యం.రాజేంద్ర ప్రసాద్, సంతోష్ సాహు, శంకర్ రావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

## సమస్యలు వెంటనే పరిష్కరిస్తా : పంచాయతీ ప్రత్యేకాధికారి



కంచిలి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : పంచాయతీలో ఎటువంటి సమస్యలు ఉన్నా.. వెంటనే పరిష్కరిస్తానని పంచాయతీ ప్రత్యేక అధికారి ఎన్.రమేష్ కుమార్ అన్నా రు. ఎంఎస్ పల్లి, కొల్లూరు పంచాయతీలకు ప్రభుత్వం తనకు అదనంగా పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా నియమించినందుకు ఈ రెండు పంచాయ తీల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనకు రెండు పంచాయతీల కూటమి నాయకులు ఘనంగా దుస్సాలువాతో సన్మానిం చారు. కార్యక్రమంలో ఐటిడిపి మండల అధ్యక్షులు వాసాల రమేష్ రెడ్డి, టిడిపి ప్రధాన కార్యదర్శి పైల రామారావు, పిఎసిఎస్ మెంబర్స్ కిషోర్ పాడి,శ్రీకాంత్,మాజీ సర్పంచ్ పైల సూర్యనారాయణ రెడ్డి, ప్రదీప్, శ్రీరాములు, కామేష్, ఈశ్వర్, సోమేశ్, ప్రదీప్, మన్మథరావు, రాగుపురం యువ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో పాడి పరశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం : నిమ్మక



సీతంపేట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : గిరిజన ప్రాంతాలలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్య త కల్పించడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పష్టం చేశారు. గురువారం చిన్నబగ్గ గ్రామంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరం మెగా పాడి పశువుల పంపిణీ కార్యక్రమం లో ఆయన పాల్గొని గిరిజన రైతులకు పశువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.2,24,25000 కోట్ల రూపా యలు వెచ్చించి 460 పాడి పశువులను కొనుగోలు చేసి గిరిజన రైతులకు అందజేయడం జరిగిం దన్నారు. వీటి ద్వారా పాల సేకరణ చేపట్టి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పవర్ స్వప్నిల్ జగన్నాథ్, పశు సంవర్ధక శాఖ జెడి మన్మధరావు, ఏడి శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంధ్యారాణి, ఇమరక పవన్, ఏపిఎం కమల కుమారి, సర్పంచ్ నీలయ్య, జానీ జనసేన, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీ సమస్యలపై అధికారులు దృష్టిసారించాలి



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాలలో గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు గమనించి స్థానిక గ్యాస్ ఏజెన్సీని వైస్సా ర్సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి కార్యాలయంకు వెళ్లి వాస్తవ పరిస్థితి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఏజెన్సీ ప్రతినిధులు ఇచ్చిన సమా చారం ప్రకారం ప్రస్తుతం 3200 బుకింగ్స్ పెండింగ్ ఉన్నాయని, ఒక రోజుకు సుమారు 300 వందల నుండి 500 వరకూ సిలిండర్లు సరఫరా చేయగలరని, ఈ విధముగా చేయగలిగితే సుమారు 10 రోజులలో పూర్తి అవుతుందని (గతంలో రోజుకు సుమారు 300 వరకూ సరఫరా జరిగేది) చెప్పారు. కన్స్యూమర్స్ నుండి బుకింగ్స్ విపరీతంగా జరుగుతుందని సప్లై సైడ్ గోడౌన్కు లోటు లేదని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రజలకు అసౌకర్యం జరగకుండా మానిటర్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, అధికారులపై ఉందని అన్నారు. ఏమి చేయలేని స్థితిలో ప్రజల ఇబ్బందులు మాకు పట్టవనే ధోరణిలో నాయకులు, అధికారులు ఉంటే పాత రోజులలో వాడే కట్టెల పొయ్యి ప్రజలకు దిక్కుగా మారుతున్నాయని ఎద్దేవా చేశారు.ఇప్పటికైనా ప్రజలకు సరైన సమాచారం అందించి సిలిండర్లు సరఫరా సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## చిన్నబగ్గ ఆశ్రమ పాఠశాల హెచ్ఎంకు షోకాజ్ నోటీసు



సీతంపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : సీతంపేట ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిన్నబగ్గ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటిడిఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలిం చారు. విద్యార్థుల వసతి గృహ గదులను పరిశీలించి, పరిశుభ్రంగా లేకపోవడంపై అసం తృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో అమలవుతున్న ముస్తాబు కార్యక్రమం సక్రమంగా అమలు చేయకపోవడాన్ని గమనించి పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాస్కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకోవాలని ఇప్పటినుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



పాతపట్నం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: మండల కేంద్రం అచ్చుతాపురం గ్రామంలో వెలసియున్న శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయ 26వ వార్షికోత్స వ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగాయి. వార్షికో త్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మ వారిని రకరకాల పుష్పాలతో, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరిం చారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారో గ్యాలతో వర్ధిల్లాలని కోరుతూ ఆలయ ప్రాంగణంలో హోమాలు నిర్వహిం చారు. ఈ వేడుకలకు పాతపట్నం పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు పసుపు, కుంకుమలు, పండ్లు, నైవే ద్యాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వార్షికోత్స వం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఊర్జాన కుటుంబీకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## వెంకటేశ్వర దివ్యక్షేత్రం వరకు విద్యుత్ సౌకర్యం

వార్త ప్రభావం



సీతంపేట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యం లో సీతంపేటలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రానికి వస్తున్న భక్తులు కారు చీకట్లో రావలసిన పరిస్థితి నెలకొందని వార్త దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన వార్తకు ఐటిడిఏ పిఓ పవర్ స్వప్నల్ జగన్నాథ్ స్పందిం చారు. వెంకటేశ్వర ఆలయం వరకు దారి పొడవున విద్యుత్ స్తంభాలను ఏర్పాటుకు అవసరమైన నిధులను మంజూరు చేశారు. దీంతో ఏపీవో చిన్నబాబు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ. విద్యుత్ శాఖ ఏఈ నీలిమ ప్రత్యేక దృష్టి సారించారు. ఐటిడిఏ గ్రామపంచాయతీ ఉమ్మడిగా నిధులు సమకూర్చి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో జనగణన శిక్షణ తరగతులు



పాతపట్నం ఏప్రిల్ 9 ప్రభాతవార్త: జనగణన (సెన్సెస్) 2027లో భాగంగా మొదటి దశ శిక్షణా కార్యక్రమాలు గురువారం స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా మొదటి బ్యాచ్కు సంబంధించి ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతులకు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ శిక్షణలో ఛార్జ్ ఆఫీసర్గా వ్యవహరిస్తున్న తహశీ ల్దార్ నందిగాం ప్రసాదరావు, అడిషనల్ ఛార్జ్ ఆఫీసర్గా ఎంపిడిఓ హెచ్.వి రమణమూర్తి, ఛార్జ్ క్లర్క్ (డిప్యూటీ తహశీల్దార్) బి.వెంకటరమణ, టెక్నికల్ అసిస్టెంట్ (ఏఎస్ఓ) పి.బాలరాజు పాల్గొన్నారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగా, తప్పులు లేకుండా ఎలా నిర్వహించాలనే అంశంపై వీరు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ శిక్షణా శిబిరంలో సుమారు 40 మంది ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లు పాల్గొన్నారు. వీరికి ఫీల్డ్ ట్రైనర్లుగా డిగ్రీ లెక్చరర్లు టి.రమేష్, కామేష్ వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లు, డేటా సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడు తూ మండలంలో 144 హెచ్ఎల్బిలకు గాను 136 ఇన్యుమరేటర్లని మరియు 22 మంది సూపర్ వైజర్లను నియమించడం జరిగిందని తెలిపారు. వీరిని నాలుగు బ్యాచ్లుగా విడదీసి శిక్షణ తరగతులు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి బ్యాచ్కు మూడురోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందని, ఎన్యూమరేటర్లు అందరూ అంకితభావంతో పనిచేసి జనగణనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 13 నుంచి విలేకరులకు ఆరోగ్యపరీక్షలు

శ్రీకాకుళం, ఏప్రిల్9, ప్రభాతవార్త: ఏప్రిల్ 13 నుండి విలేఖరులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కమ్మినాన చెన్నకేశవరావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల కోసం ఈ నెల 13 నుండి ప్రత్యేక ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు జెమ్స్ ఆసుపత్రిలో నిర్వహిస్తామ న్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకు న్నట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షల వివరాలు: ఈ నెల 13వ తేదీ నుంచి జెమ్స్ ఆసుపత్రిలో బ్యాచ్ల వారీగా ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో (గుండె సంబంధిత), కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సిబిపి) వంటి కీలక పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి జన రల్ ఫిజిషియన్స్, కార్డియాలజిస్ట్, న్యూరో, ఆర్థో, గ్యాస్ట్రో నిపుణుల ద్వారా తనిఖీలు చేయనున్నట్లు వివరించారు.వైద్య పరీక్షలకు హాజరు కావాలనుకునే జర్నలిస్టులు తమ పేరు, పనిచేస్తున్న మీడియా ఆర్గనైజేషన్, అక్రిడిటేషన్ నంబరుతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు, అందరి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను సమాచార శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ముందుగా ఈ నెల 10వ తేదీ లోపు 8985539662, 9493399367 ఫోన్ నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న వారు, వారికి కేటాయించిన తేదీల్లో మాత్రమే ఆసుపత్రికి హాజరుకావాల్సి ఉంటుందనీ తెలిపారు. మీడియా మిత్రులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రాజకీయ కక్షతో తాగునీటి కొళాయి పైపులైన్ ధ్వంసం



సంతబొమ్మాళి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : కోటపాడు పంచాయతీ కాశీపురం కాలనీలో గురువారం రాజకీయ కక్షతో కొందరు టిడిపి కార్యకర్తలు తాగునీటి కొళాయిని విరగొట్టి ప్రతాపం చూపారని వైఎస్ఆర్సిపి కార్యకర్త గేదెల జనార్దనరావు గురువారం తెలిపారు. మా ఇంటి ముందు ఉన్న త్రాగునీటి కొళాయిని ఎవరు లేని సమయంలో వచ్చి విరగొట్టారన్నారు. సోషల్ మీడియాలో వైఎస్ఆర్ పార్టీకి చెందిన ఫోటోలు వీడియోలు వైరల్ చేయడంతో నాపై కక్ష కట్టారన్నారు. అసలే వేసవికాలం త్రాగునీటి కొళాయి విరగ్గొట్టడంతో నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశానని బాధితులు తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఆర్. క్రాంతి కుమార్ని అడుగగా ఈ విషయం నా దృష్టికి వచ్చిందని, సమస్య పరిష్కరిస్తానని అన్నారు.

## జనగణన నిర్వహణ బాధ్యత సచివాలయ ఉద్యోగులదే..



కోటబొమ్మాళి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : గ్రామాల్లో "జనగణన" పారదర్శకంగా నిర్వహించే బాధ్యత సచివాలయ ఉద్యోగు లపైనే ఉందని స్థానిక తహసిల్దార్ చింతలపూడి ప్రసాదరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనంలో గురువారం సెన్సెస్ 2027, (జన గణన) లో భాగంగా మొదటి దశలో ఒకటవ బ్యాచ్ శిక్షణ తరగతినీ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ జనగణన కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి వెళ్లి బాధ్యతగా నిర్వహించాలని, స్థానికంగా ఉండే మీకే ఈ కార్యక్రమం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిని పరిగణలోకి తీసుకోవలసిన అవసరం లేదన్నారు. ఈ గ్రామస్తులైనా ఎక్కడో స్థిరపడితే వారికి అక్కడ జనగణనలో నమోదు కాబడతారని తెలిపారు. స్థానికంగా ఉన్నవారు ఏ ఒక్కరు తప్పి పోకుండా చూడాలన్నారు. మనం చేసే ఈ కార్యక్రమంలో ఎవరికి ఇబ్బందులు కలగకూడదని, ప్రతి ఒక్కరూ నమోదు కావాలని సూచించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా కోటబొమ్మాళిలో నాలుగు బ్యాచులుగా విడదీసి, ఒక్కో బ్యాచ్కి మూడు రోజులు చొప్పున శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మొదటి రోజైన గురువారం 40 మంది సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. శిక్షణ సమయంలో వీరికి ఆహార, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు ఎం.ఈ.ఓ డి. గోవిందరావు, ఏ.ఎస్.ఓ ఏ. రవికుమార్, ట్రైనీలు సూర్యనారాయణ, మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పందిరిరాట కార్యక్రమం



కవిటి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: మండలం లోని పెద్దకపాసుకుద్ది గ్రామంలో కొలువై ఉన్న శ్రీ శ్రీ వెంక టేశ్వర స్వామి దేవాలయ ఆవరణములో జరగబోయే విశ్వశాంతి మహా యజ్ఞం సందర్భంగా తొలి ఘట్టం శ్రీ వెంకటేశ్వరస్వామి యువజన సంఘం ఆధ్వ ర్యంలో గురువారం దేవాలయ ప్రాంగణంలో పండి తులు వేదమంత్రాలు నడుమ కంభస్థానం (పందిరిరా ట) కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిం చారు. కార్యక్రమానికి చుట్టుపక్క గ్రామాల పెద్దలు, మహిళలు భక్తుశ్రద్ధలతో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయితీ పెద్దలు గ్రామ పెద్దలు శ్రీ వెంకటేశ్వర స్వామి యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదికకు విశేష స్పందన



పాతపట్నం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: స్థానిక కెఎస్ ఎం ప్లాజాలో గురువారం విద్యుత్ వినియో గదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన వినియోగదా రుల నుండి ఫోరమ్ సభ్యులు వినతులను స్వీకరించారు. పాతపట్నం మండలం నుంచి 39 అర్జీలు, మెళియాపుట్టి మం డలం నుంచి 03 అర్జీలు, జలుమూరు మండలం నుంచి 01 అర్జీ, మొత్తంగా 43 అర్జీలు దాఖలయ్యాయి. వినియోగదారులు ప్రధానంగా గ్రామాల్లో నెలకొన్న లోవోల్టేజ్ సమస్యలు, గోల్డ్ స్మిత్, సెలూన్ షాపులకు అందాల్సిన విద్యుత్ సబ్సిడీలు, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించే లైన్ షిఫ్టింగ్ వంటి అంశాలపై ఫోరమ్కు ఫిర్యాదు చేశారు. అర్జీలను స్వీకరించిన అనంతరం ఫోరమ్ ప్రతినిధులు మాట్లాడుతూ అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన తర్వాత తగు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఫోరమ్ ఇచ్చే ఆదేశాల మేరకు ఆయా సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడం జరుగుతుందని వారు స్పష్టం చేశారు. ఫోరమ్ చైర్ పర్సన్ డాక్టర్ బి. సత్యనారాయణ (విశ్రాంత జిల్లా న్యాయమూర్తి)తో పాటు సభ్యులు ఎస్.సుబ్బారావు (ఆర్థిక విభాగం), విజయ చాముండి (సాంకేతిక విభాగం), ఎన్.మురళీ కృష్ణ (స్వతంత్ర సభ్యులు), విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

## నేడు ఐటీడీఏ ఎదుట ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా

సీతంపేట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : గిరిజనులు సేకరిస్తున్న జీడిపిక్కలు కిలో రెండు వందల రూపాయలకు గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఐ టి డి ఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరుగుతుందని ఆదివాసి గిరిజన సంఘం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## అభయ మణికంఠ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట

సంతకవిటి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: మిర్తివలసలో అభయ మణికంఠ స్వామి ఆలయం ప్రతిష్ట కార్యక్రమం ఆలయ ధర్మకర్తలు రాజపు త్రినాథరావు ఆదిలక్ష్మి దంపతులు మరియు కీర్తిశేషులు మాజీ ఎంపీటీసీ గార తవిటినాయుడు కుమారుడు గార బాబురావు సహాయంతో వారి ఆధ్వర్యంలో గుడి పూర్తి చేసి తేది 9/4/2026 నుండి 11/4/2026 వరకు పూజ కార్యక్రమలు జరుగును. 11/4/2026 శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి మహా అన్న సమారాధన జరుగును.

# శ్రీకాకుళం వార్త



## దోకిపర్తి షణ్ముఖరావు మాస్టారు 13వ వర్ధంతి



పాతపట్నం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ ప్రధానోపా ధ్యాయులు దివంగత దోకిపర్తి షణ్ముఖరావు మాస్టారు 13వ వర్ధంతి కార్యక్రమం గురువారం మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ఇన్చార్జ్ హెచ్ఎం ఎం.వాసుదేవరావు అధ్యక్షతన, రామ రాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటగా షణ్ముఖరావు మాస్టారు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా విద్యార్థులకు సెకండరీ పాఠశాల విద్యార్థులపై మొబైల్ ఫోన్ల ప్రభావం అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిం చారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు తొమ్మిదవ తరగతి సమ్మేటివ్ అసెస్మెంట్2 పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు జి ధనుష్, బి లావణ్య, ఎస్ కీర్తన, ఈ రోహిత్, ఎస్ లావణ్య, ఎ మురళీ లకు రామరాజు అభినందన పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సారవకోట మండల విద్యాశాఖ అధికారి ఎం వి రమణ మాట్లాడుతూ షణ్ముఖరావు మాస్టారు ఉపాధ్యాయుడిగా,ప్రధానోపాధ్యాయుడిగా ఎంతోమంది విద్యార్థులను క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులుగా ఆయన చేసిన సామాజిక సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం రామారావు, ఎ భాస్కరరావు, ఎస్ కృష్ణారావు, పి. కమలమ్మ, పి గౌతమి, ఎస్ కృష్ణవేణి, డి శారద, బి మోహనరావు, ఎస్ శ్రీవిద్య, మరియు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యూరియా వాడకం తగ్గించి... భూసారాన్ని కాపాడుకుందాం



పాతపట్నం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: వ్యవసాయ రంగంలో రైతులు అనుసరి స్తున్న పాత పద్ధతుల్లోని మెళకువలను గుర్తించి, ఆధునిక సాంకేతికతను జోడిం చే లక్ష్యంతో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో పూర్వ అభ్యసన గుర్తింపుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కె సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాతపట్నం గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా ఏఓ సింహాచలం మాట్లాడుతూ యూరియాను మోతాదుకు మించి వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా వల్ల మొక్కల్లో అనవసర పచ్చదనం పెరిగి నాణ్యత, దిగుబడి తగ్గుతుందన్నారు. భూగర్భ జలాలు కలుషితమై ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని సూచించారు. పంట కోతల తర్వాత వ్యర్థాలను తగులబెట్టడం వల్ల కలిగే నష్టాలను ఆయన వివరించారు. ఒక టన్ను వ్యర్థాలను కాల్చడం వల్ల 5.5 కిలోల నత్రజని, 2 కిలోల భాస్వరం, 2.5 కిలోల పొటాష్తో పాటు కీలకమైన సేంద్రియ కర్బనం నష్టపోతామని హెచ్చరించారు. వ్యర్థాలను కాల్చడం వల్ల నేల ఉష్ణోగ్రత 8 డిగ్రీలు పెరిగి, మేలు చేసే బ్యాక్టీరియా చనిపోతుందని తెలిపారు. వీటికి బదులుగా వ్యర్థాలను పశువుల మేతగా, కంపోస్ట్ తయారీకి లేదా నేలలో తేమను రక్షించే మల్చింగ్గా ఉపయోగించుకోవాలని సూచించారు. రైతు ప్రతినిధి బండి ఆనందరావు మాట్లాడుతూ మొక్కజొన్నను నూర్పు యంత్రాలతో కోత కోసుకోవడం లాభదాయకమని తెలిపారు. ప్రభుత్వం నేరుగా మొక్కజొన్నను కొనుగోలు చేస్తే రైతులకు మరింత మేలు జరుగుతుందని ఈ సందర్భంగా కోరారు. ఏపీసీఎన్ఎఫ్ ఫార్మర్ సైంటిస్టులు మీనాక్షి, నిర్మల మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు చాందిని, లోకేష్, సూర్య, రైతులు ఎన్ని రామారావు, వంజరాపు లింగమూర్తి, రమేష్, అమ్మా రావు, వెంకట్రావు, సుందర్ రావు, సీతారాం, తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



పాతపట్నం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్ ఆధ్వర్యంలో తెదెపా శ్రేణులు స్థానిక కేఎస్ఎం ప్లాజాలో గురువారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫోరమ్ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాతపట్నంలోని పలు వీధుల్లో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పాత ఐరన్ స్తంభాలు తుప్పు పట్టి అత్యంత ప్రమాదకరంగా మారాయని ప్రజల భద్రత దృష్ట్యా వాటి స్థానంలో వెంటనే కొత్త సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బాలాజీ నగర్, విద్యానగర్, నీలకంఠాపురం వంటి చాలా వీధుల్లో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు ఆవశ్యకతను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక అమ్మవారి గుడి కాలనీ, నీలకంఠాపురం కాలనీ మరియు ఇతర వీధుల్లో లో వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల గృహోపకరణాలు పాడవుతు న్నాయనీ పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సిజిఆర్ఎఫ్ చైర్మన్ మరియు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్ర మంలో తెదెపా నాయకులు అక్కంద్ర సన్యాసిరావు , శ్రీరామ్ దుర్గాప్రసాద్, గోరిశెట్టి దుర్గారావు, ఇప్పిలి మురళి, ప్రశాంత్ కుమార్ పాడి, ఏడుకొండలు, దాసరి నీలకంఠం, మద్దిల సంతోష్, నల్లి సుభాష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్



పాతపట్నం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి నేరుగా సమస్యలు తెలుసుకొని వాటిని తక్షణమే పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రజాదర్బార్ కు 40 వినతులు వచ్చినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. భూవివాదాలు, రెవెన్యూ, రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి ప్రధాన సమస్యలతో పాటు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇల్లు స్థలాలు, గృహ నిర్మాణాలు, వృద్ధులు- వికలాంగులు- వితంతువుల వ్యక్తిగత వినతులు స్వీకరించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి అర్జీపై స్పష్టమైన చర్యలు తీసుకుని, 15 రోజుల్లో పరిష్కార వివరాలు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు ఎమ్మెల్యే గోవిందరావు స్పష్టం చేశారు.

10-4pg10.qxd:10-4pg10.qxd 1/1/02 7:17 AM Page 1



# శతకానికి ఇంకెంత దూరం!





**ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ప్రారంభమై రెండు వారాలు పూర్తయింది.15 మ్యాచ్‌లు ముగిశాయి. సిక్స్‌ల మోత మోగుతోంది. ఇప్పటికే 229 సిక్స్‌లు, మరో 427 ఫోర్లు బాదారు. ధనాధన్ ఇన్నింగ్స్‌లకూ కొదవలేదు. అయినా ఇప్పటికీ ఆ ఒకటి లోటుగా ఉంది. ఏ మ్యాచ్‌కు ఆ మ్యాచ్‌లో ఆ లోటు తీరుతుందని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా ఆశ నెరవేరడం లేదు. హాఫ్‌సెంచరీల వరద పారుతున్నా ఫులల్‌సెంచరీ ఎపుడన్నది ఆసక్తిగా మారింది. ఐపీఎల్‌లో మొదటగా సెంచరీ సాధించే హీరో ఎక్కడ అని క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్నారు.**

(వార్త క్రీడా విభాగం)

ఐపీఎల్ 2025 సీజన్ రెండో మ్యాచ్‌లోనే శతకం నమోదైంది. రాజస్థాన్ రాయల్స్‌పై ఇషాన్ కిషన్ (ఎస్ఆర్‌హెచ్) కేవలం 45 బంతుల్లోనే సెంచరీ మోత మోగించాడు. ఆ సీజన్‌లో తొలి సెంచరీ చేసిన మొనగాడిగా నిలిచాడు. మొత్తంగా గత ఏడాది ఐపీఎల్‌లో 9సెంచరీలు నమోదయ్యాయి. అభిషేక్ 55 బంతుల్లో 141 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇషాన్, అభిషేక్‌తో పాటు రిషబ్ పంత్, రాహుల్, సాయి సుదర్శన్, క్లాసెన్, ప్రియాన్ష్ ఆర్యా, వైభవ్ సూర్యవంతి శతకాలు బాదారు. ముఖ్యంగా వైభవ్... గుజరాత్‌పై 37 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్స్‌లతో మెరుపు శతకం సాధించాడు.

ఐపీఎల్ 2026లో ఇప్పటివరకు కేఎల్ రాహుల్ (92), సమీర్ రిజ్వీ(90) మాత్రమే నైంటీస్ లోకి వచ్చారు. ఇద్దరూ కూడా ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లే. కఎల్ రాహుల్... గుజరాత్‌పై సెంచరీ సాధించే ఊపులో కనిపించినా తృటిలో చేజార్చుకున్నాడు. మరో ఇద్దరు రికల్టన్(81), ఇషాన్ కిషన్(80) 80 ప్లస్ రన్స్ చేశారు. కానీ ఎవ్వరూ సెంచరీ సాధించలేకపోయారు.

మ్యాచ్‌లో ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ ఓ హోదాను, ప్రత్యేకతను సూచిస్తుంది. ఆరెంజ్ క్యాప్ ధరించారంటే అప్పటివరకు అతనే అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ కింద లెక్క. అత్యధిక వికెట్లుతో ఉన్న వారు పర్పుల్ క్యాప్ ధరిస్తారు. ఈ రేసులో యశస్వి జైస్వాల్(170 రన్స్), రవి బిష్ణోయ్ (7 వికెట్లు) ముందున్నారు.

**పరుగుల వేటలో యశస్వీ జైస్వాల్**

ఐపీఎల్ 2026 సీజన్ ఇప్పుడిప్పుడే అసలైన హీట్ అందుకుంటోంది. లీగ్‌లో 15 మ్యాచ్‌లు ముగిసేసరికి పాయింట్ల పట్టికతో పాటు, ఆరెంజ్ క్యాప్ (అత్యధిక పరుగులు), పర్పుల్ క్యాప్ (అత్యధిక వికెట్లు) రేసు రసవత్తరంగా మారింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, మార్‌క్రమ్, అభిషేక్, ఇషాన్, సంజూ లాంటి వాళ్లను వెనక్కి నెట్టిరాజస్థాన్ రాయల్స్ యంగ్ సెన్సేషన్ యశస్వి జైస్వాల్.. ఆరెంజ్ క్యాప్ రేసులో ముందున్నాడు.3 మ్యాచ్‌ల్లో 170 స్ట్రైక్ రేట్‌తో 170 పరుగులు సాధించాడు. అందులో రెండు అర్ధసెంచరీలు ఉన్నాయి. మరో యువ సంచలనం సమీర్ రిజ్వీ 160 పరుగులతో రెండో స్థానంలో ఉంటే, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర బ్యాటర్ హెన్రిక్ క్లాసెన్145 పరుగులతో మూడో స్థానంలోఉన్నాడు. ఇక 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 122 పరుగులతో టాప్4లో నిలిచి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. రోహిత్ శర్మ(118) అయిదో స్థానంలో ఉన్నాడు.



**రవి బిష్ణోయ్ పర్పుల్ క్యాప్**

వికెట్ల వేటలో స్పిన్ మాంత్రికుడు బిష్ణోయ్ ముందు నిలిచి పర్పుల్ క్యాప్‌ను తన ఆధీనంలో ఉంచు కున్నాడు. ఈ రాజస్థాన్ రాయల్స్ లెగ్ స్పిన్నర్ 3 మ్యాచ్‌ల్లో 7 వికెట్లు పడగొట్టాడు. ప్రసిద్ధ్ కృష్ణ 6 వికెట్లతో గట్టి పోటీ ఇస్తుండగా... రషీద్ ఖాన్, లుంగీ ఎన్గిడి వంటి స్టార్ బౌలర్లు 5 వికెట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ సీజన్‌లో స్పిన్నర్లు, పేసర్ల మధ్య వికెట్ల వేట పోటాపోటీగా సాగుతోంది.

ఐపీఎల్ 2026 సీజన్‌లో సిక్సర్ల మోత మోగుతోంది. ఇప్పవరకు 229 సిక్స్‌లు నమోదయ్యాయి. ఎక్కువ సిక్స్‌లు బాదిన ప్లేయర్లలో వైభవ్ సూర్యవంశీ, సమీర్ రిజ్వీ టాప్ ప్లేస్‌లో ఉన్నారు. చెరో 11 సిక్స్‌లు బాదారు. రికల్టన్ (ముంబై), టిమ్ డేవిడ్(ఆర్సీబీ), రజత్ పాటిదార్(ఆర్సీబీ) తలా 9 సిక్స్‌లు, యశస్వీ జైశ్వాల్ 8 సిక్స్‌లు నమోదుచేశారు.

ఈ సీజన్ లో ఇప్పటివరకు ఒక ఇన్నింగ్స్ లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు కేఎల్ రాహుల్ పేరిట ఉంది. గుజరాత్ టైటాన్స్‌పై ఆయన చేసిన 92 పరుగులు హైలైట్‌గా నిలిచాయి. రవి బిష్ణోయ్ గుజరాత్ టైటాన్స్‌పై 4 ఓవర్లలో 41 పరుగులిచ్చి 4 వికెట్లు తీసి ఈ సీజన్ బెస్ట్ స్పెల్ నమోదు చేశాడు. ముజరబానీ కూడా ఒక మ్యాచ్‌లో 4 వికెట్లు తీశాడు. ఈ సీజన్‌లో మేటి ప్లేయర్లను వెనక్కి నెడుతూ యంగ్ గన్స్ దూసుకువస్తున్నారు. చూస్తుంటే యువ ఆటగాళ్ల, అనుభవజ్ఞుల మధ్య పోరు స్పష్టంగా కనిపిస్తోంది.

---

తొలి రౌండ్‌లోనే లక్ష్య సేన్, శ్రీకాంత్ పరాజయం

## ఏడో సీడ్‌పై ఆయుష్ సంచలనం



**నింగ్బో (చైనా):** ఆసియా సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో భారత రైజింగ్ స్టార్ ఆయుశ్ శెట్టి సంచలనంతో శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో 21-13, 21-16తో ప్రపంచ 7ర్యాంకర్ లిన్ షి ఫెంగ్ (చైనా)ను బోల్తా కొట్టించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 51 నిమిషాల్లో ముగించాడు. రెండు గేముల్లోనూ ఆయుశ్ తొలుత వెనుక బడ్డా... సంయమనం కోల్పోకుండా ఆడి ఆధిక్యం చాటాడు. అదే జోరులో గేమ్‌లను సొంతం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన హెచ్ఎస్ ప్రణయ్ కూడా ముందంజ వేశాడు. ప్రణయ్ 24-22, 21-12తో నుగుయెన్ హాయ్ డాంగ్ (వియత్నాం)పై గెలుపొందాడు. అయితే భారత నంబం వన్ లక్ష్య సేన్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించి నిరాశపరిచారు. ప్రపంచ 22వ ర్యాంకర్ లీ చెయుక్ యి (హాంకాంగ్)తో జరిగిన మ్యాచ్‌లో లక్ష్య సేన్ 12-21, 19-21తో ఓడిపోయాడు. లీ చెయుక్ చేతిలో లక్ష్య సేన్‌కిది నాలుగో ఓటమి కావడం గమనార్హం. ఈ ఏడాది మలేసియా ఓపెన్‌లోనూ లీ చెయుక్ చేతిలో లక్ష్య సేన్ పరాజయం పాలయ్యాడు. ప్రపంచ మాజీ చాంపియన్‌లో కీన్ యెవ్ (సింగపూర్)తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-18, 9-21, 11-21తో ఓటమి చవిచూశాడు. 52 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నా... అదే జోరును కొనసాగించడంలో విఫలమై ఓటమి మూటగట్టుకున్నాడు.

## లక్నో సూపర్ జెయింట్ ముకుంద్

**కోల్‌కతా:** కోల్‌కతా: ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. కేకేఆర్ గెలుపు బోణీ ఆశలపై ముకుంద్ చౌదరి(27 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లతో 54 నాటౌట్) నీళ్లు చల్లాడు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌ను అద్భుత విజయాన్ని అందించాడు. 182 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన లక్నో ఓ దశలో 128పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. అప్పటికే 16 ఓవర్లు ముగిశాయి. విజయం సాధించాలంటే 24 బంతుల్లో 54 పరుగులు సాధించాల్సిన పరిస్థితి. ఈ దశలో ముకుల్ చౌదరీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 17వ ఓవర్లో అరోరా బంతులకు 4, 6... 18వ ఓవర్లో రెండు సిక్స్‌లు, 19వ ఓవర్లో గ్రీన్ బంతులపై 6,4,6తో 19 రన్స్ సాధించాడు. చివరి ఓవర్లో విజయానికి 6 బంతుల్లో 14పరుగులు చేయాలి. అరోరా వేసిన చివరి ఓవర్లో రెండో బంతికి సిక్స్, అయిదో బంతికి సిక్స్ బాది లక్నోకు అద్భుత విజయాన్ని అందించాడు. మిగతా బ్యాట్స్‌మెన్లలో బదోనా (54) అర్ధసెంచరీతో రాణించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లలో వైభవ్ అరోరా, అంకుల్ రాయ్ చెరో రెండేసి వికెట్లు పడగొట్టారు.




అంతకుముందు రహానే(41) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆదుకోగా.. రఘువంశీ(45)మరోసారి మెరిశాడు. ఆఖర్లో పావెల్(39 నాటౌట్),కామెరూన్ గ్రీన్(32 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 181 పరుగులు చేసింది.

## భారత్ తొలి టెస్ట్ విక్టరీ హీరో కన్నుమూత



**చెన్నై:** భారత క్రికెట్‌లో విషాదం చోటు చేసుకుంది. టీమిండియా తొలి టెస్ట్ గెలిచిన జట్టులోని చివరి ఆటగాడు దొరైస్వామి గోపీనాథ్(96) కన్నుమూశారు. భారత అత్యంత వృద్ధ టెస్ట్ క్రికెటర్ కూడా ఆయనే. చెన్నైలోని తన నివాసంలో వృద్ధాప్య సమస్యలతో గోపీనాథ్ గురువారం తుదిశ్వాస విడిచారు. 1952లో ఇంగ్లండ్‌పై భారత్ సాధించిన తొలి టెస్ట్ విజయంలో గోపీనాథ్ కీలక పాత్ర పోషించారు. ఈటెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ 8 పరుగుల తేడాతో గెలిచి చరిత్ర సృష్టించింది. ఆ చారిత్రత్మ మ్యాచ్‌లో గోపీనాథ్ 35 పరుగులు చేశారు. తొలి టెస్టు విజయం సాధించిన భారత జట్టులో ఇప్పటివరకు జీవించి ఉన్న ఏకైక క్రికెటర్ గోపీనాథ్ కావడం విశేషం. ఇప్పుడు ఆయన మరణంతో భారత క్రికెట్‌లో ఒక శకం ముగిసింది.

1951లో ఇంగ్లండ్‌పై అంతర్జాతీయ అరంగేట్రం చేసిన గోపీనాథ్ తన కెరీర్‌లో భారత్ తరపున 8 టెస్టులు ఆడారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మద్రాస్ తరపున 83 మ్యాచ్‌లు ఆడారు. గోపీనాథ్ తన అరంగేట్ర మ్యాచ్‌లోనే మెరుపులు మెరిపించాడు. తన అరంగేట్ర టెస్టులో 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన గోపీనాథ్ మొదటి ఇన్నింగ్స్‌లో అజేయంగా 50, రెండో ఇన్నింగ్స్‌లో 42 పరుగులు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. మొత్తంగా ఆయన 8 మ్యాచ్‌లలో 242 పరుగులు చేశారు. ఆయన మృతి పట్ల బిసిసిఐ, పలువురు క్రికెటర్లు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలిపారు.

---

వాణిజ్యం




## టిసిఎస్ లాభం 13వేల కోట్లు

**ముంబయి, ఏప్రిల్ 9:** టాటా గ్రూప్‌నకు చెందిన దిగ్గజ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) త్రైమాసిక ఫలితాలను గురువారం స్టాక్ మార్కెట్లు ముగిసిన తర్వాత ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కంపెనీ రూ.13,718 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే నాలుగో త్రైమాసికం ఫలితాలతో పోలిస్తే ఈసారి కంపెనీ నికరలాభం ఏకంగా 12 శాతం పెరిగింది. మార్కెట్ అంచనాలను మించి లాభాలనుఆర్జించింది. కంపెనీ ఆదాయం సైతం ఏకంగా 10 శాతం మేర పెరిగింది.

నాలుగో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.70,698 కోట్లుగా నమోదైనట్లు టీసీఎస్ తెలిపింది. ఈ క్రమంలో టీసీఎస్. తమ వాటాదారులకు ఫైనల్ డివిడెండ్ కింద ఒక్కోషేరుకు రూ.31 చొప్పున చెల్లిస్తామని తెలిపింది. ఇందుకు కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ నుంచి ఆమోదం లభించిందని, షేర్ల హోల్డర్ల ఆమోదానికి లోబడి ఈ డివిడెండ్ చెల్లింపులు ఉంటాయని పేర్కొంది. గడిచిన నాలుగో త్రైమాసికంలో తమకు మూడు మెగా డీల్స్ లభించినట్లు టీసీఎస్ వెల్లడించింది. ఈమూడు మెగా డీల్స్ మొత్తం కాంట్రాక్ట్ విలువ 12 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వెల్లడించింది.

వరుసగా మూడో త్రైమాసికంలో మేము లాభాలను నమోదు చేశామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. 12 బిలియన్ డాలర్ల కాంట్రాక్ట్ విలువ గల మూడు మెగా డీల్స్ అందుకోవడం వల్ల ఇది సాధ్యమైంది. అలాగే మా 5 పిల్లర్ల వ్యూహం, మా ఏఐ ఆధారిత సేవలు సైతం ఇందుకు దోహదపడ్డాయని టీసీఎస్ సీఈఓ, ఎండీ కే క్రితివాసన్ పేర్కొన్నారు. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో కంపెనీని మంచి స్థానంలో ఎలా నిలబెట్టాలి, ఏఐని పూర్తి స్థాయిలో ఎలా అందిపుచ్చుకోవాలని అనే అంశాలపైనే ఫోకస్ చేస్తున్నట్లు తెలిపారు.

టీసీఎస్ గత ఆర్థిక సంవత్సరాన్ని మొత్తం 40.7 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ సాధించింది. ఒక ఏడాదిలో ఐదు మెగా డీల్స్ సాధించి అత్యధిక డీల్స్ సాధించిన ఏడాదిల్లో ఒకటిగా నిలిచింది. కంపెనీ తన బిల్డ్ పార్ట్‌నర్ అక్వైర్ విధానం ద్వారా పెట్టుబడులను ముమ్మరం చేసింది.

కోస్టల్ క్లౌడ్, లిస్ట్ ఎంగేజ్‌లను కొనుగోలు చేసి, హైపర్‌వాల్ట్‌ను స్థాపించింది. గత ఆర్థిక ఏడాదిలో టీసీఎస్ కంపెనీకి మొత్తం రూ.2.67 లక్షల కోట్ల ఆదాయం లభించింది. ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపదికన చూసుకుంటే టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు 5 శాతం మేర ఆదాయం పెరిగింది.

# ఈక్విటీలకు హార్ముజ్ ఎఫెక్ట్

## నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, ఏప్రిల్ 9:** దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. వరుసగా 5 రోజుల పాటు లాభాలు అందుకున్న సూచీలు ఈరోజు భారీగా పడిపోవడం గమనార్హం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టినట్లు కనిపించినా ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయాలు నెలకొన్నాయి. ఇరాన్‌అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో యుద్ధానికి బ్రేకులు పడినట్లు కనిపించినా లెబనాన్ పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితులు మళ్లీ మొదటికి వచ్చాయి. ఈ దాడులకు ప్రతిగా హార్ముజ్ జల సంధిని ఇరాన్ మళ్లీ మూసివేయడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మళ్లీ దూసుకెళ్లాయి. ఇది స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపించింది. ఇన్వెస్టర్లకు లాభాల స్వీకరణకు దిగడం, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కూడా నష్టాలకు కారణమయ్యాయి. దీంతో సెన్సెక్స్ ఒక దశలో 1000కి పైగా పాయింట్లు కోల్పోయింది. గురువారం రోజున ఉదయం సెన్సెక్స్ 77,319 పాయింట్ల వద్ద నష్టాల్లో ట్రేడింగ్ మొదలు పెట్టింది. రోజు మొత్తం నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,347 వద్ద కనిష్ఠ స్థాయిని తాకి చివరకు 931 పాయింట్లు కోల్పోయి 76,631 వద్ద ముగిసింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ 222 పాయింట్లు నష్టపోయి 23,775 వద్ద స్థిరపడింది. ఈ క్రమంలో డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 92.62 వద్ద కొనసాగింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ఎల్ అండ్ టీ, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ భారీగా నష్టపోయాయి. బీఈఎల్, పవర్ గ్రిడ్, ఎన్టీపీసీ, టీసీఎస్, హెచ్‌సీఎల్, వంటి స్టాక్స్ లాభపడ్డాయి.

అంతర్జాతీయ మార్కెట్లో మళ్లీ క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమన్నాయి. కాల్పుల విరమణతో 95 డాలర్ల దిగువకు వచ్చిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర మళ్లీ 98.42 డాలర్ల స్థాయికి ఎగబాకింది. బంగారం ధర ఔన్సుకు 4728 డాలర్ల స్థాయికి చేరింది. అనిశ్చిత పరిస్థితుల్లోనూ హిందాల్కో షేర్లు 3.56 శాతం లాభపడ్డాయి. ఆ తర్వాత డాక్టర్ రెడ్డీస్, బజాజ్ ఆటో, భారత్ ఎలక్ట్రానిక్స్, మ్యాక్స్ హెల్త్ కేర్ వంటి షేర్లు సగటున 1 శాతానికిపైగా లాభాలు అందుకున్నాయి. ఇండిగో, జియో ఫైనాన్షియల్ సగటున 3.25 శాతం మేర పడిపోయాయి. లార్సెన్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎటర్నల్ షేర్లు 2.35శాతం వరకు పడిపోయాయి. కీలక రంగాల్లో షేర్లు భారీగా నష్టపోవడంతో దేశీయ మార్కెట్ సూచీలు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఇరాన్ అమెరికా మధ్య యుద్ధం ఇంకా ముగియలేదన్న వార్తలు ఇన్వెస్టర్లను అప్రమత్తం చేశాయి

## అన్‌క్లెయిమ్డ్ ఫండ్స్ 2.2 లక్షలకోట్లు




**ముంబయి, ఏప్రిల్ 9:** బ్యాంకు డిపాజిట్లు, ఈక్విటీలు, ఇన్సూరెన్స్, ఈపీఎఫ్ అకౌంట్లు, మ్యూచుఫండ్లలో గత ఏడాది 2025 డిసెంబర్ నాటికి ఎవరూ క్లెయిమ్ చేయని సంపద రూ.2.2 లక్షల కోట్లుగా ఉన్నట్లు వ్యక్తిగత ఫైనాన్స్ అడ్వైజరీ సంస్థ ఫైనాన్స్ మ్యాగజైన్ వెల్లడించింది. ముఖ్యంగా స్టాక్ మార్కెట్లో ఎవరూ తీసుకోని సొమ్ము వేగంగా పెరుగుతోంది. షేర్ మార్కెట్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల విలువ రూ.89,000 కోట్లుగా ఉన్నట్లు నివేదిక అంచనావేసింది. మొత్తం 1671 కంపెనీల వద్ద ఇన్వెస్టర్ల సొమ్ము మూలుగుతోందని తెలిపింది. బ్యాంకు డిపాజిట్ల తర్వాత షేర్ మార్కెట్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రెండో స్థానంలో ఉన్నాయి. రూ. 2.2 లక్షల కోట్లకు పైగా విలువైన ఈ పెట్టుబడులు తక్కువ రాబడినిచ్చే నిద్రాణమైన పొదుపులు కావు. కానీ క్లెయిమ్‌లు అందకపోవడం, పని చేయని ఖాతాలు లేదా పెట్టుబడిదారులు, వారి కుటుంబాలలో అవగాహన లోపం కారణంగా అందుబాటులో లేకుండా పోయిన అధిక వృద్ధి సామర్థం గల పెట్టుబడులు ఉన్నాయి.

లక్షల కోట్ల సొమ్ము సరైన వ్యక్తులకు చేరడం లేదు. బహుళ ఫైనాన్షియల్ అసెట్స్ రూపంలో ఈ సొమ్ము ఉన్నట్లు నివేదిక తెలిపింది. బ్యాంక్ డిపాజిట్లలో రూ.97,545 కోట్లతో 44.2 శాతం సొమ్ము ఎవరూ తీసుకోలేదు. ఈక్వీటీ షేర్లలో రూ.89,004 కోట్లతో 40.3 శాతం, ఇన్సూరెన్స్ పాలసీల్లో రూ.20,062 కోట్లతో 9.1, ఈపీఎఫ్ అకౌంట్లలో రూ.10,915 కోట్లతో 4.9 శాతం, మ్యూచువల్ ఫండ్లలో రూ.3,452 కోట్లతో 1.6 శాతం,ఆర్ఈఐటీఎస్, ఇన్విట్స్, ఎన్సీడీల్లో 764 కోట్లతో 0.3 శాతం, చొప్పున అన్‌క్లెయిమ్డ్ ఫండ్స్ నిలిచిపోయాయి. వన్ ఫైనాన్స్ మ్యాగజైన్ ప్రకారం పైన చెప్పిన డేటా ఆర్‌బీఐ నోటిఫికేషన్స్, ఎన్ఎస్ఈ బీఎస్ఈ షేర్ హోల్డింగ్ ప్యాటర్న్స్, ఐఈపీఎఫ్ రూల్స్, ఐఆర్‌డీఏఐ యాన్యువల్ రిపోర్ట్స్, ఈపీఎఫ్ఓ డేటా, సెబీ యాన్యువల్ రిపోర్ట్స్ ఆధారంగా తీసుకున్నారు. బ్యాంకుల్లో ఉన్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను ఆర్‌బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవర్నెస్ ఫండ్‌లో జమ చేస్తున్నారు. వీటికి 3 శాతం సింపుల్ ఇంట్రెస్ట్ వస్తుంది. ద్రవ్యోల్బణం కారణంగా ఈ డబ్బు విలువ భారీగా తగ్గిపోతుందని చెప్పవచ్చు. గడిచిన 10 ఏళ్ల కాలంలోనే ఈ డబ్బు 34 రెట్లు పెరిగింది. 2015లో రూ.7875కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉంటే 2025 నాటికి 98,545 కోట్లకు పెరిగాయి. ఇక షేర్ మార్కెట్లో చూసుకుంటే దాదాపు 1671 కంపెనీలకు చెందిన 166 కోట్ల షేర్లు కొనుగోలు చేసి ఎవరూ క్లెయిమ్ చేసుకోని సొమ్ము విలువ రూ.89,004 కోట్లుగా ఉంది. ఇది ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ వద్ద ఉంటాయి. ఈ లింకులోకి లాగిన్ అయ్యి కస్టమర్లు తమకు సంబంధించిన సొమ్మును తనిఖీ చేసి క్లెయిమ్ చేసుకోవచ్చు.

## డిమాండ్ సరఫరాలు మాత్రమే.. రూపాయి విలువ నిర్ధారిస్తాయి: ఆర్బీఐ



**ముంబయి, ఏప్రిల్ 9:** పశ్చిమాసియా ఉద్రిక్తతలతో చమురుధరలు గ్లోబల్‌స్థాయిలోపెరగడంతో డాలర్ చెల్లింపులు పెరిగి రూపాయి భారీగా క్షీణించింది. అయితే ఈ క్షీణత కట్టడికి ఆర్‌బిఐ జోక్యం అవసరం లేదని తీవ్రస్థాయిలో ఉంటే డాలర్ల కౌంటర్లు తెరిచి రూపాయి క్షీణత కట్టడిచేస్తుందన్నారు. భాగంగానే కరెన్సీ విలువల్లో అధిక హెచ్చుతగ్గులు కనిపిస్తే మాత్రమే ఆర్బీఐ జోక్యంచేసుకుంటుందని చెప్పారు. ప్రస్తుతానికి మాత్రం ఎలాంటి ఆందోళనా అవసరం లేదని, జోక్యం చేసుకోబోమని చెప్పుకొచ్చారు. రూపాయి విలువను ఒక నిర్దిష్ట స్థాయి (90 లేదా 95 ఇలా) దగ్గర ఉంచడం తమ లక్ష్యం కాదని అన్నారు. డిమాండ్ అండ్ సప్లై మాత్రమే రూపాయి విలువను నియంత్రిస్తాయని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. బలమైన ఆర్థిక మూలాలు ఉన్నప్పటికీ అంతకుముందు ఏడాదులతో పోలిస్తే 202526 ఆర్థిక సంవత్సరంలో రూపాయి విలువ కాస్త ఎక్కువ మాత్రమే క్షీణించిందని మల్హోత్రా వివరించారు.

## మూడేళ్ల తర్వాత విప్రో షేర్ బైబాక్




**బెంగళూరు, ఏప్రిల్ 9:** టెక్నాలజీ దిగ్గజకంపెనీ విప్రో ఈఎల 15,16 తేదీల్లోనే షేర్ల బైబాక్‌నుప్రకటిస్తుందని కంపెనీ వర్గాలు చెపుతున్నాయి. ఆరోజే కంపెనీ నాలుగో త్రైమాసిక ఫలితాలు ప్రకటించడంతోపాటు బోర్డు ఆమోదంపొందిన తర్వాత షేర్‌బైబాక్‌ను కూడా ప్రకటిస్తుందని అంచనా. ఈనెల 16వ తేదీ కంపెనీ బోర్డు సమావేశం జరగనున్నది. ఈ వివరాలను కూడా ఎక్స్ఛేంజికి నివేదిస్తుంది. గడచిన మూడేళ్ల తర్వాత తొలిసారిగా విప్రో బైబాక్‌ను ప్రకటిస్తోంది. 2023జూన్‌లో ఒకసారి షేర్‌బైబాక్‌చేసిన కంపెనీ ఆనాడు షేర్లను రూ.445 చొప్పున రూ.12 వేల కోట్ల ఆఫర్‌తో ఆనాడు షేర్లు కొనుగోలుచేసింది. కంపెనీ మొత్తం ఈక్విటీ వాటాల్లో 4.91శాతం బైబాక్‌చేసింది. అంతకుముందు 2020లో విప్రో కంపెనీ రూ.400 చొప్పున రూ.9500 కోట్లవిలువైన షేర్లను బైబాక్‌చేసింది. మళ్లీ షేర్‌బైబాక్ ఉండవచ్చని అంచనా.

## జైప్రకాష్ ప్లాట్ల లబ్ధిదారులకు అదానీ భరోసా




**ముంబయి, ఏప్రిల్ 9:** జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్)లో ఫ్లాట్లు బుకింగ్ చేసుకుని 15 ఏళ్లుగా స్వాధీనం కోసం ఎదురుచూస్తున్న వందలాది మంది ఇంటి కొనుగోలుదారులకు ఊరట లభించింది. అదానీ గ్రూప్ రూ.14,500కోట్ల రుణ పరిష్కార ప్రణాళిక అమలుపై స్టే ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించిన క్రమంలో వారందరికీ 15 ఏళ్ల తర్వాత సొంతిళ్లు దక్కుతాయన్న ఆనందం కలుగుతోంది. దశాబ్దం న్నర కాలంగా ఎదురుచూస్తున్న బయ్యర్లకు అదానీ ఇప్పుడు ఆశాకిరణంగా కనిపిస్తున్నారు. జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్‌లో ఇళ్లు బుకింగ్ చేసుకుని స్వాధీనం చేసుకునేందుకు ఏళ్ల తరబడి చట్టపరంగా పోరాడుతున్నట్లు ఇంటి కొనుగోలుదారుల సంఘం సభ్యులు తెలిపారు. తమ రుణ పరిష్కార ప్రణాళిక ద్వారా ఈ ప్రాజెక్టులను అదానీ గ్రూప్ పూర్తి చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇంటి కోసం డబ్బులు చెల్లించి ఏళ్ల తరబడి ఈఎంఐలతో పాటు ఇంటి రెంటు సైతం కడుతున్న కొనుగోలుదారులు ఉన్నారు.

జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో దాదాపు 8వేల మంది బయర్లున్నారు. అదానీ గ్రూప్ ఈ ప్రాజెక్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత రెండేళ్లలో తమ చేతికి ప్రాపర్టీలు వస్తాయని వారంతా భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల్లో ప్రధానమైన నోయిడాలోని జేపీ గ్రీన్ విష్ టౌన్‌లో 2011లో చాలా మంది అపార్ట్‌మెంట్ల కోసం బుకింగ్ చేసుకున్నారు. నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ 2025, మార్చి 17న అదానీ ఎంటర్ ప్రైజెస్ రూ.14,535 కోట్ల రుణ పరిష్కార ప్రణాళికకు ఆమోదం తెలిపింది. జేఏఎల్ సంస్థకు సంబంధించి ప్రధాన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు జేపీ గ్రీన్, జేపీ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ వంటివి ఉన్నాయి. డిఫాల్ట్‌ల తర్వాత జేఏఎల్ దివాలా తీసింది. బయ్యర్లంతా అదానీ గ్రూప్‌కు జై కొట్టారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.